ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-11-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 271 పేజీలు: 10+4 వెల: 8.00



పేట్ బషీరాబాద్‌లో డిసిఎం ఢీ కొని ఎఎస్ఐ మృతి 3

వాయుకాలుష్యానికి 17 లక్షల మంది బలి 5




శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

### చెల్లికి న్యాయం చేయలేని కెటిఆర్

# 'జూబ్లీ'కి ఏం చేస్తాడు?

**బోరబండ చౌరస్తాకు పిజెఆర్ పేరు పెట్టి, విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తాం**

**ప్రజలను మభ్యపెడుతున్న బిల్లా, రంగాలు**

**కాంగ్రెస్‌ను గెలిపిస్తే జూబ్లీహిల్స్‌కు అవసరమైన నిధులిస్తా**

**ఉప ఎన్నికల ప్రచారంలో సిఎం రేవంత్‌రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్1:** మాజీ మంత్రి కేటీఆర్ తన సొంత చెల్లి కవితనే ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సొంత చెల్లికే న్యాయం చేయలేని కేటీఆర్.. జూబ్లీహిల్స్ ప్రజలకు ఏం మేలు చేస్తారని ప్రశ్నించారు. కేటీఆర్.. తన చెల్లికవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఏ ఆడబిడ్డా పుట్టింటిపై ఆరోపణలు చేయదని..సొంత చెల్లెలే కేటీఆర్‌ను దుర్మార్గుడివని అంటోందని విమర్శించారు. బిల్లా, రంగాలు ఆటోలో తిరుగుతూ జూబ్లీహిల్స్ ప్రజల దగ్గర నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. జూబ్లీహిల్స్ ప్రజలను బిల్లా, రంగాలు మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. >>2



### రంగుమారిన ధాన్యంతో అన్నదాత దిగాలు

**తగ్గిన దిగుబడి ఆదాయం, రాలిన పంట తీయడానికి అదనపు వ్యయం**

**కుళ్లిపోతున్న ధాన్యానికి కనీస రాబడి రాని వైనం**

**మద్దతు ధర రాదు.. బోనస్ లభించదు**

# వెన్ను విరిగిన రైతన్న

## మొంథా తుఫాన్‌తో పంట నీటిపాలు

**హైదరాబాద్,నవంబరు1,ప్రభాతవార్త:** మొంథా తుఫాను సృష్టించిన విధ్వంసం తెలంగాణ రాష్ట్రంలో 67.30లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేసిన రైతులకు ఓవైపు అదనపు భారం, మరోవైపు మద్దతుధర,బోనస్ రాకుండా వెన్నువిరిచింది. వరిధాన్యం సగటు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం ఉంటేనే బోనస్,మద్దతుధర చెల్లిస్తారు. ప్రస్తుతం వర్షంతో తేమ,రంగుమారి,ప్రభుత్వం నిర్ధేశించిన ప్రమాణాలకు అనుగుణంగాధాన్యం న్యాణత లేకపోవడంతో దిగుబడి తగ్గి అదనపు భారంపెరిగిన రైతులు దిగాలు పడుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న దశలో ఏకధాటిగా వర్షం కురవడంతో పొలాలు నేలవాలాయి.చేతికి అంది వచ్చిన పంట నేలపాల కావడంతో ఆ పంటను రక్షించుకోవడానికి రైతులు నేలవాలిన పైరును కట్టలు కడుతుండటంతో అదనపు కూలీ ఖర్చులు భారంగా మారి తడిసిమోపవుతన్నాయి.మొంథా తుఫాను కారణంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం,కరీంనగర్,ఖమ్మం,నల్లగొండ జిల్లాలో భూమి పదును ఉండటంతో రైతులు వరి కోతలను అత్యంత వ్యయప్రయాసలకోర్చి యంత్రాలతో కోతలు జరుపుతున్నారు. సాధారణంగా వరి కోసేందుకు ఎకరానికి గంట నుంచి గంటపావు పడుతుంది. పడిన పొలం >>2



### రేపటి నుంచి కాలేజీల

# నిరవధిక బంద్

### 6న 1.50 లక్షల మందితో మీటింగ్

**10న 10 లక్షల మందితో భారీ నిరసన సభ**

**తెలంగాణ ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య నిర్ణయం**

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 1:** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఉన్నత విద్యా సంస్థలకి సంబంధించిన ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో కాలేజీలను నిర్వహించడం కష్టంగా మారిందని.. రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్న నేపథ్యంలో రేపటి(నవంబర్ 3-సోమవారం) నుంచి నిరవధిక బంద్‌ను నిర్వహించనున్నట్టు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య(ఎఫ్ఏటిహెచ్ఐ) ప్రకటించింది. ఈ నెల 6న కాలేజీల్లో పనిచేస్తున్న లక్షలాది మంది సిబ్బందితో హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేయనుననట్టు ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల యాజమాన్య సమాఖ్య చైర్మన్ ఎన్ రమేష్ బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను అసోసియేషన్ నాయకులతో కలిసి ఆయన శనివారం హైదరాబాద్‌లో మీడియాకు తెలిపారు. సమావేశంలో సెక్రటరీ జనరల్ కెఎస్ రవికుమార్, వైస్ ఛైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కెసునీల్ కుమార్, కోశాధికారి కృష్ణారావు, కోఆర్డినేటర్ >>2

### షట్‌డౌన్‌తో రూ.62,149 కోట్ల

# సంపద ఆవిరి

**పతనం అంచున అమెరికా ఆర్థికవ్యవస్థ**



**వాషింగ్టన్, నవంబరు 1:** అధికార, విపక్షాల మధ్య బిల్లుల విషయంలో సయోధ్య కుదరకపోవడంతో 31 రోజులుగా అమెరికా ఆర్థిక వ్యవస్థ షట్ డౌన్‌లోనే ఉంది. నెల రోజులకు పైగా షట్‌డౌన్ కావడంతో అమెరికా ఆర్థిక వ్యవస్థలో 7 బిలియన్ డాలర్లకు పైగా సంపద ఆవిరైంది. ఈ మేరకు కాంగ్రెషనల్ బడ్జెట్ కార్యాలయం అంచనా వేసింది. ఇది మన కరెన్సీలో రూ. 62,149 కోట్లకు పైగా ఉంటుంది. షట్‌డౌన్ ఇలాగే కొనసాగితే ఆర్థిక వ్యవస్థపై ఏ మేరకు ప్రభావం పడుతుందో కూడా బడ్జెట్ కార్యాలయం అంచనాలు విడుదల చేసింది. ఇప్పటికే షట్‌డౌన్ వల్ల 7 బిలియన్ డాలర్ల మేర >>2



ఇండియా జాయ్ 2025 కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు

### 'క్రియేటివిటీ హబ్'గా

# హైదరాబాద్

**విఎఫ్ఎక్స్, గేమింగ్ అభివృద్ధికి కో క్రియేటర్‌గా ప్రభుత్వం**

**రండి.. ఫ్యూచర్స్ ఫండ్, ఇ-స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేద్దాం**

**ఇండియాజాయ్ 2025 ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు పిలుపు**

**హైదరాబాద్, నవంబరు 1 ప్రభాతవార్త:** హైదరాబాద్ కేవలం ఐటీ రాజధానిగా మాత్రమే కాదు, భారతదేశపు "క్రియేటివిటీ హబ్"గానూ తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్ర ప్రభు త్వం, తెలంగాణ విఎఫ్ఎక్స్ యానిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్(టివిఏజిఏ) సంయుక్త ఆధ్వర్యంలో హైటెక్ సిటిలోని హెచ్ఐసిలో రెండ్రోజుల పాటు "ఇండియా జాయ్ 2025" పేరిట నిర్వహించనున్న "ఇండియాస్ ప్రీమియర్‌మీడియా అండ్ ఎంటర్టైన్మెంట్ కాంగ్రెగేషన్‌ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. సాంకేతికత, సృజనాత్మకత కలిసే చోటుగా హైదరాబాద్ పిక్సెల్, కవిత్వం, అవకాశాల నగరం గా ప్రపంచానికి మార్గ నిర్దేశం చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. క్రియేటివ్ రంగానికి చేయుతనిచ్చేలా క్రియేటివ్ ఫ్యూచర్స్ ఫండ్, ఈస్పోర్ట్స్ అకాడమీ, మహిళా క్రియేటర్ల కోసం ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌ను ప్రభుత్వంతో కలిసి ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని సంబంధిత దిగ్గజ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశ గేమింగ్ పరిశ్రమ విలువ 20 శాతం సిఏజిఆర్ తో 2028 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. భారతదేశ మొత్తం విఎఫ్ఎక్స్ అవుట్ పుట్‌లో మన వాటా సుమారు 25శాతం ఉండటం మనకు గర్వకారణమన్నారు. హైదరాబాద్ ఓటిటి కంటెంట్ ప్రొడక్షన్‌లో 35 శాతం వృద్ధి రేటు నమోదు కావడం ఇక్కడి ఎకో సిస్టంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఇమేజ్ టవర్, ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ సిటి తదితరాల అందుబాటులోకి వస్తే ఈ ఎకో సిస్టం మరింత పటిష్టం అవుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇమేజ్ టవర్‌ను వచ్చే ఏడాదిలో అందుబాటులోకి తెస్తామన్నారు. క్రియేటివిటీలో సానుభూతి, వైవిధ్యం, సస్టైనబిలిటీ, భారతీయ గుర్తింపు ప్రతిబింబించేలా చొరవ తీసుకోవాలని యువ క్రియేటర్స్‌కు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం నియంత్రించేదిగా కాకుండా కో క్రియేటర్‌గా మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, యువ కథానాయకుడు తేజ సజ్జా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్, టీవీఏజీఏ ప్రెసిడెంట్ రాజీవ్ చిలక, కార్యదర్శి మాధవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నిజామాబాద్‌లో దారుణం

# మహిళ తల, చేయి నరికి హత్య

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లాలో దారుణం వెలుగు చూసింది. జిల్లాలోని నవీపేట మండలం ఫకీరాబాద్ మిట్టాపూర్ శివార్లలో గుర్తు తెలియని మహిళను దుండుగులు దారుణంగా హత్య చేశారు. బాసర ప్రధాన రహదారిపై తలలేని స్థితిలో మొండెం వున్న మృతదేహం పడి వుండగా శనివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ ఉదంతం బయట పడింది. మృతురాలి వయ స్సు 35 ఏళ్ల వరకు వుంటుందని, ఆమె నగ్నంగా పడి వుందని, ఒక చేతితో పాటు మరో చేతిలోని వేళ్లను నరికివేశారు. దీనిపై సమాచారం అందిన వెంటనే పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని మార్చ్యురీకి తరలించారు. ఘటనా స్థలికి >>2



శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో శనివారం తొక్కిసలాట దృశ్యం

### ఆలయంలో

# విషాదం

## తొక్కిసలాటలో 9 మంది మృతి

**శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో దుర్ఘటన**

**40 మందికి గాయాలు, నలుగురి పరిస్థితి విషమం**

**క్యూలైన్ రెయిలింగ్ ఊడిపడడమే కారణం!**

**ఏకాదశి కావడంతో పోటెత్తిన భక్తులు**

**ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

**ఘటనాస్థలికి వెళ్లిన కేంద్రమంత్రి రామ్మోహన్, మంత్రి లోకేష్**

**పలాస (శ్రీకాకుళం జిల్లా), నవంబర్ 1 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కాశీబుగ్గలో ఉన్న విజయ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట జరిగింది. 9 మంది భక్తులు చనిపోగా పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల్ని వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. కార్తీక మాసం, ఏకాదశి శనివారం కావడంతో వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఏకాదశి కావడంతో వెంకటేశ్వర స్వామి ఆలయానికి భారీగా వచ్చిన భక్తులు తరలివచ్చారు. అయితే మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఏకాదశి కావడంతో స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా వచ్చారని స్థానికులు చెబుతున్నారు.ఆలయంలో ఏర్పాటు చేసి క్యూలైన్లకు >>2



### మెడికల్ పిజి మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో

# 85 శాతం తెలంగాణకే

**నిర్ణయించిన సర్కార్.. సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి దామోదర రాజనర్సింహ్మా**

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 1:** రాష్ట్రంలో మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 85 శాతం తెలంగాణ విద్యార్థులకే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకూ మేనేజ్‌మెంట్ కోటా సీట్లన్నీ ఆల్ ఇండియా కేటగిరీలో భర్తీ అయ్యేవి. ఇకపై 85 శాతం సీట్లు తెలంగాణ బిడ్డలకే ఇవ్వాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తితో మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లు లోకల్ విద్యార్థులకు కేటాయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకుని వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని హెల్త్ సెక్రటరీని ఆదేశించారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంతో మెడికోల దశాబ్దకాల ఆకాంక్ష తీరనుంది. రాష్ట్ర విద్యార్థులకు అదనంగా 318 మెడికల్ పీజీ సీట్లతోపాటు 70 డెంటల్ పీజీ సీట్లు పెరగనున్నాయి. దీంతో రాష్ట్రంలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరగనుంది. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా రాష్ట్ర సర్కార్ చర్యలు తీసుకుంది. మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తూ చారిత్రక నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కృతజ్ఞతలు తెలిపారు. పీజీ సీట్ల కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది ఎంబీబీఎస్ డాక్టర్లకు ఈ నిర్ణయం ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎంబీబీఎస్ సీట్లతో పోలిస్తే, పీజీ సీట్లు తక్కువగా ఉండడం వల్ల పీజీ సీట్ల కోసం కాంపిటీషన్ >>2

**రెట్టింపునకు మించి పెరిగిన రేట్లు**

**తుఫాన్‌తో 60 నుంచి 70 % దాకా దెబ్బతిన్న పంటలు**

**అల్లాడుతున్న సామాన్య ప్రజలు**



# మండుతున్న కూరగాయల ధరలు



**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫానుతో మొన్నటివరకూ అందుబాటులో ఉన్న కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. భారీ వర్షాలు కురవడంతో కూరగాయల పంటలకు తీవ్ర నష్టం జరిగింది. వర్షాల కారణంగా 60 నుంచి 70 శాతం పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడి తగ్గిపోవడంతో మార్కెట్‌లో ధరలు అమాంతంగా పెరిగినాయి. పెరిగిన ధరలు సామాన్యులను అతలాకుతులం చేస్తున్నాయి.కూరగాయల ధరలు పెరిగిపోవడంతో మార్కెట్లో కొనేందుకు వెనకడుగు వేస్తున్నారు. మార్కెట్‌లోని వ్యాపారులు బెంగళూరు, అనంతపురం, చిత్తూరు, మదనపల్లి, కర్నూలు, కర్ణాటకలోని చంతామణి, కోలారు తదితర ప్రాంతాలు నుంచి దిగుమతి చేసుకుంటారు. అక్కడ కూడా పంట నష్టం జరగడం, మరోవైపు కార్తీక మాసం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కూరగాయలకు డిమాండ్ పెరిగింది. ప్రతి కూరలోనూ రుచి కోసం వినియోగించే టమాటా 25 కిలోలు బాక్స్ రూ.1,100 ధర పలుకుతోంది. >>2


### కొంత లక్.. మరికొంత బ్యాడ్‌లక్ 2

**మద్యం టెండర్‌ను దక్కించుకొన్న ఉపాధ్యాయురాలు సస్పెన్షన్**

**ఆమె వివరణ అనంతరం తదుపరి చర్యలు**



శనివారం ఛత్తీస్‌గఢ్‌లోని నవ రాయ్‌పూర్‌లో బ్రహ్మ కుమారీల 'శాంతి శిఖర్' ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోడీ

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్1:** బోధన్ కాంగ్రెస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి పి.సుదర్శన్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సుదర్శన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సుదర్శన్‌రెడ్డి చర్చించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర నేతలు కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## రూ.62,149 కోట్ల సంపద ఆవిరి

>> సంపద ఆవిరైందని, ఆరు వారాలకు ఇది 11 బిలియన్ డాలర్లు, ఎనిమిది వారాలకు 14 బిలియన్ డాలర్ల మేర ఆర్థిక నష్టం జరుగుతుందని అంచనా వేసింది. ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉందని, ఈ షట్‌డౌన్ వంటివి ఊహించిన దానికంటే అధిక సమస్యగా పరిణించవచ్చని మూడీస్ అనలిటిక్స్‌కు చెందిన మార్క్ జాండీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ షట్‌డౌన్ ప్రభావం చిన్నగా ప్రారంభమైనప్పటికీ, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపించవచ్చని కేపీఎంజీ సంస్థలోని చీఫ్ ఎకనమిస్ట్ డయాన్ స్వాంక్ అన్నారు. 1981 నుంచి అమెరికా ప్రభుత్వం 15 సార్లు మూతబడింది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న 2018-19 మధ్య 35 రోజుల పాటు మూతబడింది. దేశ చరిత్రలో అది సుదీర్ఘ షట్‌డౌన్‌గా నిలిచింది. ప్రస్తుత షట్‌డౌన్ జాబ్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 85 శాతం తెలంగాణకే

>> ఎక్కువగా ఉందన్నారు. ఇన్నాళ్లు మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీలో తెలంగాణ విద్యార్థులకు కోటా లేకపోవడంతో, ఇతర రాష్ట్రాల విద్యార్థులు వచ్చి మన దగ్గర పీజీ చేస్తున్నారని మంత్రి తెలిపారు. మన డాక్టర్ల విజ్ఞప్తి మేరకు సీట్ల భర్తీ నిబంధనల్లో మార్పులు చేశామన్నారు. ఇకపై మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లు, కన్వీనర్ కోటాలో వంద శాతం సీట్లు మన రాష్ట్ర విద్యార్థులకే దక్కుతాయని మంత్రి వివరించారు. దీంతో రాష్ట్రంలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరుగుతుందని, తద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. డాక్టర్లకు, ప్రజలకు మేలు చేకూరేలా చారిత్రక నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కాగా మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 85 శాతం స్థానాలను తెలంగాణ విద్యార్థులకు కేటాయించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి, ఈ నిర్ణయం కోసం నిరంతరం కృషి చేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఉస్మానియా మెడికల్ కాలేజ్ విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

## మండుతున్న కూరగాయల ధరలు

>> వారం రోజుల క్రితం బాక్స్ ధర రూ.500 ఉండగా, ప్రస్తుతం రెట్టింపు పలుకుతోంది. అంటే హోల్‌సేల్‌గా కిలో రూ.45 కాగా, చిల్లరగా కిలో ధర మార్కెట్‌లో రూ.55, రూ.60 వరకూ అమ్ముతున్నారు. చిక్కుడు కిలో రూ.60కు లభించేది. రూ.80కి పెరిగింది. గోరు చిక్కుడు ధర కిలో రూ.25 నుంచి రూ.60కు, వంకాయ కిలో రూ.30 నుంచి రూ.70, కాకరకాయ కిలో రూ.35 నుంచి రూ.50, బెండకాయ కిలో రూ.30 నుంచి రూ.40, బీరకాయ కిలో రూ.40 నుంచి రూ.70, బీన్స్ కిలో రూ.40 నుంచి రూ.60, క్యాప్సికం రూ.40 నుంచి రూ.60, క్యాబేజీ పువ్వు రూ.20 నుంచి రూ.30, పూదీన రూ.30 నుంచి రూ.80, కొత్తిమీర రూ.20 నుంచి రూ.30, మునగకాడలు ఒక్కటి రూ.5 నుంచి రూ.15, క్యారెట్ రూ.30 నుంచి రూ.50లకు పెరిగింది. బంగాళ దుంపలు కిలో రూ.30 నుంచి రూ.40కు చేరాయి. పెరిగిన ధరలు కొనుగోలుదారులకు చమటలు పట్టిస్తున్నాయి. కూరగాయ ధరలు ఒకే సారి పెరిగిపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 'జూబ్లీ'కి ఏం చేస్తాడు?

>> శనివారం సాయంత్రం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. బోరబండలో కార్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. చెల్లికి అన్నం పెట్టని వ్యక్తి చిన్నమ్మ బిడ్డకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్లుగా కేటీఆర్ తీరు ఉందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ వేల కోట్ల రూపాయల అక్రమాస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని కవితపై కుట్ర చేశారని ఆరోపించారు. తండ్రిని అడ్డం పెట్టుకుని వేల కోట్ల రూపాయలు సంపాదించారని స్వయంగా కవిత చెప్పారని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్‌ను మంత్రిని చేశామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో మహిళలకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో కొండా సురేఖ, సీతక్కలకు మంత్రి పదవులు ఇచ్చామని ఉద్ఘాటించారు. బిల్లా, రంగాలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలంటున్నారని ఫైర్ అయ్యారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలకు.. నెలకు కనీసం రూ.3వేలు ఆదా అవుతోందని చెప్పుకొచ్చారు. బోరబండ ప్రాంతంలో తాగునీటి సమస్యని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లు మున్సిపల్ మంత్రిగా ఉన్న కేటీఆర్ బస్తీవాసులకు ఏం చేశారని నిలదీశారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు మూడుసార్లు ప్రజలు అవకాశం ఇచ్చారని చెప్పుకొచ్చారు. ఈ ఒక్కసారి జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. బోరబండ చౌరస్తాకు పీజేఆర్ పేరు పెట్టి.. ఆయన విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.10 ఏళ్ళు మీరే అధికారంలో ఉన్నారని, మీ ఎంఎల్ఏనే ఇక్కడ ఉన్నారని, మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ ఉన్నారని గుర్తు చేశారు. మరి ఇక్కడ అభివృద్ధి ఎందుకు జరగలేదని, సమస్యలు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. తాడు, బొంగరం లేనోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామంటే నమ్మేవాళ్ళు ఎవరూ లేరని ఎద్దేవా చేశారు. వాళ్ళు చెప్పే అబద్దాలకు, వాళ్ళు లేవనెత్తే సమస్యలకు కారకులు వాళ్లే కాదా? నిలదీశారు.

## కిషన్ రెడ్డిపై లీగల్ యాక్షన్ తీసుకుంటా: మంత్రి అజారుద్దీన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్1:** తనను దేశద్రోహి అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసి వ్యాఖ్యలపై మంత్రి అజహారుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలను ఇప్పటికే ఖండించిన అజారుద్దీన్ శనివారం మరోసారి కిషన్‌రెడ్డిపై వ్యాఖ్యలపై ఫైర్ అయ్యారు. శనివారం మంత్రి అజహారుద్దీన్ విలేకరులతో మాట్లాడుతూ కిషన్ రెడ్డిపై లీగల్ యాక్షన్ తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. తనపై వచ్చిన ఆరోపణలపై కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని దేశ గొప్పత నాన్ని ప్రపంచానికి చాటిన తాను దేశ ద్రోహినా అని ఆయన ప్రశ్నించారు. మాట్లాడటానికి ఏమీ లేక తనపై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు చేస్తున్నారని, ఆర్నెళ్లలోపు అజహారుద్దీన్ ఎమ్మెల్సీ కాలేరని, ఆయన మంత్రి పదవి కేవలం ఆరునెలల పాటే అంటూ వస్తున్న విమర్శలకు కాలమే సమాధానం చెబుతుందని మంత్రి అజహారుద్దీన్ తెలిపారు.

## నిరవధిక బంద్

>> రాందాస్, డిగ్రీ,పీజీ కాలేజీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ కాలేజీలకు రావాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను అడిగితే విజిలెన్స్ ఎంక్వైరీకి ఆదేశిస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేడు(ఆదివారం) సాయంత్రం లోగా లోగా రూ. 900 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోతే సోమవారం నుంచి నిరవధిక బంద్ నిర్వహిస్తామన్నారు. అన్ని పరీక్షలు వాయిదా వేయాలని యూనివర్సిటీలు కోరుతున్నామన్నారు. ఈ నెల 6న 1.50 లక్షల మంది కాలేజీ స్టాఫ్‌తో హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 10 లేదా 11న 10 లక్షల మంది విద్యార్థులతో హైదరాబాద్‌లో భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీల ఇండ్ల ముట్టడి చేస్తామన్నారు. ఆ తరువాత కలెక్టరేట్‌ల ముట్టడి నిర్వహిస్తామని స్పష్టం చేశారు. గత ఆరు నెలలుగా ప్రభుత్వంతో చర్చలు జరిపి రూ. 1200 కోట్లు అడిగామని.. మిగతా అమోంట్‌కి ట్రస్ట్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, ఒక రోడ్‌మ్యాప్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించామన్నారు. అయితే ప్రభుత్వం దీన్ని పెడచెవిన పెట్టారని.. డిప్యూటీ సీఎంతో మొదలు అందర్నీ కలిశామని... ఇప్పటి వరకు కేవలం రూ. 300 కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు కలిగే అసౌకర్యానికి క్షమాపణ చెబుతున్నామన్నారు.

## వారం - వర్జ్యం

02-11-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
ఏకాదశి ఉ.7.32, ద్వాదశి తె.5.07
పూర్వాభాద్ర సా.5.39, స్వాతి కార్తె
వర్జ్యం : రా.7.00-9.13
దు.సా.4.01-4.50
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** దూర ప్రయాణాలలో తొందర పాటు వద్దు. బంధువుల కలయిక. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**వృషభం:** ఇబ్బందులలో పడిన మీ ఆత్మీయ వర్గానికి రహస్యంగా పరోక్షంగా సహాయ పడతారు. వాహన సౌఖ్యం కలుగుతుంది.

**మిథునం:** అనుకోని సమస్యలు ఎదురైనా చాకచక్యంగా ఎదుర్కొంటారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి.

**కర్కాటకం:** బంధువుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. విహారయాత్రలు చేస్తారు.

**సింహం:** భాగస్వామ్య వ్యాపారాలలో స్వల్ప మార్పులు వుంటాయి. ఉద్యోగ, విద్యావ కాశాలు లాభిస్తాయి. కొత్త వస్త్రాలు కొనుగోలు.

**కన్య :** నూతన ఒప్పందాలలో కాస్త నిదానం అవసరం. వాహనయోగం. దీర్ఘ కాలిక ఋణాలు తీరి ఊరటచెందుతారు.

**తుల:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. ధనలాభం. కోర్టు వివాదాలనుండి బయటపడతారు.

**వృశ్చికం:** నూతన పెట్టుబడులకు అనుకూలమై కాలం. శుభకార్యాలలో పాల్గొంటారు. అనుకోని ఆహ్వానాలు అందు కుంటారు.

**ధనుస్సు:** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

**మకరం:** భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. కాంట్రాక్టులు దక్కించు కుంటారు. సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**కుంభం:** వివాదాస్పద అంశాలు ఎదురయినప్పుడు సమాధానం ఇవ్వక మౌనం వహించండి. ధన, వస్తు లాభాలు పొందుతారు.

**మీనం:** దూర ప్రాంతంలోని సన్నిహిత వర్గం ద్వారా మాట సహాయం పొందుతారు. వస్తువులను కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్, ఎపి మంత్రి లోకేశ్

# ఆలయంలో విషాదం

>> సంబంధించిన రెయిలింగ్ ఊడి పడటంతో భక్తులు కిందపడిపోవడంతో తొక్కిసలాట జరిగినట్లు చెబుతున్నారు. ఆలయానికి వచ్చిన వారిలో ఎక్కువమంది మహిళా భక్తులు ఉన్నారని చెబుతున్నారు. ఈ ఆలయాన్ని 12 ఎకరాల్లో నిర్మించినట్లు చెబుతున్నారు. ఓ భక్తుడు తిరుమల శ్రీవారి ఆలయంలో దర్శనం దక్కలేదని కాశీబుగ్గలో నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. 12 ఎకరాల్లో రూ.10 కోట్లతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఏకాదశి రోజు ఇంతమంది భక్తులు వస్తారని అంచనా వేయకపోవడంతోనే ఈ ఘటన జరిగిందంటున్నారు.ఇది ఒక ప్రైవేటు వ్యక్తి నిర్మించిన దేవస్థానం. పలాసలో స్థిరపడిన ఒడిశా రాజ కుటుంబానికి చెందిన హరిముకుంద పండా ఈ ఆలయాన్ని నిర్మించారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో కాశీబుగ్గ పెట్రోలు బంకు వెనుక ఉన్న పండా తోటల్లో సువిశాలమైన శ్రీ విజయ వేంకటేశ్వర స్వామి ఆలయం రూపుదిద్దుకుంది. హరిముకుంద పండా కుటుంబానికి కాశీబుగ్గలో సుమారు వందెకరాల భూమి ఉంది. ఈ 100 ఎకరాల్లో ఉండే పండాగారి కొబ్బరిఏకాదశి కావడం అందులోనూ శ్రీవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో భక్తులు పోటెత్తారు. ఆలయ సామర్థ్యం దాదాపు 3 వేల మంది అయితే 25 వేల వరకు భక్తులు వచ్చినట్టు సమాచారం. తోటలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. అయితే, 12 ఎకరాల 40 సెంట్ల విస్తీర్ణంలో వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని పండా నిర్మించారు. ఈ ఆలయాన్ని 2023 ఆగస్టులో ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. అప్పటి నుంచీ ఈ ఆలయాన్ని జంట పట్టణాల్లోని భక్తులు తరలివస్తున్నారు. శనివారంశ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన కలచివేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన కలచివేసింది. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయాల పాలైన వారికి మేలైన సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినట్లు చంద్రబాబు ట్వీట్ చేశారు. ఇటు దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి అచ్చెన్నాయుడు అధికారుల్ని అడిగి మరిన్ని వివరాలు తెలుసు కుంటున్నారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, పలాస మాజీ శాసనసభ్యుడు సీదిరి అప్పలరాజు ఘటనాస్థలికి వెళ్లారు. ఆయన స్వతహాగా డాక్టర్ కావడంతో అపస్మారక స్థితిలో ఉన్న కొంతమంది భక్తులకు సీపీఆర్ చేశారు. ఈ విపత్కర పరిస్థితిలో తన వంతు సాయం చేయడానికి ప్రయత్నించారు. అలాగే, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషలు ఘటనాస్థలిని పరిశీలించారు. సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

# వెన్ను విరిగిన రైతన్న

>> కోయాలంటే రెండున్నర గంటల నుంచి మూడు గంటల సమయం తీసుకుంటుంది. అంటే అదనంగా గంటన్నర నుంచి రెండు గంటలు సమయంకు డబ్బులు అదనంగా వరికోత యంత్రంకు చెల్లిస్తున్నారు. దాంతో పాటు కొంత పొలం కట్టలుకట్టడానికి డబ్బులు చెల్లిస్తున్నారు.నీరు బయటకు వెళ్లడం వీలుకాని చోట కట్టలు కట్టకపోతే వరి ధాన్యం అందులోనే కుళ్లిపోతుంది. కట్టలు కట్టలేని రీతిలో కుళ్ళిపొడైన పంట రాష్ట్రవ్యాప్తంగా సగటున ఎకరానికి నాలుగైదు బస్తాల వరకు ఉంటుంది.వరి పడిపోతే లేపి కట్టడానికి ఎకరానికి కనీసం 12 మంది కూలీలు అవసరం. ఒక్క కూలీకి రోజుకు రూ.500 చొప్పున రూ.6,000 ఖర్చు అవుతుంది. వరిపోలాలు అందురులో ఉంటే జాలు వారేది. ఇప్పుడు తుఫాను కారణంగా మెట్టపొలాలో కూడా జాలుకాల్వ తీయడానికి మనిషికి వెయ్యి రూపాయలు చెల్లిస్తున్నారు. వరి కోత మిషన్ ఎకరం పొలం కోయడానికి అదనంగా గంటన్నర సమయం పడుతుందంటే గంటకు రూ.3 వేల చొప్పున గంటన్నరకు నాలుగున్నరవేలు చెల్లించాల్సి వస్తోంది. వాతావర్ణ పరిస్థితులు బాగుండి పంట మంచిగా పండితే ఎకరానికి ప్రస్తుతం తెలంగాణలో 28క్వింటాళ్ళు ధాన్యం దిగుబడి అవుతోంది.సాధారణంగా రైతులు 40 బస్తాలధాన్యం దిగుబడవుతోందని చెబుతారు.తుఫాను కారణంగా నేలవారి పడిపోయిన పొలాల్లో 23-29 బస్తాల దిగుబడి వస్తుంది.21 క్వింటాళ్ళు లోపు దిగుబడి వచ్చే అవకాశం ప్రస్తుతం ఉంది. ఇన్ని ప్రతికూల పరిస్థితులలో పంట కోసినా ధాన్యంకొనుగోలుకేంద్రాలలో రైతుకు తిప్పలు తప్పడంలేదు.

ఖరీఫ్‌లో 8342ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పౌరసరఫరాలశాఖ నిర్ణయం తీసుకొంది. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయకపోవడం, ఏర్పాటు చేసినా ధాన్యం సేకరణ చేయడానికి తేమ అనే సాకులు విధించడంతో ధాన్యాన్ని ఎన్ని రోజులు ఆరబెట్టాలో తెలియక రైతులు దళారులకు విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా పచ్చి వడ్లను మద్దతు ధర కంటే క్వింటాకు రూ.500 చొప్పున తక్కువకు కొంటున్నారు. ఇటు మద్దతు ధర, అటు సన్నవడ్ల బోనస్ ను రైతులు కోల్పోతున్నారు. ప్రభుత్వం సాధారణ రకానికి మద్దతు ధర క్వింటాకు రూ.2369, ఏ గ్రేడ్కు రూ.2389 ప్రకటించింది. దళారులు రూ.1948కి అటుఇటుగా కొంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో బోనస్ కింద క్వింటాకు రూ.500 వచ్చేవి అని అన్నదాతలు వాపోతున్నారు. ప్రకృతివైపరిత్యం కారణంగా ఓవైపు 40 బస్తాలు పండే చోట 27-30 బస్తాలకు దిగుబడి పరిమితమైనది. ఎకరానికి ఏడుక్వింటాళ్ళు తగ్గినట్టే ఇది రూ.20,000 ఉంటుంది. అంటే మొంథా దెబ్బకు ఎకరానికి రైతుకు జరిగిన నష్టం దాదాపు రూ.40,500. క్వింటాకు రూ.2,500 ధర చొప్పున రూ.70,000 వస్తుంది.

ఇప్పుడు అదనపు ఖర్చు పోగా మిగిలేది కేవలం రూ.30 వేలు. ఇందులో పెట్టుబడి ఖర్చులు రూ.25 వేలు పోతే రైతుకు మిగిలేది కేవలం రూ.5 వేలు. ధర తగ్గితే ఆ మిగులు బాటు ఉండదు. కౌలు రైతులకు ఏమీ మిగలదు. ఖరీఫ్ సాగు ఆద్యంతం ఒడుదొడుకులతో సాగి రైతులను కన్నీటిపాలు చేసింది ఆగస్టులో కురిసిన వర్షాలు వివిధ పంటలకు ఊపిరినిచ్చి రైతుల్లో ఆశలు చిగురింప చేయగా, పంట చేతికొచ్చే అక్టోబరులో కనీవిని ఎరుగని రీతిలో వచ్చిన మొంథా తుపాను కన్నీటిసంద్రంలో ముంచింది. అక్టోబరు 29న తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు తెలంగాణ రైతాంగంను అతలాకుతలం చేశాయి. వరి చేలు నేలవాలాయి. మక్కలు తడిసి ముద్దయి. పత్తి తడిసి ముద్దయి నలుపురంగులోకి మారింది. దీంతో ఏ పంటకూ మద్దతు ధర లభించే అవకాశం లేకుంది.



శనివారం సిఎం రేవంత్‌తో సమావేశమైన కెనడా హైకమిషన్ సభ్యులు

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలి

### సిఎం రేవంత్‌రెడ్డితో కెనడా హైకమిషనర్, ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్1:** తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కెనడా హైకమిషనర్ బృందాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కోరారు. స్టార్టప్స్, ఎడ్యుకేషన్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్స్‌లోనూ పెట్టుబడులకు ముందుకు రావాలని సిఎం కోరారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో హైకమిషనర్ ఆఫ్ కెనడా టు ఇండియా క్రిస్టోఫర్ కూటర్ బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా ఐటీ, ఫార్మా, ఎయిరోస్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లో కెనడాతో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై చర్చ జరిగింది. ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను కెనడా హైకమిషనర్‌కు సిఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో కారెన్, కెనడా మినిస్టర్ ఎడ్ జాగర్, ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ బృందం శనివారం మర్యాదపూర్వక భేటీ అయింది. ఈ సందర్భంగా హైదరాబాద్ లో ఫ్రాన్స్ ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై చర్చ జరిగింది. హైదరాబాద్ లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్ బృందాన్ని సిఎం కోరారు. హైదరాబాద్ లో ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలని సిఎం కోరారు. ఈ సమావేశంలో మోద్ మిక్వా, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొంతలక్.. మరికొంత బ్యాడ్‌లక్

### మద్యం టెండర్‌ను దక్కించుకొన్న ఉపాధ్యాయురాలు సస్పెన్షన్

### ఆమె వివరణ అనంతరం తదుపరి చర్యలు

**మహబూబ్నగర్ బ్యూరో నవంబర్ 1 ప్రభాతవార్త:** ఎట్టకేలకు ఆ ఉపాధ్యాయురాలికి సస్పెన్షన్ ఆర్డర్ రానే వచ్చింది. అదృష్టంలోనూ దురదృష్టం ఆమెను వెంటాడింది.. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు జిల్లా విద్యాశాఖ అధికారి తెర దించారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ టీచర్ మద్యం టెండర్లలో పాల్గొనగా ఆమెకు లక్కీ డ్రాలో వైన్స్ షాపు దక్కింది. అయితే ఆ సంతోషం ఎన్నో రోజులు లేదు. విద్యాశాఖ అధికారులకు షాకింగ్ నిర్ణయం తీసుకుని ఆ టీచర్‌కు ఝలక్ ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ రాంనగర్ బాలికల ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న పుష్ప పేరుతో ఆమె భర్త ఇటీవల మద్యం టెండర్ వేయగా వారికి ధర్మపూర్ వైన్‌షాప్ లక్కీ డిప్‌లో దక్కింది. ఇందుకు సంబంధించి పుష్ప అధికారుల సమక్షంలో సంతకం చేసి తదనంతర చాలన్ డబ్బుల ప్రక్రియను సైతం పూర్తి చేశారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మద్యం టెండర్లు దక్కించుకోవడానికి అర్హులు కాదని నిబంధనలు ఉండడంతో ఓ వ్యక్తి టెండర్ల ఖరారు రోజునే అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ అంశం మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకొని విచారణ జరిపారు. పీఈటీ పుష్ప మద్యం టెండర్ల దాఖలు నుంచి షాపు దక్కేవరకు చేసిన ప్రక్రియలకు సంబంధించి అన్ని ఆధారాలు సేకరించి నివేదించగా పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ శనివారం పీఈటీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విషయమై మహబూబ్నగర్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారి సుధాకర్ ను వివరణ కోరగా మద్యం టెండర్లు వేయడానికి 21 సంవత్సరాలు నిండిన వారు ఉంటే సరిపోతుందని తమకు ఈ మేరకే నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయురాలు టెండర్ దక్కించుకున్న విషయం వాస్తవమేనని తెలిపారు. తమ శాఖ పరిధిలో ఎలాంటి చర్యలు తీసుకోవడానికి తమకు అధికారం లేదని వివరించారు. ఉపాధ్యాయురాలు సస్పెన్షన్ పై డీఈవో ప్రవీణ్ కుమార్ వివరణ ను వార్త ప్రతినిధి సంప్రదించగా ఒక ఉపాధ్యాయురాలిగా ఉండి ఎలాంటి ప్రభుత్వ టెండర్లలో లాభాదాయక వృత్తులలో పాల్గొన వద్దని నిబంధనలు ఉన్నాయని, ఈ మేరకే ఉపాధ్యాయురాలికి సస్పెన్షన్ ఆర్డర్ పంపించినట్లు తెలిపారు. సదరు ఉపాధ్యాయురాలు నుంచి పూర్తిస్థాయిలో వివరణ అందిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

## జూబ్లీహిల్స్‌లో ఓటర్లను రేవంత్ రెడ్డి బెదరిస్తున్నారు

### ఇసికి బిజెపి నేతల ఫిర్యాదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్1:** కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే పథకాలు రద్దవుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓటర్లను బెదిరిస్తున్నారని బీజేపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్ పలువురు పార్టీ నాయకులతో కలిసి ఈసీకి ఫిర్యాదు చేశారు. పథకాలు రద్దవుతాయని బెదిరించిన ముఖ్యమంత్రిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. 2 రోజుల ముందు, అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడంపై కూడా బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉప ఎన్నికల సమయంలో ఓ వర్గం ఓట్ల కోసం ఆయనకు మంత్రి పదవి ఇస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో, కాంగ్రెస్‌కు ఓటు వేయని వారికి ప్రభుత్వం నుంచి లభించే ప్రయోజనాలను ఆపేస్తామని ప్రజలను బెదిరించడాన్ని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తప్పుబట్టారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ, రేవంత్ రెడ్డిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని తెలియజేశారు. 23 నెలల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన 420 హామీలలో దేనిని కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే రేషన్ కట్ అవుతుందని, పెన్షన్ రాదని చెప్పడం బ్లాక్‌మెయిల్ కిందకు వస్తుందని అన్నారు.

## త్వరలో దేవాదాయ భూముల రక్షణ బిల్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్1:** తెలంగాణ దేవాదాయ భూముల రక్షణకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ ఎండోమెంట్ యాక్ట్, 1987 చాప్టర్ 11 సవరణకు కసరత్తు చేస్తోంది. సెక్షన్స్ 83, 84 తొలగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ మేరకు బిల్లు ప్రవేశపెట్టనుంది. ట్రిబ్యునల్, కోర్టు కేసులతో దర్జాగా వేల ఎకరాలు కబ్జా చేస్తున్న వాళ్ల ఆటకట్టించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈ మేరకు చర్యలు చేపట్టింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వందల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని వీటన్నింటిని పరిరక్షించాలని ప్రభుత్వం చూస్తోంది. కబ్జాకోరల్లో చిక్కుకున్న వేల కోట్ల విలువైన దేవాదాయ భూములు రక్షించేందుకు నడుంబిగించింది. దేవాలయ, చారిటబుల్ సంస్థలకు చెందిన భూములు, భవనాల్ని ఎవరు ఆక్రమించినా వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది. ఎండోమెంట్ అధికారులు, అవసరమైతే పోలీసు, హైడ్రా సాయంతో ఆక్రమణలు తొలగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

## మహిళ తల, చేయి నరికి హత్య

>> పోలీసు జాగిలాలను, క్లూస్ సిబ్బందిని తరలించి ఆధారాలు సేకరించారు. నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య సహా ఇతర అధికారులు ఘటనా స్థలిని సందర్శించారు. హతురాలి వివరాలు ఇంకా తెలియరాలేదు. ఆమెపై హత్యాచారం జరిగి వుండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## పలాస తొక్కిసలాట ఘటన దురదృష్టకరం

### కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి దర్శనాల సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన విచారకరమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50వేల ఎక్స్ గ్రేషియా ప్రకటించారన్నారు. కాశీబుగ్గ తొక్కిసలాట దుర్ఘటన దురదృష్టకరం "మని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. తక్షణమే క్షతగాత్రు లకు మెరుగైన వైద్యం సాయం అందించాలని, మృతుల కుటుంబాలను ఎన్‌డిఏ కూటమి ప్రభు త్వం

## అగ్రనటుడు చిరంజీవిపై అభ్యంతర పోస్టింగులు..

### రెండు కేసులు నమోదు

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** సినీహీరో చిరంజీవిపై సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టింగ్‌లకు సంబంధించి సైబర్ క్రైం పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు డిసిపి కవిత మీడియాకు వివరాలు తెలిపారు. తన ఫోటోలను ఇష్టానుసారం వాడుతుండడంతోపాటు అభ్యంతకరంగా పోస్టింగులు పెడుతుండడంపై చిరంజీవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి తనకు అనుకూలంగా ఉత్తర్వులు పొందడం తెలిసిందే. అయినప్పటికీ చిరంజీవిపై అభ్యంతకర పోస్టింగులు వస్తూనే వుండడంతో ఆయన దీనిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ ఫిర్యాదు మే రకు సైబర్ క్రైం పోలీసులు మొదట ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేయగా తాజాగా మరో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డిసిపి కవిత మాట్లా డుతూ ఈ కేసులో నిందితులు డీప్‌ఫేక్ టెక్నాలజి వాడారని, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ తరహా కేసులను తీవ్రంగా పరిగణిస్తామని ఆమె హెచ్చరించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలో దింపామని ఆమె వెల్లడించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా వుండాలని, 1930కి వెంటనే ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. సోషల్ మీడియాలో అడ్డగోలు పోస్టింగులపై వెంట నే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, నకిలీ వీడియోలను ఎవరూ షేర్ చేయవద్దని డిసిపి కవిత కోరారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

### 2 వేల మందితో నేడు సమావేశం

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్య లను పరిష్కరించాలని పిఆర్‌టియు టిఎస్ డిమాండ్ చేసింది. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు(ఆదివారం) 2 వేల మందితో విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించను న్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుల్గం దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ తెలిపారు. సంఘం 36వ సాధారణ సర్వసభ్య సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా నల్గొండ- వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్సీ బి. మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పేరి వెంకట్ రెడ్డి, గుండు లక్ష్మణ్, వంగ మహేందర్ రెడ్డితోపాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు సుమారు 2000 మంది వరకు హాజరవుతున్నారని వారు తెలిపారు. ఈ సమావేశంలో విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తీర్మానం చేయనున్నట్టు తెలిపారు.

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు సిద్ధంగా ప్రభుత్వం

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (మెహిదీపట్నం) నవంబరు 1, ప్రభాతవార్త :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందులో భాగంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రతిబింబించేలా స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు చేయడం జరిగిందని, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్టే విధించడంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ లు సాకారం కావాలని కోరుతూ శనివారం లంగర్‌హౌస్ బాపు ఘాట్ లోని గాంధీజీ సమాధి వద్ద బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పాల్గొని బాపు ఘాట్ ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, గాంధీజీ సమాధి వద్ద రాష్ట్ర శాసనసభ ఆమోదించిన నాలుగు బిల్లులను చూపుతూ వందేమాతరం గీతాలాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ...రాష్ట్రంలో వెనుక బడిన తరగతులకు విద్యా, ఉద్యోగ రంగాలలో మరియు స్థానిక సంస్థలలో 42 రిజర్వేషన్ లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించి అందుకు అనుగుణంగా రాష్ట్ర శాసనసభ మరియు మండలిలో 2 బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. రాష్ట్ర శాసన వ్యవస్థ ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి ఆమోదం, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్డ్‌లో పొందుపరచడానికి కేంద్ర ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. ఇదిలా ఉండగా సెప్టెంబర్ నెలాఖరులోపు స్థానిక సంస్థలకు ఎన్ని కలు జరపాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వానికి నిర్దేశించడంతో రాష్ట్ర స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్‌లు పెంచడానికి అను గుణంగా రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం, మున్సిపల్ చట్టాలకు సవరణలను చేపడుతూ శాసనసభలో ఆమోదించిజేసిన బిల్లులు గవర్నర్ ఆమోదం కొరకు పంపించామన్నారు. అయితే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నిర్దేశించిన గడువు దగ్గర పడుతుండడంతో ఏకసభ్య కమిషన్ సిఫారసుల మేరకు బీసీలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లను 42 గా నిర్ధారిస్తూ జిఒ నం.9ను ప్రభుత్వం జారీచేయగా, అందుకు అనుగుణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామీణ, స్థానిక సంస్థలలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడంతో స్థా నిక సంస్థలలో బీసీలకు 42 సీట్లను రిజర్వు చేస్తూ స్థానా లను ఎంపిక చేశామన్నారు. కాగా జి.ఒ 9పై స్టే విధిస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేయడంతో ఆశావాహుల ఆశలపై నీళ్లు చల్లినట్లు అయిందని తెలిపారు.



లంగర్‌హౌస్ బాపు సమాధి వద్ద 42 శాతం రిజర్వేషన్ జిఒ కాపీలను చూపుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# పనితీరు మెరుగుపరిచే సాధనమే విజిలెన్స్

### నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలి

### ఎన్ఎండిసి సిఎండి అమితాబ్ ముఖర్జీ

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** విజిలెన్స్ విభాగం సంబంధిత సంస్థ పనితీరును, ఉద్యోగుల సమర్థతను మెరుగు పరిచే సాధనంగా ఉండాలని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) సీఎండీ అమితాబ్ ముఖర్జీ అన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శనివారం సాయంత్రం జరిగిన విజిలెన్స్ అవగాహన వారోత్స వాల్లో ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ పక్షపాత రహితంగా సేవలు అందించే వ్యక్తుల వల్లే సంస్థల పని సంస్కృతి మెరుగుపడుతుందన్నారు. అలాంటి సమగ్రత కలిగిన వారు పెద్ద సంఖ్యలో ఉంటే జాతి నిర్మాణం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. అదే సమ యంలో సమయం, పరిస్థితి, ఫలితాలను అంచనా వేసి కొన్ని సందర్భాల్లో విచక్షణతో సత్వర నిర్ణయాలు తీసుకునే నాయకత్వాలు కూడా ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమని చెప్పారు. నిబంధనల కన్నా నైతిక విలువలు గొప్పవని అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో బొగ్గు రంగంలో సింగరేణి సహకారాన్ని తాము తీసుకోవడానికి, అలాగే ఇతర మైనింగ్ రంగంలో భాగస్వామిగా చేసుకోవడంపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అధ్యక్షోపన్యాసం చేస్తూ అంతర్జాతీయ రంగంలోకి అడుగు పెట్టాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఎన్ఎండీసీ భవిష్యత్ ప్రాజెక్టుల్లోనూ భాగస్వామిగా ఉండటానికి సంసిద్ధంగా ఉందన్నారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇన్ కమ్ ట్యాక్స్ ఇన్వెస్టిగేషన్ వింగ్ ప్రిన్సిపల్ డైరెక్టర్ రాజ్ గోపాల్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యకలాపాలలో తగిన నిర్ణయాలను సమయానికి తీసుకోవడం అవసరమన్నారు.

నిర్ణయాలు తీసుకునే ముందు సంబంధిత వర్గాల అభిప్రాయాలను తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. నిర్ణయాలు పారదర్శకంగా ఉంటే అవినీతి లేదా అక్రమాలకు అవకాశం ఉండదని పేర్కొన్నారు. విధానపరమైన నిర్ణయాలు సక్రమంగా తీసుకుంటే విజిలెన్స్ అవసరమే ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో త్రిపుర రాష్ట్ర మాజీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జి.అయ్యంగార్ సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, తిరుమలరావు, ఈడీ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




# భారీ వర్షాలు, వరదల నష్టంపై నివేదిక ఇవ్వండి

### జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన సిఎస్ రామకృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 1:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాలకనుగుణంగా మొంథా తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి వెంటనే ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 24 జిల్లాలు ఈ మొంథా తుఫాన్‌కు ప్రభావితమయ్యాయని తెలిపారు. జిల్లాలలో జరిగిన పంట నష్టంతో పాటు, రహదారులు, నీటి వనరులు, పశువులు, ప్రాణ నష్టంతో పాటు ఇతర ప్రాథమిక వివరాలను వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ఇటీవల కాలంలో ఏవిధమైన సూచనలు లేకుండా 25 నుండి 30 సెంటీమీటర్ల వర్షపాతం ఆకస్మికంగా కురుస్తోందని, ఈ నేపథ్యంలో అత్యవసర సమయంలో చేపట్టాల్సిన చర్యలపై జిల్లాల వారీగా ముందస్తు ప్రణాళికలను రూపొందించు కోవాలని సి.ఎస్ సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఆయా జిల్లాలలో దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ లైన్లు, నీటి వనరులకు తాత్కాలిక పునరుద్ధరణ పనులు ముమ్మరంగా చేపట్టినట్టు అధికారులు పేర్కొన్నారు. ఎక్కడైనా అంగన్వాడీ భవనాలు, పాఠశాల భవనాలు ధ్వంసం అయితే వాటి పునరుద్ధరణకు వెంటనే నిధులు మంజూరు చేస్తున్నట్టు సీఎస్ తెలిపారు. అదే విధంగా తరచుగా ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. నష్టపరిహారం అందించేందుకు వీలుగా నష్టం వివరాలను సోమవారం వరకు పంపించాల్సిందిగా కోరారు. ఎలాంటి అల సత్యం లేకుండా పునరావాస చర్యలు తీసుకోవాలని కోరారు.



# పత్తికి తేమ పేరుతో సిసిఐ కేంద్రాల్లో కొర్రీలు

### మరోపక్క ప్రైవేటు వ్యాపారుల దోపిడీ

### మొదలైన రైతుల ఆందోళనలు

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** భారీ వర్షాలతో తెలంగాణలో పత్తి పంట దెబ్బతిని దిగుబడి తగ్గిన నేపథ్యంలో ఇప్పుడు మద్దతు ధరల శరాఘాతం రైతులకు ఎదురైంది. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని రైతులు అమ్మకానికి మార్కెట్ కు తీసుకురాగా మద్దతు ధర మాత్రం రావడం లేదు. ఉన్న పంటను అకాల వర్షాలు దెబ్బతీస్తుండటం, మార్కెట్ కు వస్తే ధర లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం పండిన పత్తిని అమ్మినా పెట్టుబడి వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎట్టకేలకు సీసీఐ రాష్ట్రంలో కొనుగోళ్లను ప్రారంభించినా పత్తికి ఈ యేడు ధర పలకడం లేదని రైతులు వాపోతున్నారు. తేమ పేరుతో సిసిఐ కేంద్రాల్లో సైతం కొర్రీలు పెడుతూ మద్దతు ధరలకు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఈసారి కూడా పత్తి రైతులకు ఆదిలోనే తేమ శాతం కష్టాలు ఎదురయ్యాయి. వ్యాపారులు సిండికేటుగా మారడంతో ధర తగ్గిపోయింది. దిగుబడి వచ్చిన పత్తిని కూడా మార్కెట్ కు తీసుకువస్తే మద్దతు ధర లేకపోవడంతో కనీస గిట్టుబాటు కావడం లేదంటున్నారు రైతులు. పెట్టిన పెట్టుబడులకు, కూలీలకు సరిపోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. సీసీఐ మద్దతు ధర రూ.8,110 ఉండగా మార్కెట్ లో మాత్రం రూ.5వేల నుంచి రూ.7వేల మధ్యనే కొనుగోలు చేస్తున్నారు. మోడల్ ధర రూ.6వేల నుంచి రూ.6,500 మధ్య వస్తుంది. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో అధికారులు పత్తి కొనుగోలు వేలం నిర్వహించారు. మొదట నాలుగు బండ్లలో పత్తి 12 శాతం కన్నా తక్కువ తేమ ఉండడంతో సీసీఐ కొనుగోలు చేసింది. ఆ తర్వాత బండ్లలో పత్తి తేమ శాతం 15 నుంచి 20 శాతం వరకు రావడంతో సీసీఐ అధికారులు కొనుగోళ్లు ఆపేశారు. ప్రైవేట్ వ్యాపారులు నిర్ణయించిన రూ.6,950 రేటు తక్కువగా ఉండడం, సీసీఐ కొనుగోళ్లు ఆపేయడంతో రైతులు ధర్నాకు దిగారు. దీంతో యార్డు పూర్తిగా పత్తి బండ్లతో నిండిపోయింది. మధ్యాహ్నం ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడంతో ఆందోళన చెందిన రైతులు తేమ శాతంతో సంబంధం లేకుండా పత్తి కొనాలని అధికారులను పట్టుబట్టారు. కలెక్టర్ రాజర్షి షా, ప్రైవేట్ వ్యాపారులు, సీసీఐ అధికారులతో చర్చలు జరిపారు. తేమ శాతంతో సంబంధం లేకుండా క్వింటాల్ రూ.6,950 కు పత్తి కొంటామని ప్రైవేట్ వ్యాపారులు ముందుకు వచ్చి చివరకు కొనుగోళ్లు చేపట్టారు. సీసీఐ చేపట్టిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని అధికారులు మూసివేయడంతో ఆగ్రహించిన పత్తి రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పత్తి రైతుల నిరసనతో మూడు గంటల పాటు రోడ్డుకు ఇరువైపుల వాహనాలు నిలిచిపోయాయి.

## ప్రారంభమైన జెఇఇ మెయిన్-2026 దరఖాస్తుల ప్రక్రియ

### ఎన్‌టిఎ నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** దేశంలోని ఐఐటిలు, ఎన్ఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) జాతీయస్థాయిలో నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జెఈఈ) (మెయిన్)-2026 పరీక్ష మొదటి విడత పరీక్షలకి సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను అక్టోబర్ 31 నుంచే ప్రారంభిస్తున్నట్టు ఎన్‌టిఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 27 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు ప్రకటించింది. జనవరి మొదటి వారంలో పరీక్షలను నిర్వహించే నగరాలను ప్రకటించనున్నారు. అడ్మిట్ కార్డుల డైన్‌లోడ్ ప్రక్రియను ఎప్పటి నుంచి ప్రారంభిస్తారనేది దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన తరువాత ప్రకటించనున్నారు. ప్రతి ఏడాది రెండు విడతలుగా జెఈఈ మెయిన్ పరీక్షలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా జెఈఈ మెయిన్- 2026 మొదటి సెషన్ పరీక్షలను వచ్చే ఏడాది జనవరి 21 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తులను శుక్రవారం నుంచే స్వీకరించడం ప్రారంభించినట్టు ఎన్‌టిఏ ప్రకటించింది. సిబిటి విధానంలో జెఈఈ మెయిన్-2026ను రెండు సెషన్‌లలో (జనవరి, ఏప్రిల్ 2026) నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి సెషన్1 కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్ ఎన్‌టిఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు ఎన్‌టిఏ డైరక్టర్ ఎగ్జామ్స్ ప్రకటించారు. రెండో సెషన్‌కి సంబంధించిన పరీక్షలను ఏప్రిల్ 1 నుంచి 10 వరకు నిర్వహంచనున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను జనవరి చివరి వారం నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి పూర్తి చేయాలని సూచించారు. ఆధార్‌తోపాటు, మెమో ఆధారంగా ఉన్న పేర్లను నమోదు చేసుకునే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మొదటి విడత జెఈఈ మెయిన్ పరీక్షల ఫలితాలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న విడుదల చేయనున్నట్టు ఎన్‌టిఏ ప్రకటించింది. జెఈఈ మెయిన్ పరీక్షలను మొత్తం 13 భాషల్లో నిర్వహించనుంది.

## పంజాబ్‌లో జాతీయ కబడ్డీ క్రీడాకారుడు తేజ్‌పాల్ దారుణహత్య



**లూథియానా, నవంబరు 1:** జాతీయ స్థాయి కబడ్డీప్లేయర్ 24 ఏళ్ల తేజ్‌పాల సింగ్ దారుణ హత్యకు గురయ్యాడు. శనివారం లూథియానా జిల్లా ఎస్ఎస్‌పి కార్యాలయానికి సమీపంలోనే ఈ హత్యజరిగింది. డా.హరిసింగ్ హన్స్ మెటర్నటి ఆసుపత్రివద్ద ఉదయం గుర్తుతెలీని వ్యక్తులు మారుతి స్విఫ్ట్‌లో అక్కడకు వచ్చి కాల్పులు జరపడంతో తేజ్‌పాల్‌సింగ్ రక్తపుమడుగులో పడిపోయాడు.

గిద్దర్‌విండి గ్రామస్తుడయిన తేజ్‌పాల్‌సింగ్ తన వ్యక్తిగత పనులనిమిత్తం జర్గాం ప్రాంతానికి వచ్చినట్లు తెలిపారు. హటాత్తుగా నలుగురు హంతకులు ఆతడిని చుట్టుముట్టి కాల్పులుజరిపారని ముందు తేజ్‌పాల్, ఆతని సోదరుడిని కూడా దారుణంగా కొట్టారని ఎస్ఎస్‌పి అంకుర్‌గుప్తా తెలిపారు. అయితే ఇది ముందస్తుగా వేసిన ప్రణాళిక కాదని హటాత్తుగా వాగ్వాదం జరిగి ఆతర్వాత హత్యజరిగినట్లు చెప్పారు. కాలా, హనీ అనే ఇద్దరు దుండగులతోపాటు మరో ఇద్దరు రూమీ గ్రామానికి చెందినవారుకూడా తేజ్‌పాల్ ఆతని సోదరుడు జర్గాంలో ఉన్నట్లు తెలుసుకుని అక్కడకు చేరుకున్నారని ఎస్ఎస్‌పి తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలసమయంలో తేజ్‌పాల్ ఆతని సోదరుడు స్నేహితులతోకలిసి నగరంలో తిరుగుతున్నారు. రోడ్లపై కాలా, హనీ దుండగులకు తేజ్‌పాల్ ఆతని సోదరుడు కనిపించారు. వారికి తారసపడిన వెంటనే వారితో వాగ్వాదానికి దిగారు. అనంతరం దుండగులు తేజ్‌పాల్ ఛాతికి గురిపెట్టి కాల్చారు. దీనితో స్పాట్‌లోనే క్రీడాకారుడు చనిపోయాడు. తెల్లటి మారుతి స్విఫ్ట్‌కారులో హంతకులు వచ్చారని, వారిపై హత్యకేసునమోదుచేసినట్లు ఎస్సెస్‌పీ తెలిపారు. నిందితులతో తేజ్‌పాల్‌కు పాతశతృత్వం ఉందని గతంలో కూడా ఒకసారి గొడవపడినట్లు పోలీసు రికార్డుల్లో ఉందన్నారు. అయితే హంతకులు వాడిన పిస్టల్ లైసెన్స్‌తో ఉందా లైసెన్స్‌లేనిదా అనేది పరిశీలిస్తామని, వారిపై ఆయుధచట్టం కూడా ప్రయోగిస్తున్నట్లు ఎస్ఎస్‌పి తెలిపారు.

## మారని ఆగ్రోస్ పనితీరు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వార్నింగ్ ఇచ్చినా తెలంగాణ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డువలప్‌మెంట్ కార్పొరేషన్ (ఆగ్రోస్) నిర్వహణలో మార్పు రాలేదు. కొందరు అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులపై వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఆగ్రోస్ ప్రధాన కార్యాలయాన్ని శనివారం ఉదయం మంత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆఫీస్ పని వేళలు అయినా కొంత మంది సిబ్బంది రాకపోవడంపై మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కార్యాలయంలో హాజరు సేకరణ విషయంలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ పరకరం గమనిస్తూ హాజరు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా సేకరిస్తున్నారా లేక ఫింగర్ ప్రింట్ ద్వారా సేకరిస్తున్నారా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. భవనాల నిర్వహణ సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా గతంలోనూ హైదరాబాద్‌లోని వ్యవసాయ మార్కెటింగ్ ప్రధాన కార్యాలయం, అగ్రి కమిషనరేట్లను తనిఖీ చేసి సమయపాలన పాటించని అధికారులకు మెమోలు సైతం ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించించిన సంగతి తెలిసిందే. అయినా కొందరిలో ఇంత వరకూ మార్పు మాత్రం రాకపోవడం విశేషం. కాగా అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ పరిధిలోని అన్ని కార్పొరేషన్లు సమర్థవంతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఇందుకు ప్రభుత్వం ఒక కార్యచరణతో ఉన్నట్లు తెలిపారు. నిరర్థకంగా మారిన ఆగ్రోస్‌ను పునరుద్ధరిస్తామని చెప్పారు. తుఫాన్ ప్రభావంతో నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకుంటామన్నారు. ప్రతి ఎకరాకు 10 వేల రూపాయలు పంట నష్ట పరిహారం చెల్లించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇదే సమయంలో పత్తి తేమ శాతం విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్దతు ధర దక్కాలంటే జాగ్రత్తగా పత్తి ఆరబెట్టుకోవాలన్నారు.

## ప్రమాదంలో ఎఎస్ఐ మృతి

### పేట్‌బషీరాబాద్‌లో ఆయన్ని వెనుకనుంచి ఢీకొన్న డిసిఎం వ్యాన్

**హైదరాబాద్ (పేట్‌బషీరాబాద్) నవంబరు 1, ప్రభాతవార్త:** విధినిర్వహణలో ఉన్న పేట్‌బషీరాబాద్ ఎఎస్సైని శనివారం డిసిఎం వెనుక భాగం ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా ఆందోళనకు గురై గుండెపోటుతో మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ ప్రాంతానికి చెందిన దేవీసింగ్(60) పేట్‌బషీరాబాద్ పోలీసుస్టేషన్‌లో రెండేళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రతి శనివారం నిర్వహించే పెరేడ్‌లో భాగంగా ఆయన కొంపల్లిలోని పిఎస్ఆర్ గార్డెన్‌లో పెరేడ్ పూర్తి చేసుకున్నాడు. ఆ సమయంలో గార్డెన్‌కు నీటిని తీసుకువచ్చే వాటర్‌ట్యాంకర్ డిసిఎం డ్రైవర్ నీరు అన్‌లోడ్ చేశాక బయటకు వెళ్లే క్రమంలో గార్డెన్‌లో నిల్చొని ఉన్న ఎఎస్సై దేవీసింగ్ పక్క నుంచి వెళ్తుండగా ట్యాంకర్ వెనుక భాగం ఆయన భుజానికి తగిలి కిందపడ్డాడు. వెంటనే డ్రైవర్ కిందికిదిగి వెనుకకు వచ్చి పరిశీలించగా దేవీసింగ్ ఫిట్స్‌తో కొట్టుమిట్టాడుతున్నాడు. ఇది గమనించిన పెరేడ్‌కు వచ్చిన పోలీసులు దేవీసింగ్‌ను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆయన్ని పరీక్షించిన వైద్యులు అప్పటికే దేవీసింగ్ మృతి చెందినట్లు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఎఎస్సై దేవీసింగ్ (ఫైల్)

# ఎల్ఐసిలో విజిలెన్స్‌పై అవగాహన వారోత్సవాలు

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** ఎల్ఐసీలో విజిలెన్స్ అవేర్ నెస్ వారోత్సవం జరిగింది. హైదరాబాద్ జోనల్ కార్యాలయంలో శనివారం హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజనల్ ఆఫీస్‌లోని అన్ని కార్యాలయాల ఉద్యోగులు, ఏజెంట్ల భాగస్వామ్యంతో వాకథాన్ నిర్వహించారు. ఈ వాకథాన్‌లో 300 మంది సిబ్బంది మరియు ఏజెంట్లు పాల్గొన్నారు. దీన్ని పురస్కరించుకుని జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ మాట్లాడుతూ రోజువారీ కార్యకలాపాలలో విజిలెన్స్ కోణంపై లోతైన అవగాహన ఉండాలన్నారు. విజిలెన్స్ ద్వారా అవినీతిని అరికట్టడంలో ముఖ్యమైన పాత్రను పోషించాలని చెప్పారు.

రీజినల్ మేనేజర్ ఎం రవి కుమార్, జోనల్ ఆఫీసు వద్ద జరిగిన వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాకథాన్ తెలంగాణ తల్లి ఫ్లైఓవర్, మింట్ కాంపౌండ్, సైఫాబాద్ పోలీస్ స్టేషన్, ప్రసాద్ ఐమాక్స్, లుంబినీ పార్క్ మీదుగా నిర్వహించి ఎల్ఐసీ జోనల్ ఆఫీస్ వద్ద ముగిసింది. ఇందులో విజిలెన్స్ అవగాహనపై సందేశాలను ప్లకార్డులు ప్రదర్శించారు.

ఈ సందర్భంగా జోనల్ విజిలెన్స్ అధికారి ఇ. విద్యాధర్ మాట్లాడుతూ విజిలెన్స్ అవేర్నెస్ వీక్ యొక్క ఉద్దేశ్యం చెడు గురించి ప్రజలలో అవగాహన కల్పించడమే అన్నారు. అందరం కలసి అవినీతికి తావు లేని సంస్కృతిని నిర్మించుకుందామని తెలిపారు. విజిలెన్స్ మన ఉమ్మడి బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పి.జి. కుమారవైద్యలింగం, శరవణ రమేష్, ఎ.ఇ.ఎం. హిలాలి, జి. మధుసూదన్, కె. సంధ్యారాణి, పలువురు సీనియర్ అధికారులు ఈ వాకథాన్‌లో ఉన్నారు. కాగా దక్షిణ మధ్య జోన్ పరిధిలోని అన్ని కార్యాలయాలలో ఈ నెల 27న సమగ్ర ప్రతిజ్ఞతో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆన్‌లైన్ క్విజ్, ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు, సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు జరిగింది.





**ఈశాన్య రైల్వే** — టెండర్ నోటీస్ నెం. 43 తేది: 31.10.2025

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతి ద్వారా టెండర్‌ల యొక్క ఆహ్వానం**

భారత రాష్ట్రపతి తరపున ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్ మేనేజర్, ఈశాన్య రైల్వే, గోరఖ్‌పూర్-273012 వారు, ఈ క్రింది ఐటమ్‌ల యొక్క సరఫరాకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా టెండర్‌లు కోరుతున్నారు. ఐటమ్ యొక్క పూర్తి వివరణ మరియు ఇతర నిబంధనలు www.ireps.gov.in పై అందుబాటులో ఉన్నాయి.

| క్ర. సం. | టెండర్ నంబర్ | గడువున | స్టోర్స్ యొక్క సంక్షిప్త వివరణ | పరిమాణం |
|---|---|---|---|---|
| 1 | 28250139 | 03/12/2025 | పెయింట్ ఎనామెల్ ఇంటీరియర్ ఫినిషింగ్ స్మోక్ గ్రే వగైరా | 46300 లీటర్ |
| 2 | 28250890 | 03/12/2025 | పోలీ వస్త్ర బెడ్ షీట్ బ్లీచ్డు వైట్ సైజ్ 229×140 సెం.మీ.లు వగైరా | 9056 సం.లు |
| 3 | 28250900 | 28/11/2025 | DRDO ఎనరోబిక్ బ్యాక్టీరియా వగైరా | 833891 లీటర్ |
| 4 | 30250546C | 21/11/2025 | డిస్‌కనెక్టింగ్ మరియు ఎర్తింగ్ డివైస్ 8-పోల్-వగైరా | 240 సం.లు |
| 5 | 29255157 | 20/11/2025 | అండర్‌గ్రౌండ్ రైల్వే జెల్లీ ఫిల్ 6 క్వాడ్ కేబుల్ వగైరా | 151.8 కిలోమీటర్లు |
| 6 | 29255129 | 18/11/2025 | 5 వాట్ల VHF డిజిటల్ వాకీ యొక్క సరఫరా వగైరా | 1020 సెట్‌లు |
| 7 | 33251078 | 17/11/2025 | డిస్‌కనెక్టింగ్ మరియు ఎర్తింగ్ డివైస్ వగైరా | 548 సం.లు |
| 8 | 29255170 | 17/11/2025 | PVC ఇన్సులేటెడ్ అర్మర్డ్ అన్‌స్క్రీన్డ్ సరఫరా వగైరా | 56.5 కిలోమీటర్ |

C.P.R.O./S-55 — ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్ మేనేజర్, గోరఖ్‌పూర్

రైలులో బీడీ / సిగరెట్ పొగ త్రాగవద్దు

మొంథా తుఫాన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అన్నదాతలకు కన్నీటిని మిగిల్చింది. తుఫాన్ ప్రభావంతో రెండు రాష్ట్రాల్లోని పలుజిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు అన్నదాతలు కకావికలంఅయ్యారు. దిగుబడి రాక ఇబ్బందులు పడుతుంటే ప్రకృతి రైతుపై పగబట్టినట్లు పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ విరుచుకుపడటంతో రైతుల పరిస్థితి అస్తవ్యస్తమైంది. రెండురాష్ట్రాల్లో ఆరుగాలం శ్రమను నీటిపాలు చేసి రైతుకుకన్నీళ్లు మిగిల్చింది. ఒక పక్క కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసుకున్న ధాన్యాన్ని తడిపిముద్దచేసింది. పలుచోట్ల ధాన్యం కుప్పలు కొట్టుకుపోయాయి. ఇంకా కోయని చేళ్లను నేలరాల్చి అపార నష్టాన్ని తెచ్చింది. లక్షలాదిఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం కలిగించింది. నోటికి వచ్చిన పంటలను తుఫాన్ ఎగరేసుకెళ్లడంతో ఎక్కడ చూసినా రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. భారీవర్షాలు, ఈదురుగాలుల కారణంగా రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లోని చెరువులు, కుంటలు తెగి పంటలు కొట్టుకుపోయాయి భారీగా పంటనష్టం జరిగింది. ఎడతెగని వానతో అనేకజిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరి, పత్తి, మక్క, మిరప పంటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాలతో పాటు కల్లాల్లోని వడ్లు కూడా తడిసిముద్దవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే భారీ వర్షాలు, తెగుళ్లతో దిగుబడి తగ్గిపోయి నష్టాల్లో కూరుకుపోతున్నామని ఆందోళనచెందుతున్న పత్తిరైతులను కూడా తుఫాన్ ఆగం చేసింది. తెలంగాణలోని పలుచోట్ల పంట చేనుల్లో నీరు నిలిచి నష్టం వాటిల్లింది. లక్షలాది ఎకరాల్లో పంట ఇంకా నీట మునిగే ఉన్నది. పొలాలన్నింటినీ వరద దున్నేసింది. వేల ఎకరాల్లో చేతికొచ్చిన పత్తి పంట రాలిపోయింది. వివిధ జిల్లాల్లో, చేతికొచ్చిన వరి, అరటి, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు తది తర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కష్టపడి పండించిన పంట నాశనం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

# రైతులను ముంచిన మొంథా తుఫాన్

**సిహెచ్ వి వి రఘుబాబు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో మొంథా తుఫాను రైతులను ముంచేసింది. వర్షాలకు తోడు, పంటల బీమా అమలు కాక రెండు రాష్ట్రాల్లో రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందే పరిస్థితి లేకుండా పోయింది. ఆంధ్రలో మొక్కుబడిగా బీమా అమలు చేయగా, తెలంగాణలో అసలు ఎటువంటి బీమా కూడా లేకుండా పోయింది. తెలంగాణలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో భారీగా పంట వరదపాలైంది. రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే భారీ నష్టం వాటిల్లిందని అధికారిక లెక్కలతో స్పష్టమవుతున్నది. ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లోనూ భారీ నష్టం వాటిల్లింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కల్లాల్లో, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది. కోతకు వచ్చిన పైరు నేలవాలింది. పంట కోసే సమయంలో నేలకొరగడంతో దిగుబడి తగ్గే అవకాశాలున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్తగూడెం జిల్లాలోని వివిధ మండలాల్లో మిర్చి, పత్తి, మక్కతో పాటు వరి పంటలు దెబ్బతిన్నాయి. మహబూబాబాద్ జిల్లాలో వాగులు పారడంతో వందల ఎకరాల్లో వరి నీట మునిగింది. ఆరబెట్టిన మక్కలు తడిసి ముద్దయ్యాయి. మహబూబాబాద్, కేసముద్రం మార్కెట్ యార్డ్‌కు తెచ్చిన మక్కలు తడిసిపోయాయి. ఆదిలాబాద్ జిల్లాలో వర్షాలకు వల్ల పత్తి ఏరేందుకు వీలు లేకుండా పోయింది. పత్తి, సోయాపంటలో తేమ శాతం పెరిగిపోయి నష్టపోవాల్సివస్తోంది. సోయా కోతలు పూర్తయి నెలరోజులైనా కొనుగోలు చేయకపోవడంతో పంట ముక్కిపోయే ప్రమాదం ఉంది. సిద్ధిపేట, హుస్నాబాద్ మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసిపోపోయింది. ఆరబోసి వడ్లు వరద నీటిలో కొట్టుకుపోయాయి. సంగారెడ్డి జిల్లాలోవరి, పత్తి, సోయాపంటలు దెబ్బతిన్నాయి. భూపాలపల్లి జిల్లాలో రైతులు పత్తి ఏరేందుకు సన్నద్ధమవుతుండగా భారీ వర్షాలతో చేలల్లోనే పత్తి తడిసి రంగు మారుతోంది. ఎకరాకు నాలుగు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈదురు గాలులకు వరి, మిరప తోటలు నేలవాలాయి. వేలాది ఎకరాల్లో వరి నీట మునగగా తోటల్లో నీరు నిలిచి జాలువారి మొక్కలు చనిపోతున్నాయి. జనగామ జిల్లాలో కోతదశలో ఉన్న వరి నేలవాలింది. సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలో వరి పంట దెబ్బతినగా, కొన్ని చోట్ల వడ్లు, మక్కలు తడిసిపోయాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో చెరువుల కింద ఉన్నపొలాలు నీటమునిగాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో ముసురువానలతో పత్తి పూర్తిగా తడిసి రాలిపోతోంది. పత్తి నల్లగా మారి మొలకెత్తు



తోంది. నల్గొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో కోతలకు సిద్ధంగా ఉన్న వందల ఎకరాల్లోని వరి భారీవర్షాలు, బలమైన ఈదురు గాలులతో నేలకొరిగింది. తెంపడానికి సిద్ధంగా ఉన్న పత్తి, ఇప్పటికే తెంపిన పత్తి వర్షానికి పూర్తిగా తడిసిపోవడంతో బరువు తగ్గి, రంగుమారడంతో సరైన ధర వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. కొత్తగూడెం జిల్లాలో కోతదశకు వచ్చిన వరి చేన్లు నేలవాలాయి. జిల్లాలో 2లక్షల ఎకరాల్లో వరి వేయగా 30 శాతం పంట దెబ్బతినే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కామారెడ్డి జిల్లాలో ఆగకుండా పడిన వానలతో వడ్లు, మక్కలు తడిసి ముద్దయ్యాయి. వివిధ మండలాల్లో సెంటర్లలో అరబోసిన వడ్లకుప్పలతో పాటు, మొక్కజొన్న తడిసి ముద్దయ్యాయి. ఇక తుఫాను కారణంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 4,47,864 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ మేరకు నివేదికను ప్రభుత్వానికి అందించింది. తుపాను ప్రభావంతో 12 జిల్లాల్లో 179 మండలాల్లో 2,53,033 మంది రైతులకు చెందిన 4,47,864 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. అత్యధికంగా వరి, పత్తి, మిర్చి, కూరగాయలు, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. వరి 2,82,379 ఎకరాల్లో, పత్తి 1,51,707 ఎకరాల్లో నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదికలో తెలిపింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,30,200ఎకరాల్లో పంట నష్టం వాటిల్లగా, ఖమ్మం జిల్లాలో 62,400 ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 52,071 ఎక రాల్లో పంట నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఎకరాకు ఎంతపరిహారం ఇవ్వాలన్నదానిపై ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. మొంథా తుఫాన్ వల్ల ఆంధ్రప్రదేశ్‌వ్యాప్తంగా దాదాపు 15 లక్షల ఎకరాలలో పంట నష్టం సంభవించింది. ము ఖ్యంగా వరి వంటి పంటలు నేలకొరిగాయి. రైతులు తమ కళ్ళముందే చేతికి వచ్చిన పంట నాశనం కావడంతో తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మొంథా తుఫాన్ వరి రైతులను నిండా ముంచేసింది. భారీ వర్షాలకు ఈదురుగాలు తోడవడంతో పంటనష్టం మరింత పెరిగింది. బాపట్ల, వేమూరు, రేపల్లె, తెనాలి ప్రాంతాలలో వేల ఎకరాలలో వరి నేలవాలిపోయింది. కంకుల దశకు వచ్చిన వరి పంట పూర్తిగా నేలకొరిగింది. కంటిన్యూగా వర్షం కురియడంతో పంట పై రైతులు ఆశ వదిలేసుకోవాల్సి న పరిస్థితి ఏర్పడింది. కళ్లముందే పంట నాశనం కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వరి పంటలకు అపార నష్టం వాటిల్లింది. చేతికి అంది వచ్చిన సమయంలో వరి పంట నేలకొరిగింది. ఆరుగాలం కష్టించి పండించిన వరి పంటలు నేలపాలు కావడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎకరానికి 30వేల నుండి 40 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లింది. ఎకరానికి 40 బస్తాలు వచ్చే దిగుబడి ఇప్పుడు 10 నుండి 20 బస్తాలు మాత్రమే వచ్చే పరిస్థితి నెలకొంది. పంట నష్టాన్ని ఏపీ ఎయి మ్స్ (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) యాప్‌ల ద్వారా నమోదు చేయాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. రాష్ట్రంలో తొలిసారిగా ఉపగ్రహ ఛాయా చిత్రాలు, ఇతర సాంకేతిక సమాచారం ఆధారంగా కాకినాడ, కోనసీమ, నెల్లూరు జిల్లాల్లో పూర్తిస్థాయిలో పంటనష్టాన్ని అంచనా వేసేందుకు సిద్ధమవుతోంది. ఇదే సమయంలో తుఫాన్‌తో రూ.5,265 కోట్ల మేర నష్టం సంభవించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. శాటిలైట్ చిత్రాలు, డ్రోన్లు, సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నష్టాన్ని అంచనా వేసింది. తుఫాన్ వల్ల వ్యవసాయ పంటలకు రూ.829కోట్లు, ఉద్యాన పంటలు రూ.39 కోట్లు, పట్టు పరిశ్రమ రూ.65 కోట్లు, ఆక్వా రూ.1,270 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్లు రూ.2,079 కోట్లు, పురపాలక శాఖ రూ. 109 కోట్లు, జలవనరుల విభాగం రూ.207 కోట్లు, పంచాయతీరాజ్ రూ.8 కోట్లు, విద్యుత్ శాఖ రూ.16 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.71 లక్షలు నష్టం వాటిల్లగా, రాష్ట్రవ్యాప్తంగా 120 పశువులు చనిపోయాయి. త్వరలోనే నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేసి, కేంద్రానికి నివేదిక పంపుతున్నట్లు ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. మరోపక్క డబుల్ ఇంజిన్ సర్కార్ విధానం తుపాన్ సృష్టించిన విలయానికి లక్షల ఎకరాల్లో పంటనష్టాలను చవిచూసిన రైతులకు అందాల్సి న కొద్దిపాటి బీమాకు దూరం చేసింది. ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యానవన పంటలన్నీ కలుపుకొని కోటిఎకరాలకు పైగా రైతులు సాగు చేయగా దిగుబడి ఆధారిత, వాతావరణ ఆధారిత రెండు బీమా పథకాల్లో చేరిన విస్తీర్ణం 19.57 లక్షల ఎకరాలు మాత్రమే. తమ పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకున్న రైతులు సుమారు ఏడున్నర లక్షల మంది మాత్రమే. గత ఖరీఫ్ కంటే ఈ ఖరీఫ్ లో భారీగా బీమా చేయించిన విస్తీర్ణం, రైతుల సంఖ్య తగ్గడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకమే కారణం. దీంతో రైతులకు పంట నష్ట పరిహారం అందే పరిస్థితి లేకుండా పోయింది. ●

పశ్చిమ బెంగాల్

భయపడేవారికి తాడు కూడా పాములా కనిపిస్తుందంటారు. అదే సర్పరజ్జు భ్రాంతి. కొన్ని పార్టీలు, వాటి నాయకులు 'సర్' పై చేస్తున్న వ్యాఖ్యలు వింటుంటే అదే గుర్తుకు వస్తుంది. ఎన్నికలముందు ఓటర్ల జాబితాలు సవరించడం, ఆ జాబితాలలో పొరబాట్లు లేకుండా, ఏ ఓటరుకు నష్టం రాకుండా పారదర్శకంగా చెక్ చేయడం ఎన్నికల కమిషన్ విధుల్లోని చాలా ముఖ్యమైన అంశం. ప్రతి ఎన్నికల సమయంలో ఏదో ఒక స్థాయిలో ఈ ప్రక్రియ చేపడుతూనే ఉంటారు. కానీ 'సర్'అనే పేరుతో చేపడుతున్న ప్రత్యేక సవరణలే ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ( సర్) అనే పేరుతో బీహార్ ఎన్నికల సందర్భంగా ఇటీవల ఎన్నికల కమిషన్ రూపొందించిన జాబితాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ సహా చాలా మంది విపక్ష నేతలు దుమ్మెత్తి పోశారు. అందుకు వారి కారణాలు వారికి ఉండవచ్చు. కానీ సిఇసి జ్ఞానేశ్ కుమార్ చెబుతూనే ఉన్నారు. అర్హులైన ఓటర్లలో ఏ ఒక్కరూ తమ హక్కును కోల్పోరనీ, తాము చేసిన సవరణలు 'క్రిస్టల్ క్లియర్'గా ఉన్నాయనీ సిఇసి వివరిస్తూనే ఉన్నారు. అయినా ప్రజాస్వామ్యానికి ఏదో ప్రళయం వచ్చినట్లుగా విపక్షాలు కత్తులు దూయడమే ఆశ్చర్యం కలిగిస్తుంది. బీహార్‌లో సవరణలకు వ్యతిరేకంగా రాహుల్ పాదయాత్రలే నిర్వహించారు. ఆర్జేడీ వంటి ఇతర పక్షాలుకూడా 'సర్'ను వ్యతిరేకించాయి. అయినా ఇసి చేయవలసిందేదో చేసి ఎన్నికల దాకా వచ్చింది. గతవారం రెండో విడత సర్‌ను సిఇసి ప్రకటిస్తూ 12రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటరు జాబితాల సవరణ చేపట్టనున్నట్లు తెలిపింది. వాటిలోని నాలుగు రాష్ట్రాల్లో వచ్చే యేడాది ఎన్నికలు జరుగుతాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ కూడా ఆ నాలుగు రాష్ట్రాల్లో ఉన్నాయి. సిఇసి జ్ఞానేశ్ కుమార్ గత ఆదివారం (26, అక్టోబరు) రెండో విడత సర్‌ను ప్రకటించగానే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తాము దానిని అంగీకరించబోమనీ, తన రక్తంలోని ఆఖరి బొట్టు వరకు సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతాననీ ప్రకటించారు. మరోవంక తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా అదే వైఖరి కనబరిచారు. మమతా బెనర్జీ సిఇసిని

# సర్ X మేడమ్!

**ఎ.వి.వి ప్రసాద్**

చాలా నిశితంగా విమర్శిస్తూ సర్ పేరుతో 12 రాష్ట్రాల్లో ఓటు చోరీ ఆట ఆడేందుకు మోడీ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కుమ్మక్కయ్యారనీ, తాము వారి ఆట సాగనివ్వబోమనీ హెచ్చరించారు. బీహార్‌లో 69 లక్షల ఓటర్ల తొలగింపునకు దారి తీసిన సర్‌ని ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించి ఓటరు జాబితా మోసాలకు కుట్ర పన్నారని కూడా ఆమె ఆరోపించారు. సుప్రీంకోర్టులో ఈకేసు విచారణ పెండింగ్‌లో ఉండగా దేశ వ్యాప్తంగా సర్‌ను అమలు చేయడానికి ఎన్నికల కమిషన్ ఎందుకు తొందర పడుతోందని ప్రశ్నించారు. వెస్ట్ మిడ్నపూర్‌కు చెందిన ఓ వృద్ధుడు ఇటీవల మరణించడానికి కారణం'సర్' అంటూ ముఖ్యమంత్రేఆరోపించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కుమార్తె ఇంటిలో ఉన్న ఆయన స్వగ్రామంలోని తన ఓటు పోతుందేమోననే బాధతో మరణించా డని ప్రచారం చేశారు. రెండు జిల్లాల్లో కాదు. రెండు రాష్ట్రాల్లో ఓటరుగా నమోదు చేయించుకొని కొనసాగుతున్నవారు నిజానికి లక్షల్లోఉన్నారు. అటువంటిదే బీహార్‌లోని జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్‌కిశోర్ వ్యవహారంకూడా. ఆయనకుబీహార్, బెంగాల్ రెండు చోట్లా ఓటుహక్కు ఉన్నట్లు కనుగొని ఇసి నోటీసులు జారీ చేసింది. పైకి ఎన్నో ఆదర్శాలువల్లించే ప్రశాంత్ కిశోర్ కే రెండుచోట్ల ఓటు హక్కు ఉన్నప్పుడు సాధారణ ప్రజలకు ఉండదని ఎలా చెప్పగలం! అటువంటిఅక్రమాలను కనుగొనడం, వాటిని ఏరివేయడం ఎన్నికల కమిషన్ విధి కనుక 'సర్' వంటి చర్యలను అమలు చేస్తూ ఉంటుంది. అర్హులైన ఓటర్లను ఇసిమాత్రం ఎందుకు తొలగిస్తుంది? అలా చేస్తే చరిత్రలో ఎంతచెడ్డపేరు మూటగట్టు కుంటుంది! పైగా అన్ని జాబితాలను పూర్తిగా స్థానిక కార్యాలలో సైతం ప్రదర్శిస్తున్నారు, కంప్యూటర్లలో అందుబాటులో ఉంటున్నాయి. ఎవరైనా చూడవచ్చు, ఎలాంటి అభ్యంతరాన్నయినా తెలియజేయవచ్చు. అటువంటప్పుడు ప్రక్రియను అడ్డుకోవడానికి ప్రయత్నించడం సబబుకాదుకదా! ప్రజాస్వామ్య హననానికి ఇసి యత్నిస్తున్నదనీ, ఆ చర్యలను తాము ఎదుర్కొంటామనీ తమిళ సిఎం స్టాలిన్ అనడంకూడా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఓటర్ల జాబితాల సవరణ ప్రజాస్వామ్య హనన మెలా అవుతుందో ఆయనకే తెలియాలి. ప్రజలను అలా రెచ్చగొట్టడంవల్ల ఆ నేతలకు లభించే ప్రయోజనమేమిటో మరి! ఓటర్లు వివిధప్రాంతాలకు వలస పోవడం, అనేకచోట్ల వారు రిజిస్టర్ చేసుకోవడం, మృతులపేర్లు జాబితాల నుంచి తొలగించకపోవడంవంటి అనేక కారణాలు ఓటరు జాబితాలసవరణ ఆవశ్యకతను తెలియజేస్తున్నాయి. దానిని ప్రజాస్వామ్య హననంఅని ఎలాఅనగలం? తమిళనాడు, పశ్చిమబెంగాల్‌తో పాటు కేరళ, జార్ఖండ్ కూడా సర్‌నువ్యతిరేకిస్తున్నాయి. అయితే కొన్ని రాష్ట్రాల్లో అక్రమఓటర్లు అధికంగా ఉన్నారనీ, అందువల్ల ఆరాష్ట్రాలే సర్‌నువ్యతిరేకిస్తున్నాయనీ బిజెపి నేతలు వాదిస్తున్నారు. నిజానికి ఈవాదన కూడా సమర్థనీయం కాదు. అక్రమ ఓటర్లు అధికంగా ఉంటే అక్కడి ప్రభుత్వానికే తొలుత నష్టం సంభవిస్తుంది. అక్రమ ఓటర్లను జాబితాలనుంచి తొలగిస్తే ఆరాష్ట్రాలలోని పార్టీలకే తొలుతప్రయోజనం చేకూరుతుంది. పశ్చిమబెంగాల్‌లో బీహార్ కంటే ఎక్కువ అక్రమ ఓటర్లు ఉన్నారనీ, వారిని తొలగించకుండా ఎన్నికలు జరిపితేఅధికార తృణమూల్ కాంగ్రెస్‌కే ఎక్కువ నష్టమనీ పరిశీలకులు కూడా అంటున్నారు. కానీ మమత మాత్రం తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అన్నట్లుగా సర్‌ను అమలుచేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అంటున్నారు. ఏదిఏమైనా తదుపరిఎన్నికలలోకూడా సర్‌వివాదమే ప్రధానంగాఉండేసూచనలే కనిపిస్తున్నాయి. ప్రజలను ఎవరుతప్పు దోవ పట్టించినా అది గర్హనీయమే. తాము కూర్చున్న కొమ్మనే నరుక్కునే నాయకులను ఏమనాలి? ●



మమతా బెనర్జీ


నెదర్లాండ్స్

వాయవ్య ఐరోపాలోని చిన్నదేశంలో జరిగిన ఎన్నికలు ఇప్పుడు ప్రపంచదేశాల్లో చర్చా వేదికగా మారాయి. 1.85 కోట్ల మంది మాత్రమే జనాభా ఉన్న ఈ దేశం అభివృద్ధి చెందిన దేశంగానే భాసిల్లుతోంది. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న పివివి పార్టీని కాదని ఇప్పుడు ఆదేశ ప్రజలు డి66 డచ్ లిబరల్ ప్రగతిశీల పార్టీ అధికారం చేపట్టబోతోంది. అందులోనూ 38ఏళ్ల వయసున్న పిన్నవయసు ప్రధానిగా ఇప్పుడు ఆపార్టీ నేత రాబ్‌జెట్టెన్ ప్రధాని పీఠం ఎక్కబోతున్నాడు. అధికారంలో ఉన్న పివివి పార్టీ, డి66 పార్టీలు చెరొక 26సీట్లను గెలుచుకుంటుంటే ఇతరత్రా ఉన్న వివిడి 22 సీట్లు, పివిడిఎ జిఎల్20, సిడిఎ 18, జెఎ 21 పార్టీ తొమ్మిది, ఎఫ్వీడీ ఏడు ట్రిపుల్‌బి నాలుగు ఇలా సీట్లను పంచుకోనున్నాయి. ఎగ్జిట్‌పోల్స్‌లో కూడా పివివి, డి66 పార్టీలకు 26 సీట్ల చొప్పున మాత్రమే వస్తాయని వేసిన అంచనాలు తప్పకుండా ఫలితాలు వచ్చాయి. మరొక్క స్థానంలో డి66 అభ్యర్థి గెలుస్తారన్న నమ్మకంతో ఇప్పుడు ఆ పార్టీకి 27 సీట్లుతో నెదర్లాండ్స్‌లో అతిపెద్ద పార్టీగా అవతరిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు తర్వాత నెదర్లాండ్స్‌లో జెట్టెన్ భవిష్యత్తు తేలిపోతుందని పరిశీలకుల అంచనా. ఎన్నికల్లో జెట్టెన్ లిబరల్స్ పార్టీ 16.9శాతం ఓట్లు సాధిస్తే వైల్డర్స్ ఫ్రీడమ్ పార్టీ 16.7శాతం ఓట్లు సాధించి డి66కు గట్టి పోటీగానే నిలుస్తోంది. బ్రిటిష్ వలసవాదుల నుంచి విముక్తి పొందిన దేశంగా నెదర్లాండ్స్‌కు పేరున్నా ఇప్పటికీ రాజరికవ్యవస్థ కూడా అమలవుతోంది. అధ్యక్ష, ప్రధానులు అమెరికాను పోలిన పార్లమెంటు వ్యవస్థ కొనసాగుతోంది. ఇప్పటివరకూ అధికారం కొనసాగించిన వైల్డర్స్ పార్టీ ఇస్లాం వ్యతిరేక వైఖరి, వలసలపై కరుడుగట్టిన విధానంతో ప్రజలు కొంత వ్యతిరేకత చూపించారు. ఈసారి కూడా సంకీర్ణం తప్పదని రూఢి అయింది. ఇందుకోసం జెట్టెన్ ఇప్పటి నుంచే కసరత్తులు ప్రారంభించాడు. 150 సీట్ల పార్లమెంటులో అధికారం చేపట్టేందుకు కనీసం 76 సీట్ల మెజార్టీ మార్కు అవసరం అవుతుంది. ఇందుకోసం జెట్టెన్ ఇతర చిన్న పార్టీలన్నింటినీ కలుపుకుని ప్రభుత్వం ఏర్పాటు

# పిన్నవయసు ప్రధాని!

**గన్ని మోహన్**

చేయగలమన్న ధీమాను వ్యక్తం చేసారు. డచ్ ప్రజలు మనకు విజయం ఇచ్చారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన సాగిస్తానని హామీ ఇచ్చినా ప్రభుత్వం ఏర్పాటు ఆయనకు సవాళ్లతో కూడు కున్నదే. ప్రస్తుత డి66, పివివి ఈ రెండు పార్టీలు మినహా మరేఇతర పార్టీకి ఆస్థాయి స్థానాలు రాలేదు. ఇక మిగిలిన విడివి 22, జిఎల్ 290, సిడిఎ 18 స్థానాలు రాబట్టుకోగలిగాయి. వీటిని బుజ్జగించి వాటి గొంతెమ్మకోరికలకు ఒకే చెపితే సులువుగానే జెట్టెన్ ప్రధాని కాగలుగుతారు. గతం నుంచి కూడా ఈ డచ్ దేశంలో ఏ ఒక్క పార్టీ కూడా 30 సీట్లకు మించి గెలిచింది లేదు. సంకీర్ణ ప్రభుత్వాలతోనే నెదర్లాండ్స్ నెట్టుకొస్తోంది. ఇపుడు కాబోయే ప్రధాని జెట్టెన్ పివిడిఎ, గ్రీన్‌లెఫ్ట్ అలయన్స్, క్రిస్టియన్ డెమొక్రాట్లను తనవైపు తిప్పుకునే వ్యూహాలు ముమ్మరం చేసారు. గతంలో కూడా ప్రభుత్వం ఏర్పాటైన 11 నెలలకే కూలిపోయింది. ఈసారి అలా కాకుండా పూర్తికాలం పనిచేసే విధంగా సంకీర్ణ భాగస్వాములను మెప్పించే పనిలో జెట్టెన్ ఉన్నారు. డచ్ ఓటర్లు ఎక్కువ ఓట్లు వేసిన పార్టీలు విధిగా తనకు మద్దతునిస్తాయన్న ఆశాభావం తో ఉన్నారు. నెదర్లాండ్స్‌లో ఉన్న ఇళ్లకొరత, శరణార్థుల పెరుగుదల, అక్రమ వలసలను కట్టడి చేస్తానని దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకుపో తానని చెపుతున్న జెట్టెన్ ప్రసంగాలపై ఓటర్లు కూడా ప్రభావితులయ్యారు. ప్రస్తుత ప్రధాని డిక్ స్కూఫ్ మళ్లీ తానే ప్రధాని అవుతానన్న ధీమాతో ఉన్నారు. 2023లో ఎన్నికయిన స్కూఫ్ 11నెలలకే తన సొంత ప్రభుత్వాన్ని రద్దుచేసుకోవాల్సి వచ్చింది. తన సంకీర్ణ భాగస్వాములతో శరణార్థి, వలసల విధానాలపై విభేదించడంతో ఆయన ప్రభుత్వం కుప్పకూలి మళ్లీ ఎన్నికలకు వచ్చింది. అయితే క్రిస్మస్ నాటికి నేనే ప్రధాని అయి అందరినీ ఆశ్చర్య పరుస్తానని ఢంకా బజాయించి ప్రచారం చేసుకుంటున్నారు. ఈ తరుణంలో డి66 పార్టీ నేత జెట్టెన్ వ్యూహాలు ఎలా ఉంటాయన్నదే ఇతర పార్టీలకు అంతుబట్టకుండా ఉంది. డచ్ ప్రజల అభీష్టాన్ని అనుసరించి అన్ని పార్టీలు ప్రభుత్వం ఏర్పాటుకు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. గృహ మార్కెట్‌తోపాటు వలసలు, శరణార్థులపై వైఖరి, వాతావరణం, ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలు ఇప్పుడు ప్రభుత్వానికి కీలకమని ఇందుకోసం భావసారూప్యత ఉన్న అన్ని పార్టీలు కలిసిరావాలని జెట్టెన్ ఇచ్చిన పిలుపునకు సానుకూల స్పందన కనిపించింది. జెట్టెన్‌కు ఉన్న ఆకట్టుకునే వ్యక్తిత్వం, క్లీన్‌కట్ ఇమేజ్, సానుకూల ధృక్పథం, ప్రజల్లోకి చొచ్చుకుపోయే తత్వం వంటివి ఆయనకు ప్రధాని కాగల లక్షణాలుగా రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. అనుకున్నట్లుగానే టివిడిబేట్లలోను, చర్చా వేదికల్లోను, ఎన్నికల ప్రచారంలో కూడా జెట్టెన్ తనదైన శైలిలో దూసుకునిపోయారు. మరోసారి డిక్ స్కూఫ్ ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నా ఆయన అనుసరించిన అణిచివేత వైఖరి ప్రజలకు ఎంత మాత్రం రుచించలేదు. వలసలు, శరణార్థులను బలవంతంగా వెనక్కి పంపించడం, ఉక్రెయిన్ శరణార్థులపట్ల ఆయన అనుసరించిన కఠిన వైఖరి నెదర్లాండ్స్ ప్రజల్లో తీవ్ర వ్యతి రేకతను పెంచింది. దీనికితోడు దేశ ఆర్థిక వ్యవస్థ, ఆర్థికవృద్ధి, పారిశ్రామిక ఉత్పత్తి, సేవలరంగం రూపురేఖలను మార్చడంకంటే ఆయన ప్రతిపక్షాలను తొక్కిపెట్టేందుకే ఎక్కువ సమయం వెచ్చించారన్న భావన పెరిగిపోయింది. అందువల్లనే డచ్‌ప్రజలు ఇప్పుడు రాబ్‌జెట్టెన్ ఆయన పార్టీ డి66కి మొగ్గు చూపిస్తున్నట్లు స్పష్టం అవుతోంది. దీనితో డచ్ చరిత్రలో అతిపిన్న వయసు ప్రధానిగా ఇప్పుడు రాబ్ జెట్టెన్ పదవీబాధ్యతలు చేపట్టనున్నారు. ●



రాబ్‌జెట్టెన్

# పారిశ్రామికవేత్తలకు భూముల ధారాదత్తం!

**బొల్లిముంతసాంబశివరావు**

ఆంధ్రప్రదేశ్లో ఏర్పడిన ఏ ప్రభుత్వమైనా బడా పారిశ్రామికవేత్తలకు భూములు కట్టబెడుతూనే ఉన్నాయి. నేడు చంద్రబాబు నాయకత్వాన ఉన్నకూటమి ప్రభుత్వం పరిశ్రమాధిపతులకు ఎంతోవిలువైన భూములను అప్పగిస్తూ నిర్ణయాలు తీసుకోవడంలో దేశంలోనే ముందు ఉన్నది. ప్రజల మనుగడకు భూమి ఆధారం. భూమికి ఎంతో ప్రాధాన్యత ఉంది. అలాంటి భూమి ప్రజలవద్దే ఉండాలి తప్ప దోపిడీదారుల పరంకాకూడదు. గ్రామీణ రైతులకు వ్యవసాయ భూమి ప్రాణవాయువు లాంటిది. కన్నబిడ్డతో సమానంగా భూమిని రైతు కాపాడుకుంటాడు. సేద్యం ద్వారా తన కుటుంబాన్ని బతికించుకోవడమే కాకుండా దేశ ప్రజలకు ఆహారాన్ని అందించి వారినీ బతికిస్తున్నాడు. అంతటి ప్రాధాన్యత ఉన్నభూమిని రైతాంగం నుండి పాలకులు దూరం చేస్తున్నారు. ఇప్పటివరకు పాలించిన, పాలిస్తున్న కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రైతాంగ ప్రయోజనాలను పక్కనపెట్టి బడాపారిశ్రామికవేత్తల, విదేశీసంస్థల దోపిడీ ప్రయోజనాల కోసం భూమిని వినియోగించే విధానాలు అమలు జరుపుతున్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం శరవేగంగా దీన్ని అమలుచేస్తున్నది. బ్రిటిష్ వలస పాలకులు, తమ అవసరాల కోసం నిర్మించే రైల్వేల నిర్మాణం కోసం ఇతర ప్రాజెక్టులకు భూసేకరణ కోసం 1870లో భూస్వాధీన చట్టం చేసింది. భూయజమానుల రక్షణ, భూమి విలువకు సంబంధించిన అంగీకారం లేనప్పుడు కోర్టు నిర్ణయం కోసం కలెక్టర్నూ చించాలని ఆచట్టంలో పేర్కొన్నారు. దీనివల్ల చిన్న రైతులు భూమి విలువకన్నా చాలా ఎక్కువ మొత్తాన్ని కోర్టు ఖర్చులకు చెల్లించాల్సి రావటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. 1870 చట్టంరైతాంగ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండటంతో, ఆచట్టం వెడల వ్యతిరేకవ్యక్తమైంది. అలాంటి పరిస్థితుల్లో 1894లో మరొక భూసేకరణ చట్టాన్ని వలస పాలకులు చేయటం జరిగింది. ఈ చట్టం, ప్రజా ప్రయోజనాలకోసం భూమిని పొందేందుకు ప్రభుత్వానికి హక్కు కల్పించింది. భూసేకరణ ప్రక్రియను క్రమబద్ధీకరణ, న్యాయమైన పరిహారం నిర్ధారించడం, పర్యావరణ పరిణామాలను పరిగణలోకి తీసుకోవటం గురించి చట్టంలో పేర్కొన్నారు. ఈ చట్టంలో పునరావాసం (ఆర్అండ్ఆర్) గురించి ఎటువంటి ప్రస్తావన లేకపోవటం వల్ల బాధిత కుటుంబాలకు ఆశ్రమం, ఉద్యోగాలు జీవనోపాధి లేకుండా పోయింది. భూమికి ఇచ్చేపరిహారం కూడా ప్రభుత్వ ఇష్ట ప్రకారం నిర్ణయించడం వల్ల చాలా తక్కువ పరిహారం లభించేది. ఈచట్టం కూడా రైతాంగ వ్యతిరేకమైనదే. ఈచట్టానికి అనుగుణంగా వలసపాలకులు మొదటిసారి భూసేకరణ ప్రారంభించారు. ఆవిధంగా దేశంలో భూసేకరణ ప్రారంభమైంది. అధికారమార్పిడి తర్వాత ఏర్పడిన స్వతంత్ర పాలనలో కూడా 2013 దాకా1894 చట్టాన్ని అనుసరించే దేశంలో భూసేకరణ, పరిహారం అమలు జరుగుతూ వచ్చింది. వలస పాలనలో చేసిన ఈ చట్టాన్ని రద్దుచేసి రైతాంగ ప్రయోజనాలకు అనుగుణంగా చట్టం చేయాలని రైతాంగం, రైతుసంఘాలు, ప్రజాతంత్ర వాదులు డిమాండ్ చేయడంతో ఆనాటి యుపిఎప్రభుత్వం 2013లో మరో భూసేకరణ చట్టం చేసింది. ఈ చట్టానికి 1894 చటమే ఆధారంగా ఉంది. ఈచట్టంలో న్యాయమైన పరిహారం, పునరావాసం కల్పించడం, ప్రభుత్వం భూమిని సేకరించే ముందు సామాజిక ప్రభావ అంచనాను పరిగణలోకి తీసుకోవటం, పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో కూడిన ప్రాజెక్టులకు భూమిని సేకరించడానికి ప్రభావిత కుటుంబాల్లో కనీసం 70 కుటుంబాల ముందస్తు అనుమతి తప్పనిసరి, పట్టణప్రాంతంలో తీసుకునే భూమికి, భూమివిలువ కంటే రెట్టింపు, గ్రామీణ ప్రాంతాల్లో నాలుగురెట్లు ఎక్కువ పరిహారం ఇవ్వాలని చట్టంలో పేర్కొన్నారు. ఈ చట్టంలో కూడా పరిహారం పెంపు, ముందస్తు అనుమతి, పునరావాసం గురించి పేర్కొన్నారే తప్ప భూసేకరణకు రైతు అనుమతి గురించి ప్రస్తావన లేదు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం పేరుతో రైతుల భూములను ఈచట్టం ద్వారా కట్టబెడుతుంది. గ్రామ సభల తతంగం ఎలాంటిదో ప్రజలకు



బాగానే అనుభవం ఉంది. అమెరికా, ఇంగ్లండ్ దేశాల్లో తమకు అవసరమైన భూమిని పారిశ్రామికవేత్తలు రైతుల నుండి కొనుగోలు చేస్తారు. ప్రభుత్వాలు సేకరించవు. అలాంటి విధానాన్ని భారత పాలకులు ఎందుకు అమలు జరపరు. సెజ్ల ఏర్పాటు బడా పారిశ్రామిక వేత్తలకు భూములు కేటాయించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో కొనసాగుతన్నది. 1894 చట్టాన్ని అనుసరించి 2013 దాకా భూసేకరణ కొనసాగింది. ఈచట్టాన్ని అనుసరించే 2005లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ఆర్థికమండల్ల (సెజ్) చట్టం చేసిపరిశ్రమల పేరుతో వేలాది ఎకరాల రైతుల, పేదల అసైండ్భూములను బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టింది. సెజ్చట్టం కొత్త భూఎస్టేట్ దారుల ఏర్పాటుకి దారితీసింది. కిరణ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సెజ్ల పేరుతో పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయింపు కొనసాగించింది. ప్రైవేట్ సంస్థలకు భూములు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2012లో భూకేటాయింపుల విధానం అమల్లోకి వచ్చినప్పటికీ, గత13సంవత్సరాల్లో రాష్ట్ర పాలకులు బడా పారిశ్రామికవేత్తలకు పెద్దఎత్తున భూములు ఇచ్చారు. ల్యాండ్ మేనేజ్మెంట్ అథారిటీ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలకు 1,82,270 ఎకరాలను కేటాయించారు. వీటి విలువ లక్ష కోట్లరూపాయలు. భూకేటాయింపుల్లో ఎక్కువ భాగం ఏపీఐఐసీదే. పరిశ్రమలు, కంపెనీలస్థాపనకు, ల్యాండ్బ్యాంకు పేరిట ఏపీఐఐసీకి 64,788 ఎకరాలు కేటాయించారు. ఈ భూములను పరిశ్రమలస్థాపన పేరుతో తక్కువ ధరకు పరిశ్రమాధిపతులకు కేటాయించారు. ఇవికాకుండా సోలార్, విండ్, ఇతర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం 42,084 ఎకరాలు కేటాయించింది. రాజధాని పేరుతో రైతుల భూములు స్వాధీనం 2014 ఎన్నికల్లో గెలిచిన టిడిపి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో ప్రైవేటీకరణ విధానాలను అమలు జరిపింది. బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంది. ప్రపంచంలోనే గొప్పరాజధాని పేరుతో, దేశ, విదేశీ బడాపారిశ్రామిక వేత్తలకు భూములు కట్టబెట్టేందుకు 34 వేల ఎకరాలను ల్యాండ్పూలింగ్పేరుతో రైతుల అసైన్డ్భూములను తీసుకున్నది. 2019ఎన్నికల్లో గెలుపొందిన వైసిపి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ ప్రభుత్వం కూడా పెట్టుబడిదారీ అనుకూల విధానాలను అమలుచేస్తూ, పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయించింది. 2024లో మరోసారి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు పెద్దఎత్తున భూసేకరణ ప్రారంభించాడు. భూసేకరణ వల్ల భూములకు 2013 భూసేకరణ చట్టంప్రకారం పరిహారం ఎక్కువ ఇవ్వాల్సి వస్తుందని గత ల్యాండ్పూలింగ్మాదిరిగా మరో 44 వేల ఎకరాలను సేకరిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించాడు. దీనిపైరైతుల్లో తీవ్రవ్యతిరేకత వ్యక్తమైంది. ఇవికాక ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ప్రకారం ఏపీలోలక్షా 4వేల ఎకరాలకుపైగా భూమిల్యాండ్బ్యాంకుల్లో ఉంది. అనేక రాష్ట్రాల్లో 500లేక 1000 ఎకరాల్లో మంచి రాజధానుల ఏర్పాటు జరిగింది. ఏపీలో రాజధానికోసం లక్షఎకరాల సేకరణ ఎందుకు? ఈభూములను పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టటానికే గదా! కూటమి ప్రభుత్వం అతిచౌకగా రాజధాని అమరావతిలో వివిధ సంస్థలకుభూములు కేటాయిస్తూ మార్చి 2025న ఉత్తర్వులు జారీచేసింది. మంత్రుల బృందం సిఫార్సుల మేరకు ఈకేటాయింపులు జరిగాయి. ఇంకా అనేక సంస్థలకు భూకేటాయింపులకు కూటమి ప్రభుత్వంనిర్ణయంతీసుకుంది. ఈ సెజు ముందుకు సాగలేదు. ఇంకా అనేక సెజ్ల పరిస్థితి కూడా ఇలాగేఉంది. సెజ్ల నిమిత్తం టిడిపిప్రభుత్వం 2018లో 18,242 ఎకరాలను కేటాయించింది. ఇందులో 7,355 ఎకరాలు మాత్రమే వినియోగించబడ్డాయి. సెజ్లద్వారా లభించిన ఉద్యోగాలు నామమాత్రమే. సెజ్ యాజమానులుమాత్రం ప్రభుత్వం ఇచ్చిన భూములు, రాయితీలద్వారా లబ్దిపొందగా, రైతులు మాత్రం భూములు కోల్పోయారు. రాష్ట్రంలోఏపార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రైతాంగ వ్యతిరేక విధానాలనే అమలు జరుపుతున్నాయి. సెజ్లు, పరిశ్రమల పేరుతో రైతుల, ప్రభుత్వ భూములను బడాపారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నాయి. నేడుచంద్రబాబు ప్రభుత్వం బడాపారిశ్రామిక వేత్తలకు కారుచౌకగా కట్టబెట్టడాన్నివ్యతిరేకిస్తూ, రైతులనుండి భూసేకరణను విరమించాలని, ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని గ్రామీణపేదలు, రైతాంగం ఉద్యమించాలి. ●



# వాయుకాలుష్యానికి 17 లక్షలమంది బలి

## ప్రాణాంతక రుగ్మతలతో మరికొన్ని లక్షల మంది

**న్యూఢిల్లీ, నవంబరు 1:** భారత్‌లో వాయు కాలుష్యం పెనుభూతంలా మారుతూ లక్షలాది మంది ప్రాణాలను బలిగొంటోంది. 2022లో ఒక్క ఏడాదిలోనే విషపూరిత గాలి కారణంగా 17 లక్షల మందికి పైగా భారతీయులు మరణించారని తాజా అధ్యయనం తేల్చింది. 2010తో పోలిస్తే ఈ మరణాల సంఖ్య ఏకంగా 38 శాతం అధికం కావడం ఆందోళన కలిగిస్తోంది. "లాన్సెట్ కౌంట్‌డౌన్ ఆన్ హెల్త్ అండ్ క్లైమేట్ చేంజ్" నివేదిక ఈ నిజాలను వెలుగులోకి తెచ్చింది. 71 విద్యాసంస్థలు, ఐక్యరాజ్యసమితి ఏజెన్సీలకు చెందిన 128 మంది నిపుణులు ఈ నివేదికను రూపొందించారు. శిలాజ ఇంధనాలపై మితిమీరిఆధారపడటం, వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో విఫలమవడం ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి తీవ్ర ప్రభావం చూపుతోందో ఇది స్పష్టం చేసింది. ఈ నివేదికపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జెరెమీ ఫర్రార్ మాట్లాడుతూ, "వాతావరణ సంక్షోభం అంటే ఆరోగ్య సంక్షోభమే. పెరుగుతున్న ప్రతి డిగ్రీ ఉష్ణోగ్రత ప్రజల ప్రాణాలను, జీవనోపాధిని బలిగొంటోంది. ప్రభుత్వాల నిర్లక్ష్యం ప్రజలను చంపుతోంది. అయితే, వాతావరణ మార్పులపై సరైన చర్యలు తీసుకుంటే అదే మనకు గొప్ప ఆరోగ్య అవకాశం. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన ఆహారం, పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థలు లక్షలాది మంది ప్రాణాలను కాపాడగలవని వివరించారు. ఈ నివేదిక ప్రకారం, 2012-23 మధ్య కాలంలో భారత్ సుమారు 23.3 లక్షల హెక్టార్ల అటవీ భూమిని కోల్పోయింది. కేవలం 2023లోనే 1.43 లక్షల హెక్టార్ల అడవులు కనుమరుగయ్యాయి.

గడిచిన పదేళ్లలో పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం 3.6శాతం మేర తగ్గింది. ఈ నివేదిక వెలువడిన సమయానికే దేశ రాజధాని ఢిల్లీఎన్‌సీఆర్‌లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. దీని కారణంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ఆసుపత్రులకు వచ్చేవారి సంఖ్య 15 శాతం పెరిగినట్లు నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొంతులో మంట, అలసట, తలనొప్పి వంటి లక్షణాలు వారిని వేధిస్తున్నాయి. అపోలో ఆసుపత్రికి చెందిన పల్మనాలజీ నిపుణుడు డాక్టర్ రాజేశ్ చావ్లా మాట్లాడుతూ "గాలిలోని ప్రమాదకర కాలుష్య కారకాలు క్యాన్సర్, గుండె పనితీరు మందగించడం వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి.

ఈ నెలల్లో రోగుల సంఖ్య 15 శాతం పెరిగింది. వారు కోలుకోవ డానికి కూడా ఎక్కువ సమయం పడుతోందని తెలిపారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకారం గత వారంలో ఢిల్లీలో పీఎం 2.5 కణాల సాంద్రత క్యూబిక్ మీటర్‌కు 488 మైక్రోగ్రాములకు చేరింది. ఇది గత ఐదేళ్లలో అత్యధికం కావడం గమనార్హం.



# మహిళల ఆరోగ్యసంరక్షణలో భారత్‌కు 3 గిన్నిస్ రికార్డులు!

**న్యూఢిల్లీ, నవంబరు 1:** మహిళల ఆరోగ్య సంరక్షణ రంగంలో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం ఏకంగా మూడు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిళ్లను కైవసం చేసుకుంది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా శనివారం అధికారికంగా ప్రకటించారు. మంత్రి తర ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ పోస్ట్ చేశారు. "మహిళల ఆరోగ్యానికి రికార్డు స్థాయి మైలురాయి! 'స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్' ద్వారా భారత్ మూడు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించింది. ఇది మహిళా కేంద్రక, నివారణ ఆరోగ్య సంరక్షణ పట్ల మా నిబద్ధతను మరోసారి చాటుతోంది" అని ఆయన పేర్కొన్నారు. పోషణ్ మాహ్ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, కౌమార బాలికలు, చిన్నారులలో ఆరోగ్యం, పోషకాహార విలువలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ ప్రచారం సాగింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 19.7 లక్షలకు పైగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయగా, 11 కోట్లకు పైగా ప్రజలు వీటి ద్వారా సేవలు పొందారని నడ్డా వివరించారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ఆరోగ్య నిపుణుల భాగస్వామ్యంతో జన భాగస్వామ్య అభియాన్‌గా దీనిని తీర్చిదిద్దారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం ఆరోగ్య సేవలను చేర్చడంలో అంగన్‌వాడీల వంటి వేదికలను సమర్థవంతంగా వినియోగించుకున్నారు. ఈ శిబిరాల్లో భాగంగా చర్మ సంబంధిత వ్యాధులు, రక్తపోటు (హైపర్‌టెన్షన్), రక్తహీనత (అనీమియా), పునరుత్పత్తి ఆరోగ్య సమస్యలు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, మధుమేహం (డయాబెటిస్), క్షయ (టీబీ), సికిల్ సెల్ వ్యాధి వంటి వాటిపై ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో వారికి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్ సెషన్లు కూడా ఏర్పాటు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో సేవ, భారత్ ఫస్ట్ అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమం స్వస్థ్ నారి, సశక్త్ పరివార్, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఒక గర్వకారణమైన ముందడుగని జేపీ నడ్డా తన పోస్టులో పేర్కొన్నారు.



# ఢిల్లీపేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చాలి

## హోంమంత్రికి ఢిల్లీ బిజెపి ఎంపి లేఖ

**న్యూఢిల్లీ, నవంబరు 1:** దేశ రాజధాని ఢిల్లీ పేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చాలని బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ డిమాండ్ చేశారు. అలాగే పాత ఢిల్లీ రైల్వే స్టేషన్‌ను 'ఇంద్రప్రస్థ జంక్షన్'గా, అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 'ఇంద్రప్రస్థ విమానాశ్రయం'గా మార్చాలని కోరారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు శనివారం లేఖ రాశారు. ఢిల్లీ చరిత్ర వేల సంవత్సరాల నాటిది మాత్రమే కాదని, భారతీయ నాగరికత, ఆత్మతోపాటు పాండవులు స్థాపించిన శక్తివంతమైన 'ఇంద్రప్రస్థ' నగరం సంప్రదాయాన్ని కూడా ప్రతిబింబిస్తుందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఢిల్లీ పేరును 'ఇంద్రప్రస్థం'గా మార్చడం వల్ల చరిత్ర, సంస్కృతి, విశ్వాసం పునరుజ్జీవితమవుతుందన్నారు. కాగా, దేశంలోని ఇతర చారిత్రక నగరాలైన ప్రయాగ్‌రాజ్, అయోధ్య, ఉజ్జయిని, వారణాసి వంటివి వాటి పురాతన గుర్తింపులతో తిరిగి కనెక్ట్ అవుతున్నాయని ఢిల్లీ బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ గుర్తు చేశారు. అదే విధంగా ఢిల్లీని కూడా పురాతన మూలాలతో అనుసంధానం చేయాలని కోరారు. 'ఢిల్లీ కేవలం ఆధునిక మహానగరం మాత్రమే కాదు. భారతీయ నాగరికత, ఆత్మ. ఢిల్లీని దాని అసలు రూపంలో గౌరవించాలి. పేరు మార్పు చారిత్రక న్యాయం మాత్రమే కాదు. సాంస్కృతిక పునరుజ్జీవనం వైపు ఒక ముఖ్యమైన అడుగు కూడా. ఇది చరిత్రను పునరుద్ధరిస్తుంది. చారిత్రక న్యాయం, సాంస్కృతిక గౌరవాన్ని సూచిస్తుందని ఆ లేఖలో పేర్కొన్నారు. మరోవైపు ఢిల్లీ పేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చడం వల్ల భారత రాజధాని అధికార కేంద్రమే కాదని మతం, నీతి, జాతీయవాదానికి చిహ్నం అనే సందేశాన్ని భవిష్యత్ తరాలకు పంపుతుందని బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. అలాగే పాండవుల గొప్ప విగ్రహాలను దేశ రాజధానిలో ఏర్పాటు చేయాలని కోరారు. పాండవుల నీతి, ధర్మం, ధైర్యానికి చిహ్నంగా కొత్త తరానికి ఇవి గుర్తు చేస్తాయని ఆ లేఖలో పేర్కొన్నారు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తాతోపాటు ఇతర మంత్రులకు కూడా ఆ లేఖ ప్రతులను ఆయన పంపారు.

# భారత్ భర్త, రష్యా భార్య..బిడ్డ సంరక్షణ ఎవరిది?

## చిన్నారి భవిష్యత్తుపై సుప్రీం ఆందోళన

**న్యూఢిల్లీ, నవంబరు 1:** భారత్‌కు చెందిన భర్త, రష్యాకు చెందిన భార్య మధ్య జరుగుతున్న బిడ్డ సంరక్షణ (కస్టడీ) కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సున్నితమైన కేసులో రెండు దేశాల మధ్య సంబంధాలను దెబ్బతీసేలా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయాలనుకోవడం లేదని స్పష్టం చేసింది. బిడ్డ సహా అదృశ్యమైన రష్యా మహిళ ఆచూకీపై ఆ దేశ ఎంబసీ నుంచి సరైన స్పందన రాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఇది ఒక చిన్నారి భవిష్యత్తుకు సంబంధించిన చాలా సున్నితమైన అంశం. తన తల్లితో ఉన్నందున ఆ బిడ్డ క్షేమంగానే ఉన్నాడని ఆశిస్తున్నాం. ఇది చిన్నారుల అక్రమ రవాణా కేసు కాదని భావిస్తున్నామని జస్టిస్ అభయ్ ఎస్. ఓకా, జస్టిస్ ఉజ్వల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. మహిళ ఆచూకీకి సంబంధించిన వివరాలు సేకరించేందుకు అధికారులకు రెండు వారాల గడువు ఇచ్చింది. తన నుంచి విడిపోయిన రష్యన్ భార్య, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి బిడ్డను తనతోపాటే తీసుకెళ్లిందని తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జులై 7 నుంచి ఆమె, బిడ్డ కనిపించడం లేదని, ఆమెను న్యాయస్థానం పరిధి నుంచి తప్పించే ప్రయత్నం జరుగుతోందని తన పిటిషన్‌లో ఆరోపించారు. జులై 4న రష్యన్ ఎంబసీ వెనుక ద్వారం నుంచి ఓ దౌత్య అధికారి ఆమెను లోపలికి తీసుకెళ్లినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. సదరు మహిళ సరిహద్దు దాటి నేపాల్‌లోకి ప్రవేశించి, అక్కడి నుంచి షార్జా మీదుగా రష్యాకు వెళ్లినట్లుగా భావిస్తున్నామని కోర్టుకు తెలిపింది. మాస్కోలోని భారత రాయబార కార్యాలయం ఆమె వివరాల కోసం ప్రయత్నించినా రష్యా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని విదేశాంగ శాఖ వివరించింది.



గత విచారణలో సుప్రీంకోర్టు ఈ కేసుపై తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. "తల్లిగానీ, తండ్రిగానీ కస్టడీలో లేని బిడ్డను సుప్రీంకోర్టు సంరక్షణ నుంచి లాక్కెళ్లారని వ్యాఖ్యానించింది. భర్త ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు వెంటనే స్పందించి ఉంటే ఆమె దేశం విడిచి వెళ్లే పరిస్థితి ఉండేది కాదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెను గుర్తించేందుకు ఇంటర్‌పోల్ సహాయం తీసుకోవాలని ఇప్పటికే కేంద్రాన్ని ఆదేశించింది.

# వాయుసేన అమ్ముల పొదిలోకి 'మిటియార్'

## 200 కిలోమీటర్ల దూరంలో లక్ష్యాలు ఛేదించే క్షిపణి



**న్యూఢిల్లీ, నవంబరు 1:** ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో భారత వాయుసేన (ఐఏఎఫ్) తన పోరాట సామర్థ్యాన్ని మరింత పెంచుకోవడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా, గగనతలంలో సుదూర లక్ష్యాలను ఛేదించగల యూరప్ తయారీ 'మిటియార్' క్షిపణులను భారీ సంఖ్యలో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ అత్యాధునిక అస్త్రాల చేరికతో భారత వాయుసేన బలం గణనీయంగా పెరగనుంది. మిటియార్ క్షిపణి రామ్‌జెట్ ప్రొపల్షన్ సిస్టమ్‌తో పనిచేస్తుంది. దీనివల్ల ఇది అత్యధిక వేగంతో ప్రయాణించడమే కాకుండా 200 కిలోమీటర్లకు పైగా దూరంలోని శత్రు విమానాలను కూడా కచ్చితత్వంతో కూల్చివేయగలదు. "తొలి షాట్‌లోనే లక్ష్యాన్ని ఛేదించగలిగే సామర్థ్యం దీని సొంతం. ఇప్పటికే ఐఏఎఫ్ అమ్ములపొదిలో ఉన్న 36 రఫేల్ యుద్ధ విమానాలకు ఈ క్షిపణులను అనుసంధానించారు. త్వరలో నౌకాదళం కోసం కొనుగోలు చేస్తున్న 26 రఫేల్ మెరైన్ ఫైటర్ జెట్‌లకు కూడా వీటిని అమర్చనున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత విమానాలు పాకిస్థాన్‌లోని సైనిక, ఉగ్రవాద స్థావరాలపై సుదూర ఆయుధాలతో దాడులు చేశాయి. దీనికి ప్రతిగా పాకిస్థాన్ వాయుసేన, చైనా నుంచి సేకరించిన పీఎల్15 క్షిపణులను భారత విమానాలపై ప్రయోగించినప్పటికీ, అవి లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలోనే వాయుసేన తన సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటోంది. విదేశీ ఆయుధాల కొనుగోలుకు సమాంతరంగా, రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ఆధ్వర్యంలో స్వదేశీ క్షిపణుల తయారీ కార్యక్రమాన్ని కూడా భారత్ వేగవంతం చేసింది. 200 కి.మీ. పైగా రేంజ్ ఉన్న అస్త్ర మార్క్2ఖ క్షిపణిని అభివృద్ధి చేస్తోంది. రాబోయే సంవత్సరాల్లో సుమారు 700 అస్త్ర క్షిపణులను కొనుగోలు చేయాలని వాయుసేన యోచిస్తోంది. వీటిని సుఖోయ్ ఎస్‌యూ30ఎంకెఐ, హెచ్‌ఏఎల్ తేజస్ వంటి ఫైటర్ జెట్‌లకు అనుసంధానిస్తారు. ఇదేకాకుండా, రఫేల్ యుద్ధ విమానాలకు స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన రుద్రం సిరీస్ యాంటీరేడియేషన్ క్షిపణులను కూడా అమర్చనున్నారు. ఈ క్షిపణులు శత్రు రాడార్ వ్యవస్థలను నాశనం చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. మొత్తం మీద, ఒకవైపు అత్యాధునిక విదేశీ ఆయుధాలను సమకూర్చుకుంటూనే, మరోవైపు రక్షణ రంగంలో స్వావలంబన సాధించేందుకు భారత్ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది.

# శ్రీసత్యసాయి సంజీవని ఆస్పత్రిని సందర్శించిన ప్రధాని మోడీ

## చికిత్స పొందిన చిన్నారులకు ప్రత్యేక ధ్రువపత్రాలు అందజేత



**రాయ్‌పూర్, నవంబరు 1:** ఛత్తీస్‌గఢ్‌లో రాయ్‌పూర్‌లోని శ్రీ సత్యసాయి సంజీవని ఆస్పత్రిని ప్రధాని నరేంద్ర మోడీ సందర్శించారు. గుండె సంబంధిత శస్త్రచికిత్సలు చేయించుకున్న చిన్నారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆస్పత్రికి చేరుకున్న మోడీకి 'వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ మిషన్' వ్యవస్థాపకుడు మధుసూదన్ సాయి స్వాగతం పలికారు. సత్యసాయి సంజీవని ఆస్పత్రుల చైర్మన్ శ్రీనివాసన్ ప్రధానికి చిత్రపటాన్ని అందజేశారు. సత్యసాయి బాబా విగ్రహానికి పూజలు నిర్వహించిన తర్వాత ఆ ఆస్పత్రిలో చికిత్స పొందిన చిన్నారులకు ప్రత్యేక ధ్రువపత్రాలు అందజేశారు. చిన్నారుల ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ క్రికెటర్, సత్యసాయి సంజీవని ఆస్పత్రి ట్రస్టీల్లో ఒకరైన సునీల్ గవాస్కర్ కూడా పాల్గొన్నారు. వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ మిషన్‌లో భాగంగానే 'శ్రీ సత్యసాయి సంజీవని' ఆస్పత్రులను నిర్వహిస్తున్నారు. ఈ మిషన్ వైద్యం, విద్య, పోషకాహార రంగాల్లో వం దకుపైగా దేశాల్లో సేవలందిస్తోంది. భారత్‌లోని 25 రాష్ట్రాల్లో 4 కేంద్ర పాలిత ప్రాంతాల్లో రోజూ కోటి మంది ప్రభుత్వ పాఠశాలల చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తోంది. అంతేకాకుండా దేశంలోని మొట్టమొదటి ఉచిత ప్రైవేట్ వైద్య కళాశాలను కూడా నిర్వహిస్తోంది. ఈ మెడికల్ కాలేజీని ప్రధాని నరేంద్ర మోడీ 2023లో ప్రారంభించారు. ఉచిత వైద్య కళాశాలతోపాటు శ్రీ సత్య సాయి యూనివర్సిటీ ఫర్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్ పేరిట ఓ విశ్వవిద్యాలయం కూడా ఉంది. అంతేకాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో 6వ తరగతి నుంచి పిహెచ్‌డి వరకు విద్యార్థులకు పూర్తిగా ఉచితంగా విద్యను అందిస్తున్నారు. దేశంలోని చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడమే లక్ష్యంగా అన్నపూర్ణ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తున్నారు.

# ఇన్నాళ్లు ప్రజల కోసం పనిచేశా, నా కుటుంబం కోసం కాదు

## బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్



**పాట్నా, నవంబరు 1:** బీహార్‌లో ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరో అయిదు రోజుల్లో తొలి దశ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ప్రజలను ఉద్దేశిస్తూ ఓ వీడియో విడుదల చేశారు. గత రెండు దశాబ్దాలుగా తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ ఇన్నాళ్లు తాను ప్రజల కోసమే పనిచేశానని వ్యాఖ్యానించారు. గతంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు చాలా దారుణంగా ఉండేవన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మొదట వాటిని మెరుగుపరిచినట్లు తెలిపారు. దీంతోపాటు యువతకు విద్య, ఆరోగ్యం, రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా, వ్యవసాయం, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెంచామన్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్, ఆర్జేడీలపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ కూటమి అధికారంలో ఉన్నప్పుడు మహిళలకు ఏమీ చేయలేదన్నారు. తమ ప్రభుత్వంలో మహిళలకు సాధికారత కల్పించి, స్వతంత్రులను చేశామన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసమే పనిచేశాం తప్ప, తమ కుటుంబాల కోసం కాదని నితీశ్‌కుమార్ అన్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బీహార్ అభివృద్ధికి పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఎన్డీయే మాత్రమే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల దన్నారు. కేంద్రం, రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి ఉండటంవల్లే దేశం వేగంగా అభివృద్ధి చెందు తుందన్నారు. ఈ సందర్భంగా తమకు మరో అవకాశం ఇవ్వాలని ప్రజలను అభ్యర్థించారు. బీహార్ అభివృద్ధి ఎన్డీయే అధికారంలో ఉంటేనే అవుతుందని నొక్కి చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఈ నెల 6,11 తేదీల్లో ఇక్కడ ఎన్నికలు జరగనున్నాయి. 14న ఫలితాలు వెలువడనున్నాయి.

# ఎన్నికల్లో గెలుపు కోసం ఎన్డీయే విభజన రాజకీయాలు

## కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ, నవంబరు 1:** ఎన్నికల్లో గెలిచేందుకు ఎన్డీయే సర్కార్ విభజన రాజకీయాలకు పాల్పడుతోందని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ ఆరోపించారు. నకిలీ జాతీయవాదాన్ని ప్రచారం చేస్తోందని విమర్శించారు. సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించలేకపోవడంతోనే ఓట్ల చోరీకి పాల్పడుతోందని బిజెపిపై మండిపడ్డారు. ఓట్ల తొలగింపు అనేది హక్కుల ఉల్లంఘనతో సమానమని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బెగుసరాయ్‌లో తన తొలి ప్రచార సభలో ఈ మేరకు ప్రసంగించారు. దేశాభివృద్ధికి బీహార్ ఎంతో దోహదపడింది. కానీ, రాష్ట్రాభివృద్ధి విషయంలో మాత్రం వెనుకబడిపోయింది. నెహ్రూ, ఇందిరాగాంధీలను బిజెపి నేతలు విమర్శిస్తున్నారు. నిరుద్యోగం, వలసల వంటి అసలైన సమస్యలను పట్టించుకోవడం లేదు. విభజన రాజకీయాలు చేస్తున్నారు. అయినప్పటికీ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించలేకపోయారు. అందుకే ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. ఎన్డీయే వాగ్దానాలు చూసి మోసపోవద్దని ఓటర్లకు సూచించారు. బీహార్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ లేదని, ప్రతిదీ ఢిల్లీ నుంచి నియంత్రిస్తారని ప్రియాంక పేర్కొన్నారు. ఎన్డీయే పాలనలో ప్రైవేటీకరణ పెద్ద ఎత్తున జరుగుతోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని మోడీ కొందరికి అప్పగించారని ఆరోపించారు. అంతకుముందు పాట్నా విమానాశ్రయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బిజెపి కోటి ఉద్యోగాల హామీపై స్పందిస్తూ ఇన్నేళ్ల పాలనలో ఏం చేసిందని ప్రశ్నించారు.

# 150 కంటే ఎక్కువ, లేదంటే 10 కంటే తక్కువ

## ప్రశాంత్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు



**పాట్నా, నవంబరు 1:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీకి 150 కంటే ఎక్కువ సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తాము ఏ పార్టీతో పొత్తు పెట్టుకోబోమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలవొచ్చని అంచనా వేస్తున్నారని ప్రశాంత్ కిశోర్‌కు ప్రశ్న ఎదురైంది. ఇక్కడ నేను రెండు అవకాశాలు ఉండవచ్చని అనుకుంటున్నాను. ప్రజలు జన్‌సురాజ్‌ను ఒక ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. అయితే దీర్ఘకాలంగా నిరాశావాదాన్ని చూసిన ఓటర్లు ముందడుగు వేయడానికి విశ్వాసం అవసరం అని అన్నారు. నేను ఎన్నికల్లో పోటీ చేస్తానని ఎన్నడూ ధ్రువీకరించలేదు. ఒకవేళ నేను పోటీ చేస్తే కర్గహార్ నుంచి బరిలో ఉంటానని చెప్పాను. నేనేమీ ఎక్స్ ఫ్యాక్టర్ కాదు. ఎన్నికల ఫలితాలు నవంబర్ 14న వెల్లడి కానున్నాయి. ఎన్నికల్లో విజయం గురించి ఆలోచించేటప్పుడు జన్‌సురాజ్ గెలిచిన సీట్లను చూస్తారా? లేక నేను పోటీ చేశానా లేదా అనే దానిని చూస్తారా? బీహార్‌లో మహాగట్‌బంధన్ లేక ఎన్డీయేకు ప్రత్యామ్నాయం లేదనే అభిప్రాయంఉంది. అభిప్రాయం వేరు, వాస్తవం వేరు. బీహార్‌లో మూడింట ఒక వంతు మంది ఈ రెండు కూటములకు ఓటు వేయాలని అనుకోవడం లేదు. 160,170 సీట్లలో జన్‌సురాజ్ గట్టి పోటీ ఇస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు అని తాను పోటీ చేయకపోవడం గురించి సమాధానమిచ్చారు. అలాగే పొత్తుల గురించి మాట్లాడుతూ ఈ ఎన్నికల ఫలితాల తర్వాత జన్‌సురాజ్ కింగ్ మేకర్‌గా ఎదిగినా వారితో పొత్తు, వీరితో పొత్తు అంటూ రాజకీయాలు చేయబోం. ప్రజలు మాకు అనుకూలంగా తీర్పు ఇవ్వకపోతే మా పని మేం కొనసాగిస్తాం. ఇది నేను మీకు రాసి స్తాను. ఎన్నికల ముందు తర్వాత మేము ఎలాంటి పొత్తులు పెట్టుకోం. ఒకవేళ హంగ్ ఏర్పడి మేం లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితి వస్తే నేతలు పార్టీలు మారతారు. అది నాకు తెలుసు. వారిని నేను ఆపలేను. డబ్బు, కేసుల భయం అందుకు కారణం కావచ్చు అని విమర్శించారు. రాష్ట్రంలో ఈనెల 6,11 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబరు 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# సంక్షిప్తంగా..

## మాతృభాష ప్రోత్సాహానికి చట్టం తేవాలి: సిద్ద రామయ్య



**బెంగళూరు, నవంబరు 1:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి, పలు దక్షిణాది రాష్ట్రాలకు మధ్య హిందీభాష విషయంలో మాటల యుద్ధం నడుస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీష్, హిందీభాషలు దక్షిణాది రాష్ట్రాల్లో పిల్లల నైపుణ్యాలను బలహీనపరుస్తున్నాయన్నారు. విద్యా సంస్థల్లో మాతృభాషను ప్రోత్సహించేలా కేంద్రం చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కర్ణాటకపై సవతి తల్లి వైఖరిని ప్రదర్శిస్తూ హిందీని తమపై బలవంతంగా రుద్దుతోందన్నారు. కర్ణాటక రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి చెందిన దేశాల పిల్లలు తమ మాతృభాషలోనే నేర్చుకుంటారని, కానీ మన దేశంలో పరిస్థితి దానికి విరుద్ధంగా ఉందని సిద్ధరామయ్య అసహనం వ్యక్తం చేశారు. ఇంగ్లీష్, హిందీ మన పిల్లల ప్రతిభను బలహీన పరుస్తున్నాయన్నారు. ఈ సమస్యను నివారించాలంటే మాతృభాషను బోధనా మాధ్యమంగా ప్రవేశపెడుతూ చట్టాలను తీసుకురావాలన్నారు.

## కెనడాలో భారతీయుడికి 25 యేళ్ల జైలు

**ఒట్టావా, నవంబరు 1:** ఓ హత్య కేసులో భారత సంతతి వ్యక్తికి కెనడా న్యాయస్థానం 25యేళ్ల జైలు శిక్ష విధించింది. మూడేళ్ల క్రితం బాల్‌రాజ్ బస్రా (25)పై నమోదైన ఆరోపణలు రుజువు కావడంతో బ్రిటిష్ కొలంబియా సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించింది. 2022 అక్టోబరు 17న యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియాకు చెందిన గోల్ఫ్‌క్లబ్ ప్రాంతంలో చోటుచేసుకున్న విశాల్ వాలియా (35) హత్య ఘటనలో శిక్షపడిన వారిలో బాల్‌రాజ్ మూడో వ్యక్తి. ఈ కేసులో ఇక్బాల్‌కాంగ్ (24), డియాంద్రె బాప్టిస్ట్ (21)అనే వారికి 17యేళ్ల చొప్పున జైలు శిక్షలుపడ్డాయి. ఈ ముగ్గురూ కలిసి వాలియాను కాల్చిచంపి, వాహనంలో అతడిని అగ్నికి ఆహుతిచేశారు. మరో వాహనంలో పరారైన అనుమానితులను వెంటనేగుర్తించి, వెంటాడి పోలీసులు కొన్ని నిమిషాల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు.

## టాంజానియా ఎన్నికల్లో హింస: 700 మంది మృతి



**డోడోమా, నవంబరు 1:** ఆఫ్రికన్ దేశం టాంజానియాలో బుధవారం జరిగిన సాధారణ ఎన్నికలు తీవ్ర రక్తపాతానికి దారితీశాయి. అణచివేత, ఎన్నికల మోసంపై దేశవ్యాప్తంగా పౌరుల్లో ఆగ్రహం పెల్లు బికింది. ఎన్నికల ఫలితాలను ఆపాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తూ పౌరులు దేశమంతా నిరస నలతో హోరెత్తించారు. దీంతో ప్రభుత్వం పౌరులపై అణచివేతకు దిగింది. పెద్దఎత్తున మిలిటరీని దించింది. పలుచోట్ల నిరసనకారులై కాల్పులు జరిగాయి. బాష్పవాయువును ప్రయోగించారు. ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. ఇప్పటివరకు 10మంది మరణించారని ఐరాస పేర్కొనగా, 700 మందికిపైగా మరణించారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

## దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రం కేరళ



**తిరువనంతపురం, నవంబరు 1:** దారిద్ర్య రహిత రాష్ట్రంగా కేరళ అవతరించినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. దేశంలో అత్యంత దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా గుర్తింపు పొందిందన్నారు. కేరళ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సిఎం ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 21,263 మందికి మొదటిసారిగా రేషన్ కార్డులు, ఆధార్, పెన్షన్లు వంటి ముఖ్యమైన పత్రాలు మంజూరు చేసిందని తెలి పారు. 4,394కుటుంబాలకు జీవనోపాధి ప్రాజెక్టుల ద్వారా పని కల్పించామన్నారు. ప్రజలందరికీ సమానహక్కులు నివాసం, విద్య, వైద్యం అందుతున్నట్లు తెలిపారు. దీనివల్ల రాష్ట్రం అత్యంత దుర్భర పేదరికం నుంచి బయటపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## బ్రీచ్‌కాండీ ఆసుపత్రిలో చేరిన సీనియర్ నటుడు ధర్మేంద్ర



**ముంబయి, నవంబరు 1:** బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్ర ఆసుపత్రిలో చేరారన్న వార్త ఆయన అభిమానులను ఆందోళనకు గురిచేసింది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో ఆయన్ను ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం రాత్రి జర్నలిస్ట్ విక్కీ లాల్వానీ సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని వెల్లడించడంతో ధర్మేంద్ర ఆరోగ్యంపై చర్చ మొదలైంది. 'శ్వాస సంబంధిత సమస్యతో ధర్మేంద్ర ఆసుపత్రికి వచ్చారు. ఆయన ప్రస్తుతం ఐసీయూలో ఉన్నార'ని ఆసుపత్రి సిబ్బంది ఒకరు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. హృదయ స్పందన రేటు 70 కాగా, రక్తపోటు 140/80గా ఉంది. ఇతర పారామీటర్లు కూడా సాధారణంగానే ఉన్నాయని సదరు సిబ్బంది స్పష్టం చేసినట్లు తెలిసింది.

# 42 శాతం బిసి రిజర్వేషన్ కోసం పిఎం మోడీపై ఒత్తిడి పెంచుదాం

## మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బలహీన వర్గాల జనాభాకు అను గుణంగా 42శాతం బిసి రిజర్వేషన్ అమలుకు ప్రధాన మంత్రి మోడీపై ఒత్తిడి పెంచడానికి ప్రతి ఒక్కరు పార్టీలకు అతీతంగా కలిసిరావాలని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు పిలుపు నిచ్చారు. శనివారం గాంధీభవన్‌లో సీనియర్ నేత హనుమంతరావు మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ 42 శాతం రిజర్వేషన్‌పై కామారెడ్డి అనౌన్స్ చేశామని చెప్పారు. రాహుల్ గాంధీ పాదయాత్రలో బిసిలకు న్యాయం చెయాలని కాస్ట్ సెన్సెస్ జరగాలని డిమాండ్ చేశారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్ని ఉద్యమాలు చేసిన కేంద్రం లో ఎలాంటి మార్పు రావటం లేదని ఆయన అరోపించారు. నిజంగా బిసిలకు న్యాయం జరగాలి అంటే దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు, ఎంపి లని కలవాలనీ ఆయన సూచించారు. జూబ్లీ ఎన్నిక అనంతరం అన్ని రాష్ట్రాలు తిరిగి మన కులగణన గురించి చెప్పాలని హితవు చెప్పారు 9 షెడ్యూల్ లో బిల్ పాస్ అయితే నే బిసి లకి న్యాయం జరిగినట్టు అని ఆయన అన్నారు. మోదీకి సపోర్ట్ చేసే రాష్ట్రాల నాయకులు కలిసి సపోర్ట్ కోరాలని చెప్పారు.

ఇక్కడ ఎన్ని రోజులు కష్టపడ్డ పేపర్లకు మాత్రమే పరిమితం అవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడు కాకపోతే ఇంకా ఎప్పటికి బిసి రిజర్వేషన్ సాధ్యం కాదు ఢిల్లీ వెళ్లి అంద రిని కలిసి మనకి న్యాయం చెయ్యమని కోరదామని పిలుపునిచ్చారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు అరైవ్, అలైవ్ పేరిట డిసెంబర్‌లో ప్రత్యేక కార్యక్రమం

## పోలీసు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో డిజిపి భేటీ


రోడ్డు ప్రమాదాల నివారణకు కొత్తగా అమలుచేయనున్న అరైవ్, అలైవ్ కార్యక్రమంపై ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో డిజిపి శివధర్‌రెడ్డి భేటీ అయిన దృశ్యం

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ కొత్త కార్యక్రమాన్ని చేబట్టనుంది. అరైవ్, అలైవ్ పేరిట అమల్లోకి రానున్న ఈ కార్యక్రమంపై డిజిపి శివధర్‌రెడ్డి శనివారం తన కార్యాలయంలో ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగించే విధంగా వుందని, వీటిని నివారించాల్సిన అవసరం ఎంతైనా వుందని అన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు అరైవ్, అలైవ్ పేరిట అవగాహన కార్యక్ర మాన్ని వచ్చే డిసెంబర్‌లో 15 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే అంశాన్ని ప్రజా ప్రాధాన్య అంశంగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఇం దుకోసం డిసెంబర్ నెలలో 15 రోజుల పాటు అరైవ్, అలైవ్ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కలిగించే కార్యక్రమం చేబడుతున్నట్లు ఆయన తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంపొం దించడం, నియమాలు కచ్చితంగా పాటించేలా చేయడం, వాహనదారులు బాధ్యతగా వుండేలా చేయడం, డ్రైవర్లు సవ్యంగా డ్రైవింగ్ చేసేలా చూడడం ఇందులో ముఖ్యమని డిజిపి తెలిపారు. డ్రైవింగ్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను కనీసస్థాయికి తగ్గించగలుగుతామని డిజిపి తెలిపారు. ఇందుకోసం అరైవ్, అలైవ్ కార్యక్రమం చేబడుతు న్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖతో పాటు రవాణా శాఖ, కార్పొరేట్ సంస్థలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో, పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాల్సి ఉందని శివధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం విజయ వంతం అయ్యేం దుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తమ ఆలోచనలను సమీక రించి ముందుకు సాగా లని ఆయన పిలుపు నిచ్చారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలను నవంబరు తొమ్మిది లేదా పదవ తేదీన జరిగే తదుపరి సమావేశంలో చర్చించాలని డిజిపి సూచించారు. దీంతో పాటు ఆయా ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాల నివారణకు అనుసరిస్తున్న విధానాలను కూడా వివరించాలని ఆయన తె లిపారు. కాగా సమావేశంలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రోడ్డు ప్రమాదాల నివారణకు కొన్ని సూచనలు చేశారు. ఈ సమావేశంలో శా ంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, మల్టీ జోన్ 2 అదనపు డిజి డిఎస్ చౌహాన్, ఐజిపిలు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు, రమేష్, సిటీ ట్రాఫిక్ జాయింట్ సిపి జోయల్ డేవిస్ తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి దిశగా యువత ముందుకు రావాలి

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** ప్రభుత్వం అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి అవకాశాలను యువత పూర్తిగా వినియోగించుకోవాలని అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపు నిచ్చారు. శనివారం ఆదిలాబాద్‌లోని టిటిడిసి భవనంలో నిర్వహించిన ఇందిరమ్మ సెంట్రింగ్ యూనిట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. శిక్షణ పొందిన యువత నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించుకుని స్వయం ఉపాధి సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా మాట్లాడుతూ, శిక్షణ యువతలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తోందని, మహిళలు కూడా ఈ రంగంలో ముందుకు రావాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు కలెక్టర్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ డిపిఎం, ఎపిఎం, న్యాక్ ఏడి స్వప్న రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కృత్రిమ మేధతో రహదారుల అనుసంధానానికి కసరత్తు

## ప్రయోగాత్మకంగా హైదరాబాద్-విజయవాడ రహదారితో షురూ!

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులను కృత్రిమ మేధతో అనుసంధానం చేయడానికి కసరత్తు ప్రారంభించింది. ప్రమాదాలను నియంత్రిం చడంతో పాటు భద్రతా ప్రమాణాలు పాటించేం దుకు కృత్రిమ మేధను ఉపయోగించుకొనే దిశలో రహదారుల నిర్మాణంలో అంతర్భాగం చేయాలని నిర్ణయించారు. ప్రయోగాత్మకంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి 65ని అత్యంత అధునాత సిసి కెమెరాలతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనుసంధానం చేస్తూ స్మార్ట్ రోడ్‌గా నిర్మించనున్నారు. రహదారిపై అమర్చే అత్యంత ఆధునిక కెమెరాలు అన్ని కోణాలలో రికార్డు చేస్తుంది. ప్రతి కిలోమీటరుకు ఒకటిచొప్పున సుమారు 235 కెమెరాలు 360 డిగ్రీలలో రోడ్డుపై నిఘావేసి వుంచుతాయి. కృత్రిమమేధా మూడోకన్ను రాత్రి పగలు, ఎండావానా లేకుండా అత్యంత భద్రతను దీనిపై ప్రయాణించే వాహనాలకు ఇస్తుందని జాతీయరహదారుల ప్రాధికార సంస్థ అధికారులు అభిప్రాయ పడుతున్నారు. జాతీయ రహదారి 65ను నాలుగు వరసల నుంచి ఆరు వరసలుగా రూ.10391.53 కోట్లతో విస్తరించడానికి అంచనా వేశారు. రోడ్డు నిర్మాణం కోసం రూ.67775.47కోట్లు ఇతర మౌలిక అత్యాధునిక మౌళిక సాంకేతిక వసతుల కోసం రూ.3,616.06 ఖర్చుచేయడానికి లెక్కగట్టారు. ప్రస్తుతం విస్తరించే దారి తెలంగాణలో ఈ రహదారి మల్కాపురం ఆందోల్ మైసమ్మ దేవాలం నుంచి విజయవాడ కనుకదుర్గ దేవాలయం వరకు 231.32 కి.మి నిడివితో నాలుగు వరసలుగా ఉంది. దీనిని ఆరు వరసలతో డిజిటల్, స్మార్ట్ రోడ్‌గా ఎఐతో తయారించనున్నారు. రోడ్డు పక్కలో పటిష్టమైన కంచె, వర్షంనీరు ఒడిసి పట్టేం దుకు ఏర్పాట్లు రోడ్డు మధ్యలో ఎదురుగా వచ్చే వాహనాల ఫోకస్ అడ్డుకోవడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, సాంప్రదాయేతర ఇంధనం ప్రోత్స హించడానికి సోలార్ విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు.

# కంటోన్మెంట్ అభివృద్ధి చూపిస్తే రాజీనామా చేస్తా

## మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సవాల్

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శలు హైదరాబాద్‌కు రెండేళ్లలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ కంటోన్మెంట్లో అభివృద్ధి చూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ మాజీ మంత్రి, సనత్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ ప్రభు త్వంపై, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిం చారు. కంటోన్మెంట్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సంచలన సవాల్ విసిరారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలోనే హైదరా బాద్ అద్భుతంగా అభివృద్ధి చెందిందని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా, హైదరాబాద్‌కు రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. 'జూబ్లీహిల్స్‌లో ఓటమి భయం పట్టుకోవడం వల్లే అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టారు' అని తలసాని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే రేషన్ కార్డులు, బియ్యం ఆగిపోతా యంటూ ఆ పార్టీ నేతలు ప్రజలను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలతో సంక్షేమ పథకాలు ఎలా అమలు చేయించాలో బీఆర్ఎస్‌కు బాగా తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీయే అని తలసాని ధీమా వ్యక్తం చేశారు. అత్యంత భారీ మెజార్టీతో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అసెంబ్లీలో అడుగుపెడతారని ఆయన జోస్యం చెప్పారు.

# జనవరి 5 నుంచి 7 వరకు ప్రజానాట్య మండలి రాష్ట్ర 3వ మహాసభలు

## జానపద ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన సినీనటుడు మాదాల రవి

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజానాట్య మండలి 3వ రాష్ట్ర మహాసభలను వచ్చే ఏడాది 5 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో నిర్వహించ నున్నారు. ఇందుకు సంబంధించిన ప్రజానాట్యమండలి నిర్వహించనున్న జానపద ఉత్స వాల పోస్టర్‌ను శనివారం హైదరాబాద్‌లో మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు సినీ హీరో డాక్టర్ మాదాల రవి, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ సంయుక్త కార్యదర్శి తిరుపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాదాల రవి మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జనవరి 5 నుంచి 7వ తేదీ వరకు ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని, మహాసభల్లో జానపద ఉత్స వాలు జరుగుతాయన్నారు. కళ కళ కోసం కాదని, కళ ప్రజల కోసమని, కళ ప్రగతి కోసమనే నినాదంతో పనిచేస్తుందన్నారు. కళాకారులందరూ కూడా ప్రజల కోసం పనిచేసే కళాకారులు ప్రజానాట్యమండలిలో పనిచేస్తారని, నిరంతరం ప్రజల కష్టాలను తెలియజేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అలాంటి ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలు హైదరాబాద్ నగరంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభలకు కవులు, కళాకారులు మేధావులు అందరు కూడా సహాయ సహకారాలు అందించి మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య ఆహ్వాన సంఘం గౌరవ సలహాదారులు రాజన్న, పి మల్లేష్ ఆర్ వెంకటేష్.. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి మారన్న, కోశాధికారి పి కళ్యాణ్. మల్లం రమేష్ సినీ దర్శ కులు టి సురేషు, ఏఆర్ ప్రసాదు, శ్రీనివాసు, సతీష్ ప్రజానాట్య మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కే భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లెల రాము. హైదరాబాద్ సిటీ ఉపాధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ పాల్గొన్నారు


అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య. బిసి, కుల, ప్రజా సంఘాల నాయకులు

# 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసేదాకా పోరాటం

## బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ 24 గంటల దీక్ష

## అనుమతి లేదని అడ్డుకున్న పోలీసులు


దీక్షలో అభివాదం చేస్తున్న బిసి నేతలు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), నవంబరు 1, ప్రభాతవార్త:** బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేసే వరకు పార్టీలకు అతీతంగా పోరాడుదామని బీసీ నేతలు పిలుపునిచ్చారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎర్ర సత్యనారాయణ 24 గంటల దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీమంత్రి రాజేశంగౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్, గుజ్జకృష్ణ, సినీ నిర్మాత జైహింద్‌గౌడ్ తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ బీసీల పరిస్థితి ఇప్పటికీ చాలా అధ్వానంగా ఉందని, వారికి విద్య, ఉద్యోగమే కాకుండా రాజకీయ రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాల్సి న అవసరం ఉందని స్పష్టం చేశారు. త్వరలో జాతీయ స్థాయిలో జనగణన జరగబోతోందని, అప్పుడు ఆ సర్వేలో అసలు బీసీలు ఎంతమంది ఉన్నారు అనేది కులాల వారీగా తెలుస్తుందని అన్నారు. రిజర్వేషన్లు కేవలం అసెంబ్లీలో బిల్లు పెడితే సరిపోదని, పార్లమెంట్‌పై వత్తిడి తీసుకువచ్చి, రిజర్వేషన్లు అమలుచేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మధుసూదనాచారి మాటా ్లడుతూ మనకు స్వాతంత్ర్యం వచ్చాక అధికార మార్పిడి జరిగింది తప్ప బీసీలకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో చట్టసభలకు ప్రాతినిధ్యం కల్పించబడని అగ్రకులం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. మెజా రిటీగా ఉన్న బీసీ కులాలకు పార్లమెంటు, శాసనసభల గేట్లు దాటే అవకాశం కల్పించబడ లేదని, అంటే బీసీలు ఇప్పటికీ రెండో శ్రేణి పౌరులుగానే చూడబడు తున్నారని ఆరోపిం చారు. ఈ దీక్షద్వారా దేశంలోని బీసీలం దరిలో కదలిక వస్తుం దని ఆశాభావం వ్యక్తం చేశారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్ల సాధనకై చేపట్టిన దీక్షకు బీసీ సంక్షేమసంఘం, బీసీ జేఏసీ పక్షాన సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నా మన్నారు. బీసీలకు రిజర్వేషన్లు అమలుకాకుండా కోర్టులను అడ్డు పెట్టుకుని అగ్రకులాలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

### దీక్షను భగ్నం చేయటం అన్యాయం

42శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకై శాంతియుతంగా చేపట్టిన 24గంటల దీక్షను పోలీసులు అడ్డుకోవటం అన్యాయమని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. నాలుగురోజులుగా దీక్షకు అనుమతి ఇవ్వకుండా తాత్సారం చేసిన పోలీసులు, నిన్న సాయంత్రం 24 గంటలు ఇవ్వటం కుదరదని, కేవలం సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఇచ్చారని, కోర్టుకు వెళ్లి అనుమతి తెచ్చుకునే అవకాశం కూడా లేకుండా చేశారని ఆరోపించారు. 24 గంటల దీక్షకు అనుమతి నిరాకరించి, ఒక్క రోజుకే ఇస్తామంటూ, 4 గంటలకే దీక్షను భగ్నం చేశారని మండిపడ్డారు.

# రైతుల పట్ల సర్కారు నిర్లక్ష్యం

## ఎంపి గోడం నగేష్

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బిజెపి ఎంపి నగేష్ మండ పడ్డారు. 10 యేళ్ల బిఆర్ఎస్ పాలనలో, కాంగ్రెస్ 23 నెలల పాలనలో వర్షాలు, వరదలతో తెలంగాణ రైతాంగం దారుణంగా నష్టపోతు న్నారని అన్నారు. పంట నష్ట పరిహారం ఇవ్వకుండా అరిగోస పెడుతున్నారంటూ మండి పడ్డారు. విపత్తు సమయాల్లో ప్రజలను ఆదుకునేందుకు నరేంద్రమోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డిఆర్ఎఫ్ పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసినా వాటిని వాడుకోలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ.1911 కోట్ల 61 లక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని వాడుకోవడం కూడా కాంగ్రెస్ నేతలకు చేతకావడం లేదు. పదేపదే కేంద్రం సాయం చేయడం లేదంటూ ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని బదనాం చేయడమే పనిగా పెట్టుకోవడం సిగ్గుచేటు అన్నారు. అన్నీ కేంద్రమే ఇవ్వాలంటే ఇగ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి ఎందుకు దండుగా అన్నారు. పాలన చేతగాకుంటే తప్పుకోవాలన్నారు. అంతేగానీ కాంగ్రెస్ చేతగానితనాన్ని బిజెపిపై నెట్టి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రాజకీయ లబ్ది పొందాలనుకోవడం మూర్ఖత్వం అన్నారు. పంట కోల్పోయి కొందరు, ఇండ్లు కోల్పోయి మరికొందరు, సర్వం కోల్పోయి ఎంతో మంది అల్లాడుతుంటే వారికి భరోసా కూడా ఇవ్వలేని చేతగాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరవాలని, వర్షాలతో నష్టపోయిన రైతులను, ప్రజలకు అండగా నిలవాలన్నారు. అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇవ్వాలన్నారు. తక్షణ సాయంగా ఎకరాకు రూ.30 వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో నష్టపోయిన రైతాంగానికి పరిహారం అందించాల్సి ఉందే. లేనిపక్షంలో జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

# 42 శాతం రిజర్వేషన్‌లు సాధించేదాకా భారీగా పోరాటాలు

## బిసి జెఎసి ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 1, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బిసి రిజర్వే షన్‌లు 42 శాతం సాధించేంత వరకు భారీగా పోరాటాలు కొనసాగిస్తామని రాజ్యసభ సభ్యుడు, బిసి జెఎసి ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఇందుకోసం అన్ని పార్టీలు చిత్తశుద్ధితో సహకరించాలని, యావత్ బిసి లోకం కూడా పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బిసి జెఎసి ఆధ్వర్యంలో జెఎసిని బలోపేతం చేయడానికి శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 70 బిసి, 42 కుల, ప్రజాసంఘాల అధ్యక్షులను జాక్‌లో కన్వీనర్లగా నియమించిన సందర్భంగా ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగిస్తూ పార్టీపరంగా ఎట్టి పరిస్థితుల్లో రిజర్వేషన్‌లు అంగీకరించబోమన్నారు. 76 యేళ్లుగా పార్టీలు, ప్రభుత్వాలు బిసిలను నిర్లక్ష్యం చేశాయని, బిసిలకు ధర్మబద్ధమైన, న్యాయబద్ధమైన వాటా ఇప్పటికైనా ఇవ్వాలని ఆర్.కృష్ణయ్య పిలుపు నిచ్చారు.

# ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించాలి

## మాల సంఘాల జెఎసి ఛైర్మన్ మందాల భాస్కర్

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు తర్వాత ఎస్సీలలోని 58 కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తక్షణమే ఈ చట్టాన్ని సవరించాలని మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ మందాల భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ మాల సామాజిక వర్గానికి జరుగుతున్న నష్టంపై మాల సంఘాల జేఏసీ నాయకులు జూబ్లీహిల్స్ బై ఎలక్షన్‌లో 50 మంది నామినేషన్ వేయడం వల్లే ప్రభు త్వంపై ఒత్తిడి పెరిగిం దని ఇటీవల జరిగిన మాల ఉద్యోగుల మీ టింగ్, అలాగే బీఎంఐ ఆఫీస్ ఓపెనింగ్ సందర్భంగా మంత్రి వివేక్ కూడా ఎస్సీ వర్గీకర ణలో మాలలకు అన్యా యం జరిగిందని, కలిసి కట్టుగా పోరాడి హక్కులను సాధించాలని వ్యాఖ్యా నించిన విషయాన్ని జేఏసీ నాయకులు గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టాని సవరించాలని లేకుంటే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడిస్తామన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మందాల భాస్కర్, చెరుకు రాంచందర్, బేర బాలకిషన్ తదితరులు

# భస్మాసుర హస్తమైన కాంగ్రెస్ పాలన

## అసత్య మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారు: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

## కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాల, అసమర్థ, మోసాల పాలనపై బిజెపి చార్జ్‌షీట్



**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 23 నెలల కాంగ్రెస్ పార్టీ పాలన తెలంగాణ ప్రజలకు ఒక భస్మాసుర హస్తంగా మారిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాంచందర్‌రావు అన్నారు. శనివారం కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాల, అసమర్థ, మోసాల పాలనపై బిజెపి చార్జ్‌షీట్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఎన్ని అమలు చేశారు? ఏ మొహంతో ఈరోజు ప్రజల దగ్గరికి వెళ్తున్నారు? మోసపూరితమైన మాటలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి 23 నెలలు పూర్తయ్యాయని అన్నారు. కానీ ఇప్పటికీ ఏ వర్గానికీ మీరు న్యాయం చేయలేదని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ పార్టీని బహిరంగంగా ప్రశ్నిస్తుంద న్నారు. విద్యార్థులు ఫీ రీయింబర్స్‌మెంట్ కోసం బాధపడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో వారి చదువులు ఆగిపోతున్నాయన్నారు. పేషెంట్లకు హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలు సక్రమంగా అందడంలేదని, కోట్లాది రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫలితంగా ప్రజల ఆరోగ్య పరిస్థితి దెబ్బతింటుందన్నారు. రైతులకు "రుణమాఫీ" చేస్తామని చెప్పి, చివరికి ప్రజలే మిమ్మల్ని మాఫీ చేయాలా అని ఆలోచించే పరిస్థితి తీసుకొచ్చారు. తెలంగాణ ప్రజలందరు కూడా ప్రజల తరఫున కాంగ్రెస్ పార్టీని అడగండి ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో ఒక్కటైనా నెరవేర్చారా? అంటూ ప్రశ్నించారు. నిన్న మొన్న విద్యార్థులు స్కూటీల కోసం నిరసన ప్రదర్శన చేసిన ఘటన కూడా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనం అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల దారిలోనే నడుస్తుందన్నారు. ప్రజల ఆస్తులు, అభివృద్ధి, శాంతి భద్రతలకు మించి, అధికారాన్ని కాపాడుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమైపోయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ గౌరవం, జవాన్ల త్యాగాలు, జాతీయ భద్రత వంటి అంశాలపై అసభ్య వ్యాఖ్యలు చేయడం బాధాకరం, బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం. ఇటువంటి వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను, గర్వాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. పహల్గాం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అండగా నిలిచేలా, వారిని ఆదుకునేలా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఈ దుర్ఘటన పట్ల ప్రతి భారతీయుడు బాధపడతాడు కానీ ఇలాంటి విషాదాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం ఎవరికీ హక్కు లేదు. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దేశాన్ని, సైనికుల త్యాగాన్ని, పహల్గాం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన అమరుల జ్ఞాపకాన్ని అవమానపరిచేలా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ నేతలు తమ వ్యాఖ్యలపై సమాధానం చెప్పి తప్పు జరిగిందని ప్రజల ముందు క్షమాపణ చెప్పాలి. లేకుంటే సహించేది లేదన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విడుదల చేసిన చార్జ్‌షీట్ ద్వారా ప్రజల ముందు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను స్పష్టంగా ఉంచుతున్నామని, వారికి నిజాలు తెలియజేయడం బాధ్యతగా భావిస్తున్నా మన్నారు. ప్రభుత్వం తమ పనితీరు గురించి ప్రజల ఎదుట సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిజెఎల్‌పి నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మెదక్ ఎంపి రఘునందన్ రావు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు, బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు లక్ష్మీ ్మబసవనర సయ్య, పార్టీ సీనియర్ నాయకులు ప్రకాశ్‌రెడ్డి, సంగప్ప, దిలీప్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.



# గ్యారెంటీలు ఇవ్వకుంటే గల్లాపట్టి నిలదీస్తాం

## బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

### గులాబీ మయమైన రహమత్‌నగర్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 1, ప్రభాతవార్త:** గ్యారంటీలు అమలు చేయకుంటే గల్లా పట్టి నిలదీస్తామని టిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన రహమత్ నగర్ కూడలిలో అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి మాట్లాడారు. భర్తను కోల్పోయి దుఃఖంలో ఉన్న ఆడబిడ్డ కన్నీటిని రాజకీయం చేసిన దుర్మార్గులు కాంగ్రెసోళ్లు అని అన్నారు. ఒక్క ఆడబిడ్డను ఓడగొట్టడానికి ముఖ్యమంత్రి, 14 మంది మంత్రులు గల్లీగల్లీ తిరుగుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని జిమ్మిక్కులు చేసినా జూబ్లీహిల్స్ ప్రజలు ఆతన్ని నమ్మరన్నారు. బీఆర్ఎస్ గెలుపును ఎవ్వరూ ఆపలేరని, జూబ్లీహిల్స్ ప్రజలు ఎన్నికల్లో అదే తీర్పు ఇవ్వబోతున్నారన్నారు. నాడు బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పథంలో నడిస్తే నేడు రేవంత్ బుల్డోజర్లతో విధ్వంస పర్వం సృష్టిస్తున్నారని అన్నారు. ఆనాడు కేసీఆర్ హయాంలో అన్ని రంగాలలో అభివృద్ధి పరుగులు పెడితే., నేడు హామీలను అమలు చేయలేక పేదల ఇండ్లను కూలుస్తూ, విధ్వంసాలకు పాల్పడుతూ సంపాదనే లక్ష్యంగా దందాలు, బెదిరింపులు, వసూళ్లకు కేరాఫ్‌గా, దండుపాళ్యం ముఠాగా కాంగ్రెస్ మారిందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ పబ్‌లో ఈగల్ దాడులు

## డ్రగ్స్ సేవించి పట్టుబడిన ముగ్గురు

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో గల పబ్‌లలో డ్రగ్స్ కట్టడికి పోలీసులు, అబ్కారీ అధికారులు చేస్తున్న యత్నాలు ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదు. పబ్‌లపై డ్రగ్స్ నిర్మూలన కోసం కొత్తగా ఏర్పాటైన ఈగల్ (పూర్వపు టి.నాబ్) పోలీసులు శుక్రవారం అర్ధ రాత్రి దాటిన తరువాత మెరుపు దాడులు చేశారు. జూబ్లీహిల్స్‌లోని మూన్ షైన్ పబ్‌లో కొందరు యువకులు డ్రగ్స్ సేవిస్తున్నట్లు అందిన పక్కా సమాచారంపై ఈగల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ సేవించిన దినేష్ కుమార్ (46) భహదూర్ రోహిత్ సింగ్ (31) బండా రేవంత్ రెడ్డి (25) అనే ముగ్గురు పోలీసులకు దొరికిపోయారు. ఈ ముగ్గురు హైదరాబాద్‌కు చెందిన వారుగా తేలింది. వీరిని పరీక్షించగా పాజిటివ్‌గా రావడంతో ముగ్గురిని ఫిలింనగర్ పోలీసులకు అప్పగించారు. ఈ ముగ్గురు తరచూ డ్రగ్స్ సేవిస్తున్నట్లు నిర్ధారణ అయ్యింది. ఈ ఘటనపై ఫిలింనగర్ పోలీసులు మూన్ షైన్ పబ్‌పై కేసు నమోదు చేశారు. అబ్కారీ శాఖ మరో కేసు నమోదు చేసి పబ్‌కు నోటీసులు జారీ చేసింది. కాగా బొల్లారం చెక్ పోస్టు వద్ద ఈగల్ పోలీసులు శుక్రవారం రాత్రి నిర్వహించిన దాడుల్లో ముగ్గురు వ్యక్తులు డ్రగ్స్ సేవిస్తూ దొరికిపోయారు. పట్టుబడ్డ వారిని లోతుకుం టకు చెందిన శుభం కుమార్ సింగ్ (27), రితిక్ శివ నందం కురుప్ (24)గా తేలింది. వీరి వద్ద 20 గ్రాముల ఎండిఎంఎ, రెండు గ్రాముల కొకైన్, వంద గ్రాముల ఓజి, 12 ఎల్ఎస్‌డి బ్లాట్స్, 48 వేల రూపాయల నగదు, రెండు సెల్ ఫోన్లు, ఒక కారును జప్తు చేశారు. బెంగళూరుకు చెందిన న oదు అనే స్మగ్లర్ నుంచి వీరు ఈ డ్రగ్స్ కొన్నట్లు తేలింది. వీరిని బొల్లారం పోలీసులకు అప్పగించారు. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేసిన బొల్లారం పోలీసులు ముగ్గురిని అరెస్టు చేయగా పరారీలో వున్న నందు కోసం గాలింపు చేబట్టారు.

# ఇస్రో చరిత్రలో మొదటిసారి భారీ ప్రయోగం

## 4,400కిలోల బరువుతో సమాచార ఉపగ్రహం : ఇస్రో ఛైర్మన్ నారాయణన్

**తిరుమల, నవంబరు 1, ప్రభాతవార్తప్రతినిధి:** భారత అంతరిక్ష పరిశోధనసంస్థ (ఇస్రో)మొదటిసారిగా భారీ ఉపగ్రహ ప్రయోగం చేపడుతోందని, 4,400 కిలోల బరువుతో సమాచార ఉపగ్రహం నేటి సాయంత్రం ప్రయోగిస్తామని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. అత్యంత బరువైన పేలోడ్లను అంతరిక్షంలోకి మోసుకెళ్ళే ఎల్‌విఎం 3-ఎం5రాకెట్‌ను ఇస్రోకేంద్రంలోని రెండవ ప్రయోగ వేదిక నుండి నేటి సాయంత్రం 5.26గంటలకు ప్రయోగి స్తామ న్నారు. ఈ ప్రయోగానికి ముందు కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సు లందుకునేందుకు శనివారం ఉదయం ఇస్రో ఛైర్మన్ నారాయణన్, శాస్త్రవేత్తలు ఏకె పాత్ర, యశోధ,శ్రీనివాసమూర్తితో కలసి తిరుమలకు వచ్చారు.

ఉదయం నైవేద్య విరామసమయంలో ఎల్‌విఎం-3 ఎం5 రాకెట్ నమూనాను శ్రీవారి పాదాలచెంత ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రయోగం విజయవంతం కావాలని వేడుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు వారికి దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# దేవాలయాలు, ప్రైవేటు ధార్మిక సంస్థల వద్ద కానరాని భద్రత

## కాశీబుగ్గ ఆలయం తొక్కిసలాట ఘటనతో వెలుగుచూస్తున్న డొల్లతనం

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** ఏపిలోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వద్ద ఓ ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో గల వెంకటేశ్వర స్వామి దేవాలయం లో శనివారం జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది మరణించిన ఉదంతం తెలుగు రాష్ట్రాల్లో దేవాలయాలు, ప్రైవేటు ధార్మిక సంస్థల వద్ద వున్న భద్రతలో డొల్లతనాన్ని ఎత్తి చూపింది. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో దాదాపు ఏడాది పొడవునా ఏదో ఒక ధార్మిక కార్యక్రమం జరగడం ప రిపాటిగా మారగా వీటికి వేలాది నుంచి లక్షలాది మంది భక్తులు రావడం జరుగుతోంది. వారణాసిలో ఈ ఏడాది జనవరి నెలలో ముగిసిన కుంభమే ళలో మొదట జరిగిన అగ్ని ప్రమాదం, ఆ తరువాత చోటుచేసుకున్న తొక్కిసలాట 80 మందికి పైగా భక్తుల ప్రాణాలను బలిగొనగా అంతకు ముం దు పలుచోట్ల దేవాలయాల వద్ద జరిగిన ఉత్సవాలు, ధార్మిక సంస్థల వేడుకల్లో జరిగిన తొక్కిసలాటల్లో పదుల సంఖ్యలో అమాయకులు మృత్యు వాత పడ్డారు. ఈ ఘటనలన్నీ భద్రతాపరంగా వున్న లోపాలవల్లే జరిగాయని, నిర్వాహకుల తప్పిదాలే కారణమని వీటిపై విచారించిన పోలీసులు తేల్చిచెప్పారు. తెలుగు రాష్ట్రాలలోనూ ఉత్సవాలు, వేడుకల్లో తొక్కిసలాటలు జరిగిన ఉదంతాలు అనేకం వున్నాయి. గతంలో ఎపిలో జరిగిన గోదా వరి పుష్కరాల సమయంలో 30 మంది వరకు చనిపోగా తాజాగా తిరుపతిలో ఈ ఏడది జనవరిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా టిక్కెట్ల కోసం భక్తులు వచ్చిన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించారు. ఇక్కడ కూడా భద్రతాపరమైన లోపాలు వెలుగు చూశాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో వందలాది దేవాలయాలు, ధార్మిక సంస్థలు వుండగా కొన్నింటిలో మినహా మెజారిటి చోట్ల భద్రతా పరంగా సరైన వ్యవస్థలు లేవనే చెప్పాలి. హైదరాబాద్ వరకే వస్తే పదుల సంఖ్యలో దేవాలయాలు, ధార్మిక సంస్థలు ప్రైవేటు సంస్థల ఆధీనంలో వున్నాయి. ఇక్కడ నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఇందులో 50 శాతం మంది ఇతర ప్రాంతాల నుంచి వస్తుండగ వీరిలో విదేశీయు లు కూడా వుంటారు. ఈ దేవాలయాలు, ధార్మిక సంస్థలతో పాటు ప్రైవేటు సంస్థలు శ్రావణ, కార్తీక మాసాలలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటాయి. వీటికి వచ్చే వారిలో 90 శాతం మంది మహిళలు, వృద్ధులే వుంటుంటారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున దీపాల వెలిగింపుతోపాటు హారతి ఇచ్చే కార్యక్రమాలు జరుగు తుంటాయి. ఈ కార్యక్రమాలలో కొందరు స్వామీజీలు ఆధ్యాత్మిక ప్రవచనాలను చెబుతుంటారు. ఈ సందర్భం గా భక్తులు భక్తి పారవశ్యంతో వుంటారు. సరిగ్గా ఇలాంటి సమయంలో ఏదైనా అనుకోని ఘటన జరిగితే దానికి ఎవరు బాధ్యులు నేదేది దేవుడికే తెలియాలి. అదృష్టవ శాత్తూ ఇప్పటివరకు పుష్కరాల సమయంలో మినహా ఈ తరహా కార్యక్రమాల సందర్భంగా తెలుగు రాష్ట్రాలలో ఎక్కడా దురదృష్ట ఘటనలు జరగలేదు. అయితే పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా వుండవని పోలీసులు చెబుతున్నారు. ఈ యేడాది స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ట్యాంక్‌బండ్‌లో భారతమాతకు జరిగిన మహా హారతిలో ప్రమాదం చోటుచేసుకుని ఒకరు మరణించడం తెలిసిందే. కాశీబుగ్గ తరహాలో ఒక్క హైదరాబాద్ శివార్లలోనే అనేక దేవా లయాలు ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో వున్నాయి. ఇవన్నీ వెంకటేశ్వర స్వామి దేవాలయాలు కావడం గమనార్హం. ఈ దేవాలయాల వద్ద భక్తుల కోసం ఏర్పా ట్లు వున్నా అనుకోని ఘటనలు జరిగితే ఎలా అధిగమించాలని దానిపై నిర్వాహకులు ఎంతమేరకు పరిజ్ఞానం వుందనేది అనుమానమే. కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 40వేల మందికిపైగా భక్తులు రావడంతో పరిస్థితి అదుపు తప్పడంతో నిర్వాహకులు చేతులెత్తే యడంతో తొమ్మిది మంది మరణించారు. ఇటువంటి పరిస్థితులు ఇతరచోట్ల కూడా తలెత్తే వీలుందని విశ్రాంత పోలీసు అధికారులు చెబుతున్నారు. కాశీబుగ్గ ఘటన తరువాత అన్ని దేవాలయాలు, ప్రైవేటు ధార్మిక సంస్థల వద్ద భద్రతను సమీక్షించాలని వారు కోరుతున్నారు.

# రాష్ట్రంలో 80 వేల మెగావాట్ల సోలార్ రూఫ్‌టాప్

## 40 వేల ఉచిత యూనిట్లు మంజూరు చేసిన కేంద్రం

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** తెలంగాణకు త్వరలో మరిన్ని సోలార్ రూఫ్ టాప్ యూనిట్లు రానున్నాయి. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్రానికి 40 వేల ఉచిత సోలార్ యూనిట్లను మంజూరు చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఒక్కొక్కటి 2 కిలోవాట్ల సామర్థ్యం ఉన్న ఈ రూఫ్ టాప్ యూనిట్ల ద్వారా రాష్ట్రంలో 80వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రాష్ట్రంలో సోలార్ రూఫ్ టాప్ లను తెలంగాణ స్టేట్ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టీజీరెడ్కో) అమలు చేసే ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకం కింద రాష్ట్రానికి ఈ ఉచిత సోలార్ రూఫ్ టాప్‌లను మంజూరు చేస్తున్నట్లు కేంద్ర సంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ వెల్లడించింది. తెలంగాణకు మొదటి దశలో 20 వేల యూనిట్లను ప్రస్తుతం అందచే యను న్నట్లు పేర్కొంది. మిగిలిన 20 వేల యూనిట్లను రెండో దశలో కేటాయించ నున్నట్లు కేంద్ర సీనియర్ కార్యదర్శి తెలిపారు. ఈ పథకం కింద వినియోగదారులు ఎటువంటి పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. సామూహికంగా సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసే విధానం (యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్)లో భాగంగా కేంద్రం ఈ యూనిట్లను అందిస్తోంది.



# హైదరాబాద్‌కు రానున్న ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 1:** అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ త్వరలో తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు రానున్నారు. డిసెంబర్‌లో ఆయన భారత పర్యటనకు రానుండగా, దేశంలోని పలు ప్రధాన నగరాల్లో సందడి చేయనున్నారు. తొలుత దక్షిణాదిన కేరళలో పర్యటించాలని అనుకున్నప్పటికీ, ఆ వేదిక రద్దయింది. దీంతో మెస్సీ కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు మార్చాలని నిర్వాహకులు నిర్ణయించారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్ పర్యటనలో భాగంగా కోల్‌కతా, హైదరాబాద్, ముంబై, ఢిల్లీ నగరాల్లో మెస్సీ సందడి చేయనున్నారు. దక్షిణాదిలో లక్షలాది మంది ఫుట్‌బాల్ అభిమానుల కోసం హైదరాబాద్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు భారత్‌లో మెస్సీ పర్యటన నిర్వాహకుడు సతాద్రు దత్తా వెల్లడించారు. వారం రోజుల్లో బుకింగ్‌లు ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు. వేదిక విషయానికి వస్తే గచ్చిబౌలి లేదా రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. డిసెంబర్ 1213 అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున మెస్సీ కోల్‌కతాకు చేరుకుంటారు. సాల్ట్ లేక్ స్టేడియంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం హైదరాబాద్ చేరుకుంటారు. డిసెంబర్ 14న ముంబై, డిసెంబర్ 15న ఢిల్లీలో పర్యటిస్తారు. ఆ రోజు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతోనూ ఆయన భేటీ కానున్నారని నిర్వాహకులు తెలిపారు.

# ప్రమాదాల నివారణలో వాహనదారుల ప్రాధాన్యత ఎంతో కీలకం: నిపుణులు

**జంక్షన్లు, బస్ బేలు, పాదచారుల క్రాస్ లేన్‌ల వద్ద డ్రైవింగ్ మరింత కీలకం**

**మొత్తం రోడ్డు ప్రమాదాలలో 90 శాతం మానవ తప్పిదాల వల్లే: రహదారుల భద్రత సంస్థ**

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో లక్షా 15 వేల మందికి పైగా మరణిస్తుండడం తెలిసిందే, ఇందు లో తెలుగు రాష్ట్రాలలో మరణిస్తున్న వారు 15 వేల మంది వరకు వుంటున్నారు. ప్రపంచంలో రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా మరణి స్తున్న వారిలో భారత్ మొదటి పది దేశాల్లో ఒకటిగా వుందని రహదారుల భద్రత సంస్థ నివేదిక చెబుతోంది. రోడ్డు ప్రమాదాలలో మానవ తప్పిదాల వల్ల జరుగుతున్నవి 90 శాతం వరకు వుంటుండం గమనార్హం. ఈ నేపథ్యంలో వాహనాలను నడిపే డ్రైవర్లు నియమాలను పాటిస్తూ జంక్షన్లు, బస్ బేలు, పాదచారుల క్రాస్ లేన్ల వద్ద పద్ధతిగా డ్రైవింగ్ చేయాలని నిపుణులు చెబుతున్నారు. దీనిపై రహదారుల భద్రత సంస్థ జరిపిన పరిశీలనలో సం చలన విషయాలు వెలుగు చూశాయి. ఇందులో ముఖ్యమైనవి జంక్షన్ల వద్ద నిబంధనలను పాటించక పోవడం. దీంతో పాటు సిగ్నళ్లు, జంక్షన్ల వద్ద ఆగడానికి, దాటడాని వున్న నిబంధనలను పాటించక పోవడం. దీంతో పాటు కొన్నిచోట్ల నేరుగా ముందుకు వెళ్లడానికి, కుడి, ఎడమల వైపు వెళ్ల డానికి వున్న సిగ్నలింగ్ వ్యవస్థను ఫాలో అవక పోవడం. చాలా మంది కూడలిలో తమ బండికి ఖాళీ లేదని పూర్తిగా ఎడమవైపు ఆగి గ్రీన్ సిగ్నల్ పడ్డాక కుడివైపు వెళ్లే ప్రయత్నం చేస్తుండగా మరికొందరు మరోవైపు వస్తుంటారు. ఇదే సమయంలో అప్పటివరకు కూడలి వద్ద నిరీక్షించిన వాహన దారులు సిగ్నల్ పడ్డాక ఒక్కసారిగా వేగంగా ముందుకు వచ్చేస్తుం టారు. ఇలా అడ్డదిడ్డంగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక పాదచారులు దాటేందుకు రోడ్లపై జీబ్రా లైన్లుంటాయి. అక్కడ తప్పనిసరిగా వేగం తగ్గించాలి. కొందరు వాటిని గుర్తించకుండా వెళుతుంటారు. రోడ్డు దాటేవాళ్లు దగ్గరగా ఉంటే వేగాన్ని నియంత్రించడం కష్టం అవుతుంది. కాబట్టి జీబ్రా లైన్లను ముందే గుర్తించి వేగాన్ని తగ్గించుకోవాలి. కానీ జీబ్రా లైన్ వద్ద వాహనదారులు వాహ నాల వేగాన్ని తగ్గించడం తక్కువగా వుంటోంది. ఇక కూడళ్ల దగ్గర వేగం తగ్గించకుండా దూసుకుపోయే వాహనదా రుల వల్ల, రెడ్ సిగ్నల్ పడ్డా పట్టించుకోకుండా వెళ్లే వారివల్ల, ఎదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదం పొంచి వుంటోంది. దీంతో పాటు కుడివైపు, ఎడమవైపు మళ్లేటప్పుడు సిగ్నల్ సరిగ్గా ఇవ్వాలి. ఒకవైపు సిగ్నల్ ఇచ్చి మరోవైపు వెళ్లడం, అసలు సిగ్నలే ఇవ్వకపోవడం.. రెండూ అపాయకరమే. మరోవైపు వెళ్లేందుకు వేగం తగ్గిస్తాం. కానీ వెనకాల వాహనాలు వేగంగా వచ్చేస్తాయి. ఈ విషయంలో వాహనదారులు కచ్చితంగా జాగ్రత్తలు పాటిం చాలి. లేకుంటే వాహనాలు ఢీ కొనే ప్రమాదం వుంది. ఇదే సమయంలో సిగ్నల్ తప్పుగా ఇచ్చినా వాహనాలు ఢీ కొనే ప్రమాదం వుంది. ఇక కొన్ని సార్లు జంక్షన్ల వద్ద రెడ్సిగ్నల్ పడ్డాక సమయం ఉంది కదా అని కొందరు మొబైల్ తీసి మాట్లాడుతుంటారు. మెసేజ్‌లు పెడుతుంటారు. వీడియోలు చూసేవాళ్లూ ఉన్నారు. ఇలా చేయడం వల్ల వెనుక వాహన దారులు వేగంగా దూసుకొచ్చినప్పుడు ప్రమాదాలు జరుగుతుంటాయి. డ్రైవింగ్‌లో మొబైల్ వాడకం మీ ఏకాగ్రతను తీవ్రంగా దెబ్బ తీస్తుంది. మరికొందరు డ్రైవింగ్ చేస్తూనే మొబైల్ చెక్ చేస్తూ, మెసేజ్‌లు పెడుతుంటారు. ఇది వారికే కాకుం డా ఇతరులకూ ప్రాణాంతకం కావచ్చు. ఓఆర్ఆర్, జాతీయ రహదారుల్లో ఒక్కోవైపు నాలుగైదు లేన్లు ఉంటాయి. ఒక లేన్ నుంచి మరోదాంట్లోకి మారేటప్పుడు వెనుక నుంచి వచ్చే వాహనాల వేగాన్ని గమనిస్తూ సిగ్నల్ ఇచ్చి మారాలి. చలికాలం మొదలైంది. ఉదయం వేళల్లో పొగమంచు వుం టుంది. కొన్నిచోట్ల సిగ్నళ్లు ఉన్నా సరిగా పనిచేయవు. ఇవన్నీ డ్రైవింగ్ చేసేవారిని గందరగోళానికి గురిచేస్తుంటాయి. వీటిని పరిగణలోకి తీసుకోవాలి. రెడ్ సిగ్నల్ పడగానే ఆగాలి. ముందు ఆగిన వాహనానికి కొంచెం దూరాన్ని పాటించాలి. రెడ్ నుంచి ఎల్లో, ఆ తర్వాత గ్రీన్ రంగులోకి మారి నప్పుడు వాహనాన్ని మెల్లగా నడపాలి. కొందరు సమయం కలిసివస్తుందనో, దూరం తగ్గుతుందనో రాంగ్ సైడ్లో వెళుతుంటారు. ఇది చాలా ప్రమా దకరం. చిన్నపాటి నిర్లక్ష్యం, తప్పిదాలు, కొంత సమయాన్ని ఆదా చేసుకునే క్రమంలో చేసే తప్పులు ఎంతో మంది ప్రాణాలను బలిగొంటున్నాయి.

# కాశీబుగ్గ మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల నష్టపరిహారం

## నిర్మాణ లోపాలు, నిర్వాహకుల వైఫల్యమే కారణం

**క్షతగాత్రులకు రూ. 3లక్షల సాయం: ఎపి మంత్రి లోకేష్**

**మృతుల కుటుంబాలకు కేంద్రం నుంచి రూ. 2 లక్షలు**


**పలాస (శ్రీకాకుళం జిల్లా), నవంబరు 1, ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దుర్ఘటన జరిగిన వెంటనే హుటాహుటిన శనివారం సాయంత్రం పలాస ఆసుపత్రికి చేరుకున్న ఆయన, సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ప్రభుత్వం, పార్టీ తరఫున అందించే తక్షణ సహాయాన్ని ప్రకటించారు. కాశీబుగ్గ తొక్కిసలాట దుర్ఘటనలో మృతి చెందిన 9 మంది భక్తుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.17 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందని మంత్రి లోకేష్ ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రాష్ట్రం నుంచి రూ.3 లక్షలు, కేంద్రం నుంచి రూ.50 వేలు కలిపి మొత్తం రూ.3.5 లక్షలు ఇస్తారు. మృతుల కుటుంబాలకు మట్టి ఖర్చుల కింద తక్షణ సహాయంగా రూ.పదివేలు పరిహారం లభిస్తుంది. అంతేకాక, మృతుల్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉన్న ముగ్గురు కార్యకర్తల కుటుంబాలకు పార్టీ తరపున బీమా కింద ఒక్కొక్కరికి అదనంగా రూ.5 లక్షల చొప్పున సాయం అందుతుందని మంత్రి తెలిపారు.

### గుడి నిర్మాణంలో లోపాలపై దృష్టి

ఈ ఘటనలో మొత్తం 16 మంది క్షతగాత్రులు కాగా, వారిలో ముగ్గురు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారని మంత్రి తెలిపారు. ఆలయం నిర్మించి నాలుగు సంవత్సరాలు అవుతున్నప్పటికీ, ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారనే విషయాన్ని నిర్వాహకులు పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. దశల వారీగా గుడి నిర్మాణం జరిగింది. భారీ గేట్లు వేశారు కానీ, ఫౌండేషన్ (పునాది) బలంగా లేకపోవడం ప్రమాద తీవ్రతను పెంచింది. గుడి నిర్మాణంలో జరిగిన లోపాలపై పై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరుపుతారని లోకేష్ వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు. క్షత్రగాత్రులకు పూర్తి స్థాయిలో వైద్యంతో పాటు ఇతర సహకారం అందిస్తామని, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎప్పుడెప్పుడు ఏయే కట్టేరో అన్న వివరాలు తెలుసుకుంటామని, ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి లోకేష్ వెంట కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సహా ఎమ్మెల్యేలు గౌతు శిరీష, మామిడి గోవిందరావు, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ తదితర ప్రముఖులు లోకేష్‌తో పాటు పర్యటించిన వారిలో ఉన్నారు. డిఐజి గోపీనాథ్ జట్టి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి వంటి ఉన్నతాధికారులు కూడా మంత్రితో పాటు ఉన్నారు.

# మరో రూ.1,000 కోట్ల రుణానికి ఇండెంట్

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** మార్కెట్ రుణాల్లో భాగంగా 1,000 కోట్ల రూపాయలకు రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర సర్కార్ ఇండెంట్ పెట్టింది. ఈ నెల 4న నిర్వహించే వేలం ద్వారా ఈ మొత్తం తీసుకుంటామని రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రతిపాదించింది. 32 సంవత్సరాల కాలపరిమితితో ఈ రుణాన్ని సేకరించనున్నట్లు తెలిపింది. ఇందుకు ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టనున్నట్లు వెల్లడించింది. తద్వారా బహిరంగ మార్కెట్ నుంచి ఈ రుణం తీసుకుంటామని రాష్ట్ర ఆర్థిక శాఖ ఇండెంట్ పెట్టినట్టు ఆర్బీఐ ఓ ప్రకటనలో వెల్లడించింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద 54,009 కోట్ల రూపాయలు తీసుకోనున్నట్లు 2025-26 వార్షిక అంచనా బడ్జెట్‌లో పేర్కొంది. ప్రస్తు ఆర్థిక సంవత్సరంలో కేవలం ఆరు నెలల్లో ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకూ 49,900 కోట్ల రూపాయలు అప్పుగా తీసుకుంది. దీంతో వార్షిక రుణ పరిమితిలో ఇప్పటికే 92 శాతం మేర రుణాలు సేకరించినట్లయింది.



# శబరిమలై మాజీ ఇఒ సుధీశ్‌కుమార్ అరెస్ట్

**పతనంతిట్ట, నవంబరు 1:** శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో బంగారం తాపడం పేరుతో జరిగిన మోసం కేసులో అధికారులు మాజీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుధీశ్ కుమార్‌ను శనివారం అరెస్టు చేశారు. 2019లో శబరిమల ఈవోగా సుధీశ్ బాధ్యతలు నిర్వర్తించారు. తిరువనంతపురంలో క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అయ్యప్ప స్వామి వద్ద ఉన్న ద్వారపాలకుల విగ్రహాల సమాచారాన్ని దాచిపెట్టినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. బంగారు తాపడం ఉన్న ద్వారపాలకుల విగ్రహాలను.. కాపర్ షీట్లుగా దొంగ డాక్యుమెంట్లు సృష్టించి నట్లు మాజీ ఈవోపై ఆరోపణలు ఉన్నాయి. ద్వారపాలకుల విగ్రహాల తాపడం కోసం వాటిని ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టికి అందజేశారు. వాస్తవానికి ఆ విగ్రహాలకు 1998లో గోల్డ్ ప్లేటింగ్ జరిగింది. అయితే మళ్లీ 2019లో ఆ విగ్రహాలను ఈవోగా ఉన్న సుధీశ్ వాటిని ఉన్నికృష్ణన్‌కు అందజేశారు. ఆ విగ్రహాలను రాగితో ప్లేటింగ్ చేసి ఉన్నట్లు చూపించి, వాటిని ఉన్న బంగారాన్ని మాజీ ఈవో తీసుకెళ్లినట్లు ఈ కేసులో ఆరోపణలు వచ్చాయి. శబరిమల మాజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మురారి బాబును కూడా ఈ కేసులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మాజీ ఇఒ కుమార్‌ను జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు.

# 36 శాతం మంది మద్యానికి గుడ్‌బై

## ప్రపంచవ్యాప్తంగా జెన్‌జడ్ యువతలో కొత్త ట్రెండ్

**నాన్ ఆల్కహాలిక్ డ్రింక్స్‌కు పెరుగుతున్న ఆదరణ**

**భారత్‌లో పెరిగిన మద్యం అమ్మకాలు**

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా యువత (జెనరేషన్ జెడ్. జెన్ జెడ్)లో మద్యపాన అలవాటు తగ్గుతోంది చట్ట బద్దం గా మద్యం తాగే వయస్సున ప్రతీ ముగ్గురిలో ఒకరు ఆల్కహాల్‌కు దూరంగా వుంటు న్నారని ఓ అంతర్జాతీయ సంస్థ పరిశీలనలో వెల్లడయ్యింది. ఇది 36 శాతంగా వుందని ఆ సర్వేలో వెలుగు చూసింది. ఇదే సమయంలో నాన్ ఆల్కహాలిక్ డ్రింక్స్‌కు ఆదరణ పెరుగుతోందని వెల్లడయ్యింది.

ఆరోగ్య ంగా వుండాలనే కోరికతో పాటు అనారోగ్య సమస్యలకు దూరంగా వుండాలనే భావన ఇందుకు కారణంగా మద్యపానం మానేసిన 87 శాతం మంది చెబుతుండగా డబ్బు ఆదాకోసం, కుటుంబ సభ్యులకు కష్టం కలిగించడం ఇష్టం లేక మద్యానికి దూరంగా వున్నట్లు 30 శాతం మంది, నిద్ర నాణ్య తను మెరుగు పరచుకు నేందుకు ఇలా చేస్తున్నట్లు 25 శాతం మంది చెబుత్నుట్లు ఆ సంస్థ తెలిపింది.మరోవైపు భారత్‌లో మాత్రం మద్యం అమ్మ కాలు పెరుగుతున్నట్లు 2029 నాటికి ప్రపంచంలో అత్యధికంగా మద్యం తాగే వారు ఇక్కడే వుంటారని ఆ సంస్థ పరిశీలనలో తేలింది.

ప్రపంచ వ్యాప్తంగా యువత ఆలోచనలో మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా మద్యపానానికి దూరంగా వుండాలని యువతలో వస్తున్న ఆలోచన మేధావులతో పాటు అన్ని వర్గాల నుంచి ప్రశంసలను అందుకుంటోంది. మద్య పానానికి దూరంగా వుండాలనే యువత ఆలోచన వెనుక ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యుల సంక్షేమం, డబ్బులను వృధా చేయడం ఇష్ట పడక పోవడం, కోరి అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకోవడం ఎం దు కనే కా రణంగా వుందని అంత ర్జాతీయ సంస్థ పరిశీలన లో తేలింది. గడచిన ఐదేళ్ల కాలంలో మద్యపానం అలవాటు వున్న వారిలో ఈ మార్పు కనిపించిం దని ఆ సర్వేలో తేలింది. 2020లో ప్రపంచ వ్యాప్తంగా పలు కేటగిరిలలో మద్యం సేవించే వారు 23 శాతం వుండగా 2025 నాటికి ఇది 17 శా తానికి పడిపోవడం గమనార్హం.

ఇక మద్యపానం అలవాటు వున్న వారిలో 53 శాతం మంది దానిని తగ్గించుకునేందుకు నిర్ణయించగా గతంలో ఇది 44 శాతంగా వుండేదని ఆ సంస్థ సర్వేలో తేలింది. గతంలో యువత ఒకచోట పార్టీలు నిర్వహిం చుకుంటే కచ్చితంగా ఆల్కహాల్ వుండేది. కానీ నే డు ఒకసారి ఆల్కహాల్ అయితే రెండవసారి నాన్ ఆల్కహాల్ పార్టీలు నిర్వహిస్తున్న ట్రెండ్ మొదలయ్యిందని ఆ సర్వేలో తేలింది. దీనిని జీబ్రా స్ట్రైపిం గ్ గా పిలుస్తారు. దీనివల్ల మద్యం వినియోగం చాలా వరకు తగ్గుతుందని ఆ సర్వే తేల్చింది.

ఈ కారణంగా నాన్ ఆల్కహాలిక్ డ్రింక్స్ వినియోగం ప్రపంచ వ్యాప్తంగా భారీగా పెరిగిందని ఆ సంస్థ పరిశీలనలో తేలింది. గడచిన ఐదేళ్ల కాలంలో నాన్ ఆల్కహాలిక్ డ్రింక్స్ వినియోగం 11 శాతం పెర గ గా 2029 నాటికి ఇది 24 శాతం పెరుగుతుందని ఆ సంస్థ పరిశీలనలో తేలింది. ఇక భారత్‌లో మాత్రం ఆల్కహాల్ వినియోగం పెరిగిందని ఆ సంస్థ తేల్చింది. 2024 నుంచి 2029 మధ్య కాలంలో భారత్‌లో ఆల్కహాల్ డ్రింక్స్ వినియోగం 357 మిలియన్ లీటర్లు పెరిగే అవకాశం వుంద ని, ఇది ప్రపంచంలోనే అత్యధికమని ఆ సంస్థ అంచనా వేసింది.

# 14న ప్రేక్షకుల ముందుకు 'స్కూల్ లైఫ్'..



నైనిషా క్రియేషన్స్ బ్యానర్‌పై గంగాభవని నిర్మాతగా పులివెందుల మహేష్ రచన దర్శకత్వంలో బాలల దినోత్సవ సందర్భంగా నవంబర్ 14 వ తేదీన దేశవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం స్కూల్ లైఫ్. పులివెందుల మహేష్ హీరోగా నటించగా తనతో జంటగా సావిత్రి, షన్ను నటించారు. హీరో సుమన్, ఆమని, మురళీధర్ గౌడ్ తదితరులు. ఈ చిత్రంలో కీలకపాత్రను పోషించారు. ధర్మ జిజి ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా పని చేయగా నందమూరి హరి, ఎన్టీఆర్(సూపర్ గుడ్ ఫిలిమ్స్) ఈ చిత్రాన్ని ఎడిట్ చేశారు. షేక్ బాజీ ఈ చిత్రానికి సంగీతం అందించగా క్రౌడ్ ఫండింగ్ రూపంలో ఈ చిత్రాన్ని ఆర్థికంగా సమకూర్చారు. విడుదల తేదీ దగ్గర అవుతున్న ఈ సమయంలో దర్శకుడు తన తల్లిదండ్రుల చేతుల మీదగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా హీరో సుమన్ మాట్లాడుతూ,అందరికీ నమస్కారం. స్కూల్ లైఫ్ అనే సినిమా నాకు ఎంతో ప్రత్యేకమైనది. ఇప్పటికే ఎన్నో వందల సినిమాలలో నేను నటించినప్పటికీ ఈ సినిమాలోని పాత్ర నా మనసుకు చాలా దగ్గరగా అనిపించింది. ఒక రైతు పాత్రలో రైతులకు అండగా నిలబడేలా నా పాత్ర ఉండబోతుంది. సినిమా షూటింగ్ సమయంలో నాకు ఒక యాక్సిడెంట్ వల్ల కొన్ని రోజులు షూటింగ్ చేయలేకపోయాను. వేరే ఎవరితో అయినా షూటింగ్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ మహేష్ ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా కేవలం ఆ పాత్రను నేను మాత్రమే చేయాలని పట్టుదలతో నా కోసం వెయిట్ చేసి ఆ పాత్రను నాతో నటించేలా చేశారు. ఆ పాత్ర కోసం నేను పులివెందుల వెళ్లి అక్కడ లొకేషన్స్‌లో షూటింగ్ చేస్తున్నప్పుడు అక్కడ ప్రజలను ఎంతగానో అభిమానించారు. ఈ చిత్రంలో ఆమని నాకు భార్యగా నటించారు. ఈ చిత్ర టైటిల్ విషయానికి వస్తే స్కూల్ లైఫ్. అందరికీ ఎప్పటికీ గుర్తుండిపోయే జీవితం అది. ఆ వయసులో ప్రేమ చాలా స్వచ్ఛంగా ఉంటుంది. ఈ చిత్రషూటింగ్ సమయంలో ఎన్ని కష్టాలు వచ్చినా మహేష్ వాటిని ఎదుర్కొని ఈ చిత్ర షూటింగును సవ్యంగా పూర్తి చేశారు. అందుకే అతను పబ్లిక్ స్టార్ పులివెందుల మహేష్ అయ్యారు. తల్లిదండ్రుల చేతుల మీదగా ఈ చిత్ర ట్రైలర్ లంచ్ చేయడం అనేది ఎంత గొప్ప విషయం. అలాగే ఈ చిత్రానికి ఇతర కాస్ట్, సాంకేతిక నిపుణులు కూడా ఎంతో అద్భుతంగా సపోర్ట్ చేస్తూ వచ్చారు. ఈ చిత్రం ద్వారా ఎంతో మంది కొత్త ఆర్టిస్టులు సినీ పరిశ్రమకు పరిచయం కాబోతున్నారు. నవంబర్ 14వ తేదీన విడుదల కాబోతున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు అందరూ ఆశీర్వదించాల్సిందిగా కోరుకుంటున్నాను అన్నారు. దర్శకుడు, హీరో పబ్లిక్ స్టార్ పులివెందుల మహేష్ మాట్లాడుతూ, మా సినిమాను సపోర్ట్ చేస్తూ ఇక్కడికి వచ్చిన మీడియా వాళ్లందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు. మా సినిమాలో కీలకపాత్రలు పోషించి, సినిమాకు ఎంతో సపోర్ట్ చేసిన సుమన్‌కి, ఆమనికి, మురళీధర్‌కి మరొకసారి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఈ సినిమా కోసం నేను ఎన్నో పోగొట్టుకున్నాను. ఒక సామాన్య ఆర్టిస్టుస్థాయి నుండి ఈరోజు సినిమా చేసే వరకు వచ్చాను. సినిమాలు బ్రతకాలి. అందుకే నేను ఈ సినిమాను మీ ముందుకు తీసుకు వస్తున్నాను. చిన్న సినిమాలను సపోర్ట్ చేయండి. భవిష్యత్తులో కొత్తవారి అందరికీ నా బ్యానర్ సపోర్ట్‌గా నిలుస్తుంది. సినిమాలలో హీరో కథ, బడ్జెట్ కాదు. క్రౌడ్ ఫండింగ్ చేసి ఈ సినిమాను పూర్తి చేసాము. ఈరోజు పెద్ద స్థాయిలో ఉన్న వారంతా ఒకప్పుడు కొత్త వారే. మా సినిమా టికెట్ కేవలం వంద రూపాయలు మాత్రమే ఉండబోతుంది.హీరోయిన్ షన్ను మాట్లాడుతూ,మా చిత్ర ట్రైలర్ లాంచ్ సందర్భంగా ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ ధన్యవాదాలు. మా సినిమాలో అందరూ సపోర్ట్ చేసి నవంబర్ 14వ తేదీన సినిమాలు మొత్తం హిట్టు చేస్తారని మీడియాని అలాగే ప్రేక్షకులను కోరు కుంటున్నాను. ఎంతో కింద నుండి వచ్చి ఈ సినిమాను పూర్తి చేసాము. నాకు ఈ సినిమాలో అవకాశం ఇచ్చిన మహేష్‌కి, ఈ సినిమాలో నటించిన సుమన్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అలాగే ఈ చిత్రం కోసం పనిచేసిన ఇతర నటీనటులకు, సాంకేత నిపుణులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఈ చిత్రంలో నాది మూడు నిమిషాల ఒకటే డైలాగ్ ఉంటుంది. అందరూ చూసి సపోర్ట్ చేస్తారని అనుకుంటున్నాను అంటూ ముగించారు. హీరోయిన్ సావిత్రి మాట్లాడుతూ, స్కూల్ లైఫ్ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన వారందరికీ మా ధన్యవాదాలు. నాకు ఈ సినిమాలో అవకాశం ఇచ్చిన మహేష్‌కి ధన్యవాదాలు .14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అందరూ చూసి ఆశీర్వదించవలసిందిగా కోరుకుంటున్నాను అన్నారు.

# 'ది గర్ల్ ఫ్రెండ్' ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది



నిర్మాతలు : ధీరజ్ మొగిలినేని, విద్య

కొప్పినీడి నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇంటెన్స్, ఎమోషనల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. సరికొత్త ప్రేమ కథగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఈ నెల 7న హిందీతో పాటు తెలుగులో ఈ నెల 14న, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి.ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ, లాక్ డౌన్ టైమ్‌లో థియేటర్స్ క్లోజ్ అయ్యాయి. ఆ తర్వాత థియేటర్స్ అన్నీ అందుబాటులోకి వచ్చాయి. ఆ టైమ్ లో స్క్రిప్ట్ డెవలప్ చేసే దశలో ఉన్నాం. థియేటర్స్ అన్నీ ఓపెన్ అయ్యాక ఈ సినిమాను థియేట్రికల్ గా రిలీజ్ చేయాలని అనుకున్నాం. మేము ఈ ప్రాజెక్ట్ టేకోవర్ చేసినప్పటి నుంచి థియేట్రికల్ గానే వెళ్లేందుకు ప్లాన్ చేశాం. ప్రొడ్యూసర్‌గా కమర్షియల్‌గా మూవీ ఉండాలని కోరుకుంటాం. కానీ మేము రిస్క్ చేసినా ఫర్వాలేదు అనేంత బాగా ఈ స్టోరీ నచ్చింది. విద్యతో మంచి బాండింగ్ ఉంది. ప్రొడక్షన్ వైజ్ డెసిషన్స్ తీసుకోవడంలో ఎలాంటి ఇబ్బంది రాలేదు. మనం లవ్ స్టోరీస్‌ను ఎవరో ఒకరి పాయింట్ ఆఫ్ వ్యూలో చెప్పాలి. ఈ కథ హీరోయిన్ కోణంలో ఉంటుంది. అలాంటప్పుడు స్టార్స్‌ను ఈ మూవీకి హీరోగా తీసుకోలేం. పర్ ఫార్మర్స్ నే తీసుకోవాలి. దీక్షిత్ మంచి పర్ ఫార్మర్. రశ్మిక లాగే తన క్యారెక్టర్ లో ఆకట్టుకునేలా నటించాడు. ఈ ఏజ్ గ్రూప్ లో నాకు తెలిసిన వాళ్లలో దీక్షిత్ ఈ మూవీకి పర్ఫెక్ట్ అనిపించింది. సినిమా చూశాక మీకూ అదే ఫీల్ కలుగుతుంది.'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాను మేమే సొంతంగా డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాం. థియేట్రికల్‌గా ఈ మూవీ బాగా వర్కవుట్ అవుతుందని నమ్ముతున్నాం. దీక్షిత్‌ను తీసుకోవడం వల్ల కన్నడ మార్కెట్ కు ఉపయోగపడుతుందని అనుకోలేదు, ఆ క్యారెక్టర్ కు ఆయన కరెక్ట్‌గా సెట్ అవుతాడనే తీసుకున్నాం. అయితే రశ్మిక, దీక్షిత్ ఉండటం వల్ల కన్నడలో అడ్వాంటేజ్ అవుతుంది.తెలుగులో వస్తున్న పెద్ద సినిమాలను కన్నడ వెర్షన్ లో రిలీజ్ చేస్తున్నారు. చిన్న సినిమాలూ ఇలా ట్రై చేస్తున్నా కొన్నిసార్లు టైమ్ సరిపోక కన్నడ వెర్షన్ లో రిలీజ్ చేయడం లేదు. "ది గర్ల్ ఫ్రెండ్' సినిమాను ఈ నెల 7న హిందీ, తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. సో హ్యాపీగా టెన్షన్ లేకుండా ఉన్నాం.

# మాహాతేజ క్రియేషన్స్ జి.ఓ.ఎ.టి షూటింగ్ పూర్తి



జైశ్నవ్ ప్రొడక్షన్, మాహాతేజ క్రియేషన్స్ లో అద్భుతం, టేనంట్ వంటి అద్భుతమైన చిత్రాలని నిర్మించిన మొగుళ్ళ చంద్రశేఖర్ నిర్మాణం లో... క్రికెట్ నేపథ్యం లోనే కామెడీ ప్రధాన అంశంగా సుడిగాలిసుధీర్, దివ్యభారతి ప్రధాన పాత్రధారులుగా జి.ఓ.ఎ.టి మూవీ షూటింగ్ పూర్తి చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశకి చేరుకున్నాయి. సినిమా చాలా అద్భుతంగా వచ్చిందని, తను నిర్మించిన సినిమాలలో మంచి చిత్రంగా ఈ సినిమా నిలుస్తుందని నిర్మాత మొగుళ్ళ చంద్రశేఖర్ తెలియజేశారు.త్వరలోనే టీజర్, పాటలు అన్నీ అప్డేట్స్ తో.. ముందుకు రాబోతున్నారు. నటీనటులు: సుడిగాలి సుధీర్, దివ్యభారతి, మొట్ట రాజేంద్రన్, సర్వదమన్‌బెనర్జీ, నితిన్‌ప్రసన్న, పృథ్వీ, అడుకులం నరైన్, ఆనంద రామ రాజు, పమ్మి సాయి,చమ్మక్ చంద్ర, నవీన్ నేని బ్యానర్: జైశ్నవ్ ప్రొడక్షన్, మాహాతేజ క్రియేషన్స్ నిర్మాత: మొగుళ్ళ చంద్రశేఖర్ పీఆర్వో: తేజస్వి సజ్జా.

# 'సందిగ్ధం' విజయం సాధించాలని కోరుకుంటున్నా

## టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నటుడు, నిర్మాత అశోక్ కుమార్..



సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లో తీర్థ క్రియేషన్స్ బ్యానర్ మీద సంధ్య తిరువీధుల నిర్మాతగా పార్ధ సారథి కొమ్మోజు తెరకెక్కించిన చిత్రం 'సందిగ్ధం' ఈ చిత్రంలో నిహాల్, ప్రియా దేశ్ పాగ్, అర్జున్ దేవ్, కాజల్ తివారి, జీవ కోచెర్ల, నవీన్ రాజ్, చిట్టిబాబు, ఆనంద్ భారతి, రైజింగ్ రాజు, అప్పారావు, నాగి వంటి వారు ముఖ్య పాత్రలను పోషించారు. ఈ క్రమంలో 'సందిగ్ధం' టీజర్‌ను నటుడు, నిర్మాత అశోక్ కుమార్ శుక్రవారం నాడు రిలీజ్ చేశారు. 'సందిగ్ధం' టీజర్ గమనిస్తే.. ఓ ఊరు, అందులో జరిగే వింత ఘటనలు, ప్రేమ కథ ఉన్నట్టుగా కనిపిస్తోంది. ఇక ఇందులో చూపించిన విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్ ఎంతో సహజంగా కనిపిస్తున్నాయి. సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్ జానర్‌కి సరిపోయే మంచి ఆర్ఆర్ కూడా ఉంది. టీజర్‌తో సినిమా మీద మంచి బజ్‌ను అయితే క్రియేట్ చేశారు. టీజర్ లాంఛ్ అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో,నటుడు, నిర్మాత అశోక్ కుమార్ మాట్లాడుతూ,ప్రస్తుతం ఓ సినిమా సక్సెస్ అవ్వడం చాలా కష్టంగా మారింది. కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ చాలా పెరిగింది. పది, పదిహేను కోట్లు లేకపోతే సినిమా తీయలేకపోతోన్నారు. కరోనా తరువాత పరిస్థితులు మారిపోయాయి. మూవీకి మంచి టాక్ వస్తే జనాలు థియేటర్లకు వస్తున్నారు. జనాలకి రీచ్ అయ్యేలా సినిమాని ప్రమోట్ చేయాలి. సందిగ్ధంటీజర్ చాలా గ్రిప్పింగ్‌గా ఉంది. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చే చిన్న చిత్రాలు కూడా పెద్ద విజయాన్ని సాధిస్తున్నాయి. భార్యభర్తలైన సంధ్య, పార్ధు కష్టపడి తీసిన ఈ చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నాను. దర్శక, నిర్మాతలు పడిన కష్టానికి తగిన ప్రతిఫలం రావాలి. చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్ అని అన్నారు.హీరో నిహాల్ మాట్లాడుతూ, పార్ధ సారథి గారు చెప్పిన కథ నాకెంతో నచ్చింది. ఆయన వల్లే నేను ఈ మూవీలోకి వచ్చాను. పార్ధు గారు, సంధ్య ఈ మూవీ కోసం చాలా కష్టపడ్డారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాను నిర్మించారు. 'సందిగ్ధం'మూవీని అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను అని అన్నారు.హీరో అర్జున్ దేవ్ మాట్లాడుతూ,పార్ధు, సంధ్య సందిగ్ధంమూవీ కోసం చాలా కష్టపడ్డారు. మా కోసం వచ్చిన అశోక్ కుమార్‌కి థాంక్స్. సినిమాను చూసి అందరూ సపోర్ట్ చేయాలని అన్నారు.దర్శకుడు పార్ధ సారథి మాట్లాడుతూ,'సందిగ్ధం' విషయంలో ప్రతీ ఒక్క ఆర్టిస్ట్, టెక్నీషియన్ నాకు ఎంతో సపోర్ట్ చేశారు. ఈ మూవీ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఇలాంటి కథ ఇంత వరకు రాలేదని చెప్పొచ్చు. ఆద్యంతం ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుంది. ఈ ప్రయాణంలో నాకు వెన్నంటే ఉండి నా భార్య సంధ్య తోడుగా నిలిచారు. నన్ను దర్శకుడిగా చేయాలని ఎంతో కష్టపడి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రాన్ని అందరూ చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను. కొత్త వాళ్లను మీడియా సపోర్ట్ చేసి ముందుకు తీసుకువెళ్లాలని కోరుకుంటున్నాను అని అన్నారు.ప్రియా దేశ్ పాగ్ మాట్లాడుతూ,సందిగ్ధంలో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. ఈ ప్రయాణంలో నాకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు. టీజర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. సంగీత దర్శకుడు గౌతమ్ మాట్లాడుతూ,పార్ధు నాకు చాలా ఏళ్ల నుంచి తెలుసు. పట్టుదలతో సొంత బ్యానర్‌లో ఈ మూవీని రూపొందించారు. ఈ చిత్రం సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను అని అన్నారు.నటుడు నవీన్ రాజు మాట్లాడుతూ,నాకు పార్ధుతో చాలా ఏళ్ల నుంచి అనుబంధం ఉంది. పార్ధు ఫ్యామిలీ ఎంతో కష్టపడి ఈ మూవీని నిర్మించింది. వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం రావాలి. 'సందిగ్ధం' పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు.నరసింహా రాజు మాట్లాడుతూ,ఇండస్ట్రీలోకి కొత్తవాళ్లు రావాలని అందరూ కోరుకుంటారు. మా చెల్లి నిర్మాతగా, మా బావ దర్శకుడిగా ఈ'సందిగ్ధం' మూవీ వచ్చింది. ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుంది. దర్శక, నిర్మాతలకు మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

# 12ఎ రైల్వే కాలనీ నుంచి

## కన్నోదిలి కలనోదిలి సాంగ్ రిలీజ్



అల్లరి నరేష్ అప్ కమింగ్ థ్రిల్లర్ 12ఎ రైల్వే కాలనీ నవంబర్ 21న థియేటర్లలో విడుదల కానుంది. నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్‌కుమార్ సమర్పణలో పొలిమేర సిరీస్‌తో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ రాశారు. మ్యూజిక్ ప్రమోషన్‌లను ప్రారంభించడానికి మేకర్స్ ఫస్ట్ సింగిల్ కన్నోదిలి కలనోదిలిని విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ ట్రాక్ లవ్ ఫీలింగ్‌ని అందంగా హైలైట్ చేస్తుంది. భీమ్స్ సాఫ్ట్ కంపోజింగ్ ఇన్స్టంట్ హిట్ అయ్యింది.వాషమ్ అబ్దుల్ వహాబ్ వోకల్స్ ఈ పాట అదనపు ఆకర్షణ తీసుకొచ్చింది. ఆయన వాయిస్ మ్యాజిక్‌లా వుంది. దేవ్ పవార్ సాహిత్యం అద్భుతంగా వుంది. అల్లరినరేష్, డాక్టర్ కామాక్షి భాస్కర్ల మధ్య కెమిస్ట్రీ లవ్లీగా వుంది. విజువల్స్ చాలా ప్లజెంట్‌గా వున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్‌లు సినిమాపై అంచనాలు పెంచాయి. 12ఎ రైల్వే కాలనీని ఎమోషన్స్, ప్రేమ, థ్రిల్ ఎలిమెంట్స్‌తో మంచి సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది. సాయికుమార్, వైవాహర్ష, గెటప్ శ్రీను, సద్దాం, జీవన్‌కుమార్, గగన్‌విహారి, అనిష్‌కురువిల్లా, మధుమణి కీలక పాత్రలు పోషించారు.కుశేందర్ రమేష్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, ఎ.దర్శకుడు నాని కాసరగడ్డ స్వయంగా ఎడిటర్‌గా చేస్తున్నారు.

# శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా 'చాంపియన్' చిత్రం

యంగ్ హీరో రోషన్ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్'తో అలరించబోతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కథల ఎంపికలో, ప్రతిసారీ బ్లాక్‌బస్టర్‌లను అందించడంలో స్వప్న సినిమాస్ వెరీ స్పెషల్. ఇప్పటికే విడుదలైన రోషన్, అనస్వర రాజన్ ఫస్ట్ లుక్ పోస్టర్స్, గ్లింప్స్ మంచి హైప్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్.

స్వాతంత్ర్యానికి ముందు హైదరాబాద్లో నివసించే ఆర్మీ మాన్, ఫుట్‌బాలర్ మైఖేల్ సీ. విలియమ్స్. మైదానంలో ప్రత్యర్థులను సవాలు చేస్తూ తన ప్రతిభను ప్రదర్శించే ఈ యంగ్‌మ్యాన్‌కి ఇంగ్లండ్‌లో రాణి ఎలిజబెత్‌ను కలుసుకునే అవకాశం దక్కుతుంది. దేశం కోసం ఆడే అవకాశమొచ్చినా, అతని మనసు మాత్రం తన ప్రేయసి వద్దే ఉంటుంది. కానీ జీవితం అతనికి మరిన్ని సవాళ్లు, భావోద్వేగాలు, యుద్ధం, ప్రేమ.. అన్నీ ఒకేసారి ఎదురుచూపిస్తుంది. ఫుట్‌బాలర్‌గా రోషన్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించాడు. హైదరాబాదీ యాసలో హిందీ మిక్స్ చేసిన అతని డైలాగ్ డెలివరీ చాలా న్యాచురల్‌గా, క్యారెక్టర్‌కి తగినట్టుగా ఉంది. యాక్షన్ సన్నివేశాల్లో ఎనర్జీ, రొమాంటిక్ సీన్స్‌లో ఫినెస్, ఆత్మవిశ్వాసంతో కూడిన అటిట్యూడ్‌తో రోషన్ ఆకట్టుకున్నాడు. అనస్వర రాజన్ అందంగా కనిపించింది.



ఉంది. దర్శకుడు ప్రదీప్ అద్వైతం స్పోర్ట్స్, డ్రామా, యాక్షన్, రొమాన్స్, వార్ అన్నీ ఎలిమెంట్స్ లో అద్భుతమైన నారేషన్‌తో ఆకట్టుకున్నాడు. ప్రొడక్షన్ వాల్యూస్ అద్భుతంగా ఉన్నాయి. ప్రొడక్షన్ డిజైనర్ తోట తరణి ప్రీఇండిపెండెన్స్ కాలాన్ని అద్భుతంగా రీక్రియేట్ చేశారు. సినిమాటోగ్రాఫర్ ఆర్. మధీ వండర్ ఫుల్ విజువల్ క్యాప్చర్ చేశారు. మిక్కీ జె. మేయర్ మ్యూజిక్ టెన్షన్, ఎమోషన్ రెండింటినీ అద్భుతంగా బ్లెండ్ చేశారు. ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు కట్టింగ్ ఎడ్జ్ ఎడిటింగ్‌తో పేస్‌ను మెయింటైన్ చేశారు.ఛాంపియన్ టీజర్ హిస్టరీ, స్పోర్ట్స్ డ్రామా, లవ్ స్టోరీ, అద్భుతమైన కంటెంట్‌తో సినిమాపై అంచనాలు పెంచింది. ఈ చిత్రం డిసెంబర్ 25న క్రిస్మస్‌కు విడుదల కానుంది.



# ప్రభాస్ చేతుల మీదుగా 'శంబాల'ట్రైలర్ విడుదల..

వెర్సటైల్ హీరో ఆది సాయి కుమార్ నటించిన మిస్టికల్ థ్రిల్లర్ 'శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్ ప్రస్తుతం అందరిలోనూ బజ్‌ను క్రియేట్ చేస్తూ ట్రెండ్ అవుతోంది. మరింత హైప్‌ను పెంచేలా రెబల్ స్టార్ ప్రభాస్ ఈ చిత్రం ట్రైలర్‌ను ఆవిష్కరించి, బృందానికి తన శుభాకాంక్షలు తెలిపారు. ఈ ట్రైలర్‌ను చూస్తే ఆడియెన్స్‌కి ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించబోతోన్నట్టుగా కనిపిస్తోంది.కొన్ని వేల సంవత్సరాల క్రితం పరమశివుడికి, అసురుడికి మధ్య జరిగిన ఓ భీకర యుద్దం.. ఈ కథకి మూలం అంటూ సాయి కుమార్ గంభీరమైన వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ఆరంభమైనప్పుడు దుష్ట శక్తులు జంతువుల్ని సైతం ఆవహిస్తాయివాళ్లేమో చీమ కుట్టినా శివుడి ఆజ్ఞ అని నమ్ముతారు.. విక్రమ్ ఏమో చావులో సైతం సైన్స్ ఉందనే రకం మీరు చెబుతున్న శాస్త్రం మితం.. మీరు తెలుసుకోవాల్సిన మా శాస్త్రం అనంతం అనే డైలాగ్స్, ట్రైలర్‌లోని విజువల్స్, బీజీఎం, యాక్షన్ సీక్వెన్స్ చూస్తుంటే సరైన పాన్ ఇండియా కంటెంట్‌లా కనిపిస్తోంది.

ఆది సాయి కుమార్ యాక్షన్, అప్పియరెన్స్ మరింత పవర్ ఫుల్‌గా కనిపిస్తున్నాయి. యుగంధర్ ముని మేకింగ్, ప్రవీణ్ కె బంగారి విజువల్స్, శ్రీ చరణ్ పాకాల హాంటింగ్ బీజీఎం నెవ్వర్ బిఫోర్ అనేలా ఉన్నాయి. ఇక నిర్మాతలు రాజశేఖర్ అన్న భిమోజు, మహీధర్ రెడ్డి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ మూవీని భారీ ఎత్తున నిర్మించారని ట్రైలర్ చూస్తేనే తెలుస్తోంది.

# 'పెద్ది' నుంచి జాన్వీ ఫస్ట్ లుక్..



పక్కా మాస్ క్యారెక్టర్ ఇక నేడు రిలీజ్ చేసిన పోస్టర్‌లో, ముఖ్యంగా ఓపెన్ టాప్ జీపుపై నిలబడి, జనం మధ్యలో అభివాదం చేస్తున్న లుక్ అదిరిపోయింది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన'ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు హై లెవెల్ లో ఉన్నాయి.ఇప్పటికే చరణ్ మేకోవర్, సినిమా బ్యాక్‌డ్రాప్ గురించి రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడు, ఆ అంచనాలను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తూ, మేకర్స్ ఈ సినిమా నుంచి హీరోయిన్ జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ ఒక్క పోస్టర్‌తో జాన్వీ తన ఇమేజ్‌ను పూర్తిగా మార్చేసేలా కనిపిస్తోంది. జాన్వీకపూర్ అనగానే మనకు గుర్తొచ్చేది బాలీవుడ్ గ్లామర్, ఫ్యాషన్ ఐకాన్. కానీ ఎద్దిఖి కోసం ఆమె చేసిన మేకోవర్ చూసి అందరూ షాక్ అవుతున్నారు. ఇది సింపుల్ డీ గ్లామ్ రోల్ కాదు, పక్కా మాస్ క్యారెక్టర్. శ్రీదేవి కూతురిగా ఖిఅతిలోక సుందరిఖి ఇమేజ్ ఉన్న జాన్వీ, ఇప్పుడు ఖిఅచ్చియమ్మఖిగా పూర్తి మాస్ అవతార్‌లో కనిపించబోతోంది. ఇది ఆమె కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్. ఇక నేడు రిలీజ్ చేసిన పోస్టర్ లో, ముఖ్యంగా ఓపెన్ టాప్ జీపుపై నిలబడి, జనం మధ్యలో అభివాదం చేస్తున్న లుక్ అదిరిపోయింది. ఆ కట్టుబొట్టు, ఆ సన్ గ్లాసెస్, ఆ బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే, ఇది కేవలం హీరో పక్కన పాటలు పాడుకునే హీరోయిన్ పాత్ర కాదని, కథలో చాలా పవర్ ఉన్న రోల్ అని అర్థమవుతోంది. అందుకే మేకర్స్ ఆమె క్యారెక్టర్‌ను "ఫియర్స్ అండ్ ఫియర్‌లెస్"అని పిలుస్తున్నారు. డైరెక్టర్ బుచ్చిబాబు సానా తన గురువు సుకుమార్ స్టైల్‌లోనే, హీరోయిన్ పాత్రలను చాలా బలంగా డిజైన్ చేసినట్లున్నాడు. 'ఉప్పెన'లో 'బేబమ్మ' పాత్రకు ఎంత ఇంపార్టెన్స్ ఇచ్చాడో, ఇప్పుడు 'అచ్చియమ్మ' పాత్రను కూడా అంతే పవర్‌ఫుల్‌గా మలిచాడని ఈ లుక్ ప్రూవ్ చేస్తోంది.

# ఆహార భద్రతలో మహిళది కీలకపాత్ర

**ఆహార భద్రత... ప్రతి వ్యక్తికీ తగినంత ఉత్పత్తిలో, సురక్షితమైన, పోషకాలతో కూడిన ఆహారం లభించే హక్కు దీన్లో ఆహారంతోపాటు నిల్వ, పంపిణీ, వినియోగం... ఇలా అన్ని అంశాలూ ఉంటాయి. వీటిని సాధించడంలో మహిళది కీలకపాత్ర. కానీ కష్టానికి తగ్గ ప్రతిఫలం, గుర్తింపు, ప్రోత్సాహం ఆ అన్నపూర్ణకు లభించడం లేదు.**



భారతదేశ జనాభాలో సుమారు 70 శాతం మంది మహిళలు గ్రామీణ ఉత్పత్తులను సమకూర్చారు. వీరిలో చాలా మంది వ్యవసాయ రంగంలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. వ్యవసాయ శ్రామికశక్తిలో సుమారు మూడో వంతు మహిళల విత్తనాలు నాటడం, కలుపు తీయడం, కోత, విత్తన సంరక్షణ, పశుపోషణ, పంటల వంటి నిల్వ బాధ్యతల్లో మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారు. ఆహార ఉత్పత్తిలోనే కాదు, వినియోగం, పోషణ, కుటుంబ ఆరోగ్యంలో కూడా మహిళలదే ప్రధాన బాధ్యత. మహిళలు స్థానిక విత్తన వైవిధ్యాన్ని, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను పాటిస్తూ పర్యావరణ మార్పును కాపాడుతున్నారు. చిన్న స్థాయి కూరగాయలు, కమ్యూనిటీ సీడ్ బ్యాంకులు కుటుంబాలు, సమాజ స్థాయిలో ఆహార భద్రతను బలోపేతం చేస్తున్నారు. ప్రపంచ ఆహార సంస్థ(ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ఎఫ్ఎఓ) ప్రకారం, మహిళలకు పురుషులతో సమాన స్థాయిలో వనరులు, సాంకేతిక పరిజ్ఞానం అందిస్తే, వ్యవసాయం ఉత్పాదకత 20-30 రెట్లు పెరిగే అవకాశం ఉంది. ఆహార భద్రత పరంగా మహిళల సహకారం ఎంతో ఉంటుంది, ఆ విధంగా వారు అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. భారత్‌లో మహిళల పేరుపై 13 వ్యవసాయ భూమి ఉంది. సాగుపై ఆసక్తి ఉన్నప్పటికీ సామాజిక నిబంధనలు వారిని చాలాచోట్ల గృహపరమైన పనులకు పరిమితం చేస్తున్నాయి.

**ఆ ప్రోత్సాహం సరిపోతుందా? ...** దేశ ఆహార భద్రతను బలోపేతం చేయాలంటే మహిళలకు వనరులు, విద్య, ఆరోగ్యం, నిర్ణయ శక్తి అందించాలి. వారు సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాల ద్వారా కలిసి పనిచేస్తే, సామూహిక శక్తి పెరుగుతుంది. వారి మాటకు విలువ వస్తుంది. మహిళలకు భూమి హక్కులు, రుణ సౌకర్యాలు, శిక్షణా కార్యక్రమాలు, పోషకాహార అవగాహన కార్యక్రమాలు అందించడం ద్వారా ఆహార ఉత్పత్తి, నిల్వ, పంపిణీ వ్యవస్థలు బలోపేతం అవుతాయి. తారలుగా మహిళలు ఆహార భద్రతకు వెన్నెముకగా నిలుస్తున్నారు. హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఫర్ బెటర్ ఫుడ్ అండ్ ఎ బెటర్ ఫ్యూచర్ 2025 ఆహార దినోత్సవ నినాదం. ఆహార భద్రతను సాధించడానికి ప్రభుత్వాలూ, ఎన్జీఓలూ, బోర్డులలూ... చేతులు కలపాలంటోంది ప్రపంచ ఆహార సంస్థ. అందులో మహిళలకూ చోటుండాలి. మహిళా సాధికారతకు సహకరించడం వల్ల ఆకలి, పేదరికం, పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించవచ్చు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజం స్థిరమైన అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంది. మహిళా సాధికారతతోనే ఆహార భద్రత, దేశాభివృద్ధి సుసాధ్యం. □

# అక్రమార్కుల గుండెల్లో 'లేడీ సింగం'

**వరుస బదిలీలు, బెదిరింపులే కాదు... చంపడానికి దాడులు చేశారు. కానీ ఆమె ఏమాత్రం భయపడ లేదు. సరికదా... అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టించారు. ఆమె ఉంటే చాలు ధైర్యం అన్న నమ్మకాన్ని స్థానికుల్లో కలిగించారు. 'లేడీ సింగం' అని వాళ్లతో అనిపించుకున్నారు... ఐఎఫ్ఎస్ ఆఫీసర్ శ్రద్ధా పండరే!**




2021..మోరెనా జిల్లాలో చంబల్ శాంక్చురీకి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్నారు. శ్రద్ధ. వచ్చి రెండు నెలలే. కానీ ఇసుక, రాళ్ల మాఫియాపై దృష్టిసారించారు. ఈ మాఫియా చేతిలో ఇప్పటికే చాలామంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. స్థానికులకి వాళ్లంటే భయమే. అలాంటి వాళ్ల మీద రైడ్‌లు జరిపి, వాళ్లలో వణుకు పుట్టించారు. ఆమె అడ్డు తొలగించడానికి మూడు నెలల్లో 11 దాడులు చేశారు. చావు అంచుల వరకూ వెళ్లినా ఆమె భయపడ లేదు. స్థానికుల్లోనూ ధైర్యం నింపారు. తరవాత చిచోలీ, బేతుల్‌కి బదిలీమీద వెళ్లినప్పుడు టేకు స్మగ్లింగ్‌ని అడ్డుకున్నారు. ఇక్కడ బెదిరింపులే! అయినా ఆమె తీరు మాత్రం మారలేదు.

**గిరిజన అమ్మాయి....** మధ్యప్రదేశ్‌లోని బిలాతోల అనే చిన్న గ్రామం శ్రద్ధ. నక్సల్ ప్రాంతమది. గిరిజన అమ్మాయి. అయితేనేం తనకంటూ గుర్తింపు తెచ్చుకోవాలనుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో... గిరిజన హాస్టళ్లలో ఉంటూ చదువుకున్నారు. బీఎస్సీ తర్వాత సివిల్స్ రాసి ఇండియన్ ఫారెస్ట్ సర్వీసుకు ఎంపికయ్యారు. దేహ్రాదూన్‌లోని ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. అనంతరం బాధ్యతలు తీసుకున్న ఆమె... బెరుకులేని మనస్తత్వంతో అందరినీ ఆకర్షించారు. సవాళ్లు ఎన్ని ఎదురైనా వెనుదిరగని తత్వం శ్రద్ధ సొంతం. అదే ఆమెను దేశానికి పరిచయం చేసింది. ప్రస్తుతం సౌత్ షాడోల్‌లోకి డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా చేస్తున్నారీమె. 'బెదిరింపులు, దాడులు నాకు కొత్తేమీ కాదు. అలాగని బెదిరిపోయే మనస్తత్వమూ నాది కాదు. అడవులను కాపాడటం నా బాధ్యత. దాన్ని నిర్వర్తించడంపైనే నా దృష్టంతా' అంటారీమె.

**బదిలీ శిక్ష కాదు...** చంబల్ శాంక్చురీలో పనిచేస్తున్నప్పుడు రెండు నెలల్లో దాదాపు 80 ఇసుక అక్రమ రవాణా వాహనాలను సీజ్ చేశారు. ప్రమాదమన్నా వెనకాడరు. ముందుండి టీమ్ని నడిపిస్తారు. ఈ తీరు తట్టుకోలేక దాడులు. అయినా తలొగ్గకపోతే బదిలీలు. ఇలా ఇప్పటివరకు ఆమె మారిన ప్రాంతాలెన్నో. ఆమె మాత్రం బదిలీని నేనెప్పుడూ శిక్షగా భావించాను, ప్రదేశం మారుతుందంటే. నా యుద్ధం మాత్రం కొనసాగు తూనే ఉంటుంది అంటారు 36ఏళ్ల శ్రద్ధ గత ఏడాది సౌత్ షాడోల్‌కి మారిన ఆమె జంతు హింస, మూగ జీవుల అక్రమరవాణాపై దృష్టిపెట్టారు. తాబేళ్లు, పంగోలిన్స్ (అలుగు)లను అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాలను జైలుకి పంపారు. తాజాగా వాళ్లకు సాయపడుతున్న అధికారులనీ వదిలి పెట్టలేదామె. పైగా చట్టం ముందు అందరూ సమానులేఖ అని చెబుతారు. ఇలా చేస్తూ ప్రభుత్వానికి ఆదాయం పెంచడమే కాదు... అక్రమార్కులకీ గట్టి మెసేజ్ ఇస్తున్నారామె. 'అడవులంటే కేవలం చెట్లు, నదులే కాదు. అదో జీవన విధానం. వాటిని కాపాడుకోవడమంటే మన భవిష్యత్తును మనం రక్షించుకోవడమే' అనే శ్రద్ధ గొప్ప అధికారిణి మాత్రమే కాదు.. ధైర్యం పట్టుదలకు నిదర్శనం. కాబట్టే, ఆమె పనిచేసిన చోట అమ్మాయిలు ఆమెను ఆదర్శంగా తీసుకుంటారు. 'అమ్మాయిని అని మీకు మీరు తక్కువ చేసుకోకపోతే ఎవరూ తక్కువ చేయలేరు' అనే ఆమెను 'లేడీ సింగం'గా పిలుచుకుంటారు. ఆమె కథ వాళ్లకే కాదు, ప్రతి అమ్మాయికీ స్ఫూర్తిదాయకమే కదూ. □

# ఈ నీళ్లతో అందం, ఆరోగ్యం

**విటమిన్లు, ఖనిజలవణాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఇతర ఆరోగ్యకరమైన పోషకాలెన్నో బెండకాయ నీళ్లలో పుష్కలంగా ఉన్నాయి. చర్మ ఆరోగ్యాన్ని సంరక్షించే, మెనోపాజ్ తర్వాత వచ్చే ఎముకల బలహీనతను తగ్గించే, హృద్రోగాన్ని దరికిరానివ్వని ఈ నీళ్ల గురించి తెలుసుకుందాం.**



ఎ, సి, కె విటమిన్లు, మెగ్నీషియం, పొటాషియం, కాల్షియం ఇతర ఖనిజలవణాలు బెండకాయ పుష్కలంగా ఉంటాయి. వీటివల్ల ఆరోగ్యకరమైన ప్రయోజనాలెన్నో పొందొచ్చు. అయితే దీన్ని ఆహారంలో తీసుకోవడానికి ఇష్టపడనివారు ఈ ప్రయోజనాల కోసం దూరమైనట్లే. అలాకాకుండా. ఉండాలంటే ఈ వంటకానికి ప్రత్యామ్నాయంగా కప్పునీటిలో గుప్పెడు బెండకాయ ముక్కలను రాత్రంతా నానబెట్టి, ఉదయాన్నే వడకట్టి ఆ నీటిని తీసుకుంటే చాలు. అందం, ఆరోగ్యం మన సొంతమవుతుందంటున్నారు నిపుణులు.

**ఆరోగ్యపరిరక్షణలో..** బెండకాయ ముక్కల నీటిలో విటమిన్, యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి. ముఖంలో వృద్ధాప్యఛాయలను త్వరగా దరికిరానివ్వవు. చర్మాన్ని మృదువుగా, తేమగా ఉంచుతాం. ఈ నీటిలో ఫ్లేవనాయిడ్లు శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని ఎదుర్కోవడానికి సహాయపడుతుంది. ఇందులోని పీచు త్వరగా ఆకలి వేయకుండా చేస్తుంది. అలాగే ఎక్కువగా ఆహారాన్ని తీసుకోకుండా పొట్ట నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. ఈ నీళ్ల జీర్ణక్రియ మెరుగ్గా జరిగేలా చేసి మలబద్ధకాని నివారిస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గించడంలోనూ ఈ నీళ్ల సహాయపడతాయి. దీనివల్ల అధికబరువు సమస్య రాదు. అంతేకాదు, ఇందులోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. దీనితో హృద్రోగ సమస్యలకు గురి అయ్యారు. ఈ నీటిలోని ఖనిజలవణాలు కండరాల పనితీరును మెరుగుపరుస్తాయి. మెనోపాజ్ తర్వాత వచ్చే ఎముకల బలహీనతను తగ్గించి ఆరోగ్యంగా ఉంచుతాయి. అలాగే ఇందులోని విటమిన్లు రోగనిరోధక వ్యవస్థను పెంచడంలో సహాయపడతాయి. విటమిన్ 'సి' తరచుగా జలుబు, జ్వరం సహా ఇతర ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడేందుకు అవసరమైన రక్షణ కల్పిస్తుంది. దీనితోపాటు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో. క్యాన్సర్‌ను నిరోధించే లక్షణాలూ ఇందులో మెండుగా ఉన్నాయి. □

# శుభ్రం చేయడం సులువిక !



వంట చేయడం ఒక ఎత్తయితే ఆ పాత్రలన్నీ శుభ్రం చేయడం మరొకటి. వాటనడిని కడిగేసరికి ఎక్కడలేని అలసట ఆవహిస్తుంది. అందుకే ఇలాంటి సమస్యలకి ఈ తరం వాళ్లు స్మార్ట్ పరిష్కారాలను వెతుకుతున్నారు. అలాంటి వంటింటి నేస్తమే ఈ 'సోప్ అండ్ స్క్రాబ్ డిష్ వాషర్' కూడా. కొన్ని వస్తువులు చూడటానికి చిన్నవిగా ఉంటాయి. కానీ, అవి ఇచ్చే ప్రయోజనాలు మాత్రం బోలెడు. ఈ డిష్ వాషర్ కూడా ఆ కోవకు చెందినదే. ఇదివరకు సబ్బు, స్క్రాబ్ వేరుగా ఉండేవి కదా! కానీ ఈ గ్యాడ్జెట్‌లో రెండు జతగా వస్తాయి. మధ్యలో ఉన్న కంటెయినర్లో లిక్విడ్‌ను నింపి, మూత పెట్టేయాలి. అడుగున స్టీల్ పీచు అమర్చి ఉంటుంది. పాత్రలు శుభ్రం. చేసేటప్పుడు కంటెయినర్ పైన ఉండే బటన్ నొక్కితే సోప్ పాత్రలోకి వస్తుంది. దాంతో తోమితే సరి. పట్టుకోవడానికి గ్రిప్ ఉంటుంది. నచ్చితే ఆన్‌లైన్‌లో వెతికేయండి మరి. □

# పిల్లల బాక్సులో పోషకాలు

**పిల్లల స్కూళ్లకు లంచ్ బాక్స్‌లో ఏం పెట్టాలా అనే ఆలోచనే తల్లులది. ఇంట్లో అమ్మ తినిపిస్తేనే సరిగా తినని చిన్నారులు. బడిలో ఇష్టంగా తినేలా చేయడమంటే మాటలేం కాదు. పోషకాలు అందేలా.. ఆ రుచుల్ని వారు మెచ్చేలా ఈ రెసిపీలు ప్రయత్నించి చూడండి.**

## లిటిల్ మిల్లెట్ డంప్లింగ్ ..

**కావలసినవి.** సామలు ముప్పావు కప్పు, పెసరపప్పు పావు కప్పు నీళ్లు సరిపడ, బాదం పలుకులు మూడు టేబుల్ స్పూన్లు, ఉప్పు: తగినంత, పసుపు: చిటికెడు పచ్చిమిర్చి నాలుగు, నూనె రెండు టీ స్పూన్లు,

**తాలింపు కోసం:** సెనగపప్పు, మినపప్పు రెండు టీ స్పూన్ల చొప్పున, జీలకర్ర, ఆవాలు అరచెంచా చొప్పున, కరివేపాకు రెబ్బ తయారీ, సామలు, పెసరపప్పుల్ని విడివిడిగా పది నిమిషాలు నానబెట్టు కోండి. తర్వాత వాటిని శుభ్రంగా కడిగి నీళ్లు పారబోసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు బాణలీని పొయ్యి మీద నూనె వేసి వేడి చేయాలి. తాలింపు గింజల్ని వేసి ఆవాలు చిటపటలాడుతున్నప్పుడు పెసరపప్పు, సామల్ని కూడా వేసి వేయించాలి. రెండు నిమిషాలాగి బాదం పప్పు ఆపై ఉప్పు, పసుపు, సన్నగా తరిగిన పచ్చిమిర్చి కూడా చేర్చి మరికొద్ది సేపు మగ్గనివ్వాలి. ఆదయ్యాక రెండు కప్పుల నీళ్లు పోసి మరో 18 నిమిషాలు ఉడికించాలి. ఆపై పొయ్యిని సిమ్లో కాసేపు ఉంచాక దింపేయాలి. ఈ మిశ్రమం వేడి తగ్గాక... కొద్ది కొద్దిగా మిశ్రమాన్ని తీసుకుని మనకు నచ్చిన ఆకృతుల్లో డంప్లింగ్స్ చేసుకోవచ్చు. వీటిని ఇడ్లీ పాత్రలో... పెట్టి ఆవిరి మీద ఉడికిస్తే చాలు, రుచికి రుచి ఆరోగ్యం.



## మునగాకు ఎగ్‌రోల్



**కావలసినవి:** గుడ్లు నాలుగు, మునగాకులు కప్పు, ఆల్ పర్పస్ ఫ్లోర్ (మైదా) టేబుల్ సూన్ ఉప్పు రుచికి సరి పోతుంది, మిరియాల పొడి అరటీ స్పూను, పచ్చిమిర్చి రెండు (సన్నగా తరిగి నవి), చీజ్ పావు కప్పు నూనె, తగినంత

**తయారీ:** మందపాటి గిన్నెను పొయ్యి మీద నూనె పెట్టి వేడి చేయాలి. దాంట్లో మునగాకులు వేసి ఒక నిమిషం మగ్గనిచ్చి ఉప్పు చల్లాలి. ఆకుల్లో తేమంతా ఆవిరైపోయే ఉంచి తర్వాత స్టౌ ఆపేయాలి. మరో గిన్నెలోకి మైదా, పచ్చిమిర్చి, గుడ్లు, ఉప్పు, మిరియాలతో బాగా కలిపి పక్కన పెట్టాలి. ఇప్పుడు స్టౌ ఆన్ చేసి పెనం వేడెక్కాక గుడ్డు మిశ్రమం ఆమ్లెట్ వేసుకోవాలి. పైన మగ్గించి పక్కన పెట్టుకున్న మునగాకుల్ని చల్లి... దాని మీద చీజ్ తురిమి వేయాలి. పెనాన్ని అల్యూమి నియం ఫాయిల్‌తో కప్పి... రోల్ బాగా కాలేదాకా ఉన్నా కనీసం పది నిమిషాల సమయమైనా పడుతుంది. తర్వాత దీన్ని తీసి రోల్ చేసుకోగా కత్తిరించి లంచ్ బాక్స్‌లో పెడితే సరి. దీన్ని మామిడి పండు స్మూథీతో కలిపి తింటే భలేగా ఉంటుంది. పిల్లలూ ఇష్టపడతారు. మునగలోని క్యాల్షియం ఎముకల బలానికి తోడ్పడితే, గుడ్డుల విటమిన్ ఎ, సిలు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి.

## చనా పులావ్



**కావలసినవి:** బాస్మతీ బియ్యం కప్పు, తెల్ల సెనగలు కప్పు, ఉల్లిపాయ ఒకటి, అల్లం వెల్లుల్లి పేస్ట్ చెంచా, పచ్చిమిర్చి రెండు, నిమ్మరసం టేబుల్ స్పూన్, కొత్తిమీర తరుగు కొద్దిగా, ఉప్పు తగినంతగా, నెయ్యి రెండు టేబుల్ స్పూన్లు, దాల్చిన చెక్క చిన్న ముక్క, జీలకర్ర పావుచెంచా, లవంగాలు రెండు, యాలకులు రెండు, బిర్యానీ ఆకు ఒకటి, అనాస పువ్వు ఒకటి

**తయారీ:** కొమ్ము సెనగల్ని రాత్రంతా నానబెట్టాలి. బాస్మతీ బియ్యాన్ని ఉడికించే పదినిమిషాల ముందు నానబెడితే సరిపోతుంది. ముందుగా ఉల్లిపాయ, పచ్చిమిర్చి నిలువుగా కోసి పెట్టుకోవాలి. అడుగు మందంగా ఉన్న పాత్ర తీసుకుని పొయ్యి మీద పెట్టి వేడి చేసి నెయ్యి వేసుకోవాలి. తర్వాత లవంగాలు, యాలకులు, బిర్యానీ ఆకు, అనాస పువ్వు, దాల్చిన ముక్క జీలకర్ర కూడా చేర్చి వేగనివ్వాలి. అదయ్యాక ఉల్లిపాయలు, పచ్చిమిర్చి రంగు మారే వరకూ వేయించాలి. ఆపై అల్లం వెల్లుల్లి పేస్ట్ కూడా వేసి పచ్చి వాసన పోయే వరకూ ఉంచాలి. ఇప్పుడు నీటిని వార్చి బియ్యం, సెనగలు, ఉప్పు వేసి రెండు నిమిషాలు మగ్గనిచ్చి రెండు కప్పుల నీళ్లు పోయాలి. అందులో కాస్త నిమ్మరసం కూడా చేర్చాలి. దీన్ని సన్నటి మంట మీద ఉంచి ఊడిస్తే...సరి. చివరగా కొత్తిమీర తరుగు చల్లితే చనా పులావ్ రెడీ. దీన్ని బాక్సులో పెడితే పిల్లలు ఇష్టంగా తింటారు. ఇది హై ప్రొటీన్ ఆహారం కాబట్టి రోజంతా చురుగ్గానూ ఉంటారు.

## మష్రూమ్ పాస్తా...



**కావలసినవి:** మష్రూమ్స్, పాస్తా ఒక్కో కప్పు చొప్పున, మైదా, వెన్న టేబుల్ స్పూన్ చొప్పున, వెల్లుల్లి రెబ్బలు రెండు, ఉల్లిపాయ ఒకటి, పాలు కప్పు, చీజ్ పావు కప్పు, మిరియాల పొడి టీస్పూన్, ఉప్పు తగినంత, కొత్తిమీర తరుగు కొద్దిగా

**తయారీ:** ముందుగా పాస్తాను ఉడకబెట్టి పక్కన పెట్టుకోవాలి. పాన్‌లోని వెన్న వేడయ్యాక తరిగిపో వెల్లుల్లి, మష్రూమ్ ముక్కలు వేసి మగ్గనివ్వాలి. తర్వాత పాలుపోసి ఐదు నిమిషాలపాటు ఉడకనివ్వాలి. ఈ మిశ్రమం ఉడికి దగ్గరపడుతుండగా తరిగిన చీజ్, మిరియాల పొడి, ఉప్పు, ఉడకబెట్టిన పాస్తా కూడా వేసి మరోసారి కలపాలి. చివరగా కాస్త కొత్తిమీర చల్లుకుంటే. వేడివేడి క్రీమీ మష్రూమ్ పాస్తా రెడీ పాస్తా, పుట్టగొడుగుల్లో ప్రొటీన్‌తో పాటు ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. ఇందులోని విటమిన్, ఫోలెట్... పిల్లల ఎదుగుదలకు కీలకంగా ఉపయోగపడతాయి.

## పనీర్ టిక్కా

**కావలసినవి:** పనీర్ తురుము కప్పు, బంగాళాదుంప ఒకటి (పెద్దది), ఉల్లిపాయ ఒకటి, పచ్చిమిర్చి రెండు, క్యారెట్ తురుము టేబుల్ స్పూన్, కొత్తిమీర తురుము కొద్దిగా, కారం టీస్పూన్, గరం మసాలా అర టీస్పూన్, ఆమ్చూర్ అర టీస్పూన్, అల్లం అంగుళం ముక్క, ఉప్పు తగినంత, మిరియాల పొడి పావు టీస్పూన్, కార్న్ ఫ్లోర్ అర కప్పు, మైదా రెండు టేబుల్ స్పూన్లు, బ్రెడ్ క్రాంబ్స్ అర కప్పు, నూనె వేయించడానికి సరిపడా, వాము కొద్దిగా,



**తయారీ:** గిన్నెలో పన్నీర్ తురుము, ఉడికించి మెదిపిన బంగాళాదుంప ముద్ద, సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, క్యారెట్, కొత్తిమీర తురుము, కారం, గరం మసాలా, ఆమూర్ పొడి, అల్లం తురుము, ఉప్పు, టేబుల్ స్పూన్ కార్న్ ఫ్లోర్ వేసి బాగా నీళ్లు పోయకుండా. ముద్దలా చేయాలి. స్టవ్ మీద కడాయి పెట్టి సరిపడా నూనె పోసి, వేడి చేయాలి. ఒక గిన్నెలో మైదా, కార్న్ ఫ్లోర్, వాము, కొద్దిగా ఉప్పు, మిరియాల పొడి వేసి తగినన్ని నీళ్లు పోసి జారుగా కలపాలి. పనీర్ మిశ్రమాన్నికొద్దికొద్దిగా తీసుకుని అరచేత్తో టిక్కాల్లా ఒత్తుకుని ముందుగా మైదా మిశ్రమంలో ముంచి, బ్రెడ్ క్రాంబ్స్ దొర్లించాలి. వీటిని దొరగా కాల్చుకుంటే వేడివేడి పనీర్ టిక్కాలు సిద్ధం. □

## చెలి చిట్కాలు

★ పిల్లలు భరించ లేనంత అల్లరిచేస్తే చికాకు కలిగిస్తే వారిని తిట్టికొట్టి అణచి వేయకుండా వారి ప్రవర్త నకు కారణాలు తెలుసుకోవాలి.

★ ఇంట్లో శుభకార్యాలు జరిగేటప్పుడు ముందురోజు పిల్లలను ఎక్కువ సేపు మేలుకోనీయ రాదు. ఎందువలనంటే అలసట వచ్చి మర్నాడు వారి ప్రవర్తనలో మార్పు వస్తుంది.,

★ ఇంట్లో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలుంటే విడివిడిగా వారితో తల్లితండ్రులు కొంతసేపు గడపాలి. వారి మధ్య పోట్లాటలు లేకుండా బుజ్జగించడం అలవాటు చేసుకోవాలి. □

# ఇతరులను ప్రోత్సహించే మనసు ఉందా?

అంతర్వాణి



'అతడు (సౌలు) యెరూషలేము లోనికి వచ్చి శిష్యులతో కలిసి కొనుటకు యత్నము చేసెను గాని, అతడు శిష్యుడని నమ్మక అందరును అతనికి భయపడిరి. అయితే బర్నబా అతనిని దగ్గరతీసి అపొస్తలులయొద్దకు తోడుకొనివచ్చి- అతడు త్రోవలో ప్రభువును చూచెననియు, ప్రభువు అతనితోమాట లాడెనని...తెలియపరచెను' (అపొస్తలుల కార్యములు 9:26,27,28), 'అంతట అతడు (బర్నబా) సౌలును వెదకుటకు తార్సునకు వెళ్లి అతనిని కనుగొని అంతియొకయకు తోడుకొని వచ్చెను. వారు కలిసి యొక సంవత్సరమంతయు సంఘములో ఉండి బహుజనులకు వాక్యమును బోధించిరి' (అపొ 11:25,26). ఈ రెండు సంఘటనలలో బర్నబా అనే యేసుక్రీస్తు శిష్యుడు సౌలును చేరదీసిన విధానం, ఆదరించిన విషయాన్ని గమనించవచ్చు. సౌలు ఒకప్పుడు ప్రభువును విశ్వసించిన వారిని హింసిం చాడు. వారిని హతమార్చేందుకు కూడా వెనుదీయని ఓ మతోన్మాది. ఇలాంటి సౌలును దేవుడు దర్శించిన తర్వాత యేసుక్రీస్తు శిష్యుడిగా, పరిచారకుడిగా మారాడు. ఈ సౌలు సువార్తను బోధించే దుకు శిష్యులతో కలిసి పనిచేసేందుకు ప్రయత్నించాడు. కానీ వారు సౌలును నమ్మలేదు. ఇతడు మారాడు, ప్రభువు సేవ చేసేందుకు యత్నిస్తున్నాడని నమ్మకపోవడంతో బర్నబా ఇతడిని చేరదీసాడు. సౌలును పేతురు,యోహాను తక్కిన శిష్యులకు పరిచయం చేసింది, ప్రోత్సహించింది బర్నబా. ఇతని ప్రోత్సహం లేకపోతే సౌలు జీవితం ఎలా ఉండేదో తెలియదు. దేవుడు తాను ఉద్దేశించినవాటిని నెరవేర్చుకునేందుకు కొందరిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంటాడు. అలాంటివారిలో బర్నబా ఒకరు. నేడు మన సంఘాల్లో కూడా తోటి విశ్వాసులను, భక్తులను ఆదరించేందుకు, ప్రోత్సహించేందుకు, వారిని క్రీస్తు పరిచర్యలో పాలిభాగస్తులుగా చేసేందుకు సంఘ పెద్దలు, సేవకులు కృషి చేస్తున్నారు. ఒకప్పుడు సేవకులు, పెద్దలు సంఘ విశ్వాసుల పట్ల ఎంతో ప్రేమ, అభిమానం, ఆదరణ, ప్రోత్సహాన్ని చూపేవారు. నేడు ఇలాంటి ఆదరణ కొరవడుతున్నది. ప్రత్యేకంగా కొందరి సేవకుల్లో స్వార్థం తారాస్థాయికి చేరుకుంటున్నది. వారు కేవలం తమ కుటుంబసభ్యులను మాత్రమే సంఘాల్లో హైలైట్ చేసుకుంటున్నారు. దేవుడు వారికి మాత్రమే తలాంతులను ఇచ్చినట్లు ఇతరులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రాధాన్యత లేని పనుల్లో విశ్వాసులను వాడుకుంటున్నారు. ప్రాధాన్యత ఉన్నవాటిలో వీరు ఏమాత్రం కనిపించరు. అసలు దేవుడు ఎవరికి ఎలాంటి టాలెంట్ ఇచ్చాడో గమనించి, ప్రోత్సహించేంత ఆసక్తి పెద్దల్లో కానీ, సేవకల్లో కాని పెద్దగా ఉండడం లేదు. ఏదో కొద్దిమందికి మాత్రమే ఆ భారం ఉంటుంది. సంఘంలో అందరూ సమానమే. అందరూ ముఖ్యమే. అందరూ దేవుడికి కావాల్సిన వారే. ఆదిఅపొస్తలుల సేవ ప్రపంచమంతటా విస్తరించేందుకు కారణం ఏమిటి? వారు దేన్నీ తమదిగా భావించలేదు. ఇదంతా ప్రజలదే, దేవుడికి అందరూ అవసరమే అని గ్రహించారు కాబట్టే అందరినీ తమలో కలుపుకున్నారు.

-పి.వాణిపుష్ప

# నేడే బిగ్ ఫైట్

## దక్షిణాఫ్రికా, భారత్ మధ్య హోరాహోరీ




**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచ కప్-2025 ఫైనల్లో టీమిండియాకు దక్షిణాఫ్రికాకు మధ్య తుది పోరు జరగనుంది. ఈ నెల 2వ తేదీన జరిగే ఈ ఫైనల్ పోరులో ట్రోఫీ దక్కించుకుని టీమిండియా చరిత్ర సృష్టిస్తుందని యావత్ భారత్ ఉత్కంఠతతో ఎదురు చూస్తోంది. ఇదే సమయంలో లారా వాల్వార్ట్, కాప్ వంటి సఫారీ స్టార్‌లను నిలువరించడమే భారత్ ముందున్న అతి పెద్ద సవాల్.

అయితే భారత్‌తో తలపడనున్న సఫారీ సేన కూడా ఇప్పటి వరకు ఐసీసీ వన్డే ప్రపంచ కప్‌ను ఒక్కసారి కూడా అందుకోలేదు. సౌతాఫ్రికా జట్టు ప్రధాన బలం కెప్టెన్ లారా వాల్వార్ట్. ఈ వన్డే ప్రపంచ కప్‌లో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో అగ్రస్థానం ఆమెదే. సెమీస్‌లో ఇంగ్లండ్‌పై ఏకంగా 169 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడింది. మొత్తంగా 8 మ్యాచ్‌లు ఆడిన లారా 470 పరుగులు చేసింది. ఆమెను కట్టడి చేయగలిగితే మిగతా వారిని అడ్డుకోవడం సులువు అవుతుంది. అలాగే ఆ జట్టు ప్రధాన పేసర్ కాప్ చురకత్తుల్లాంటి బంతులను సంధిస్తూ ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తుంది. అత్యంత బలమైన ఇంగ్లండ్ బ్యాటింగ్ లైనప్ కకావికలం చేయడంలో కాప్‌దే కీలక పాత్ర. ఆమెతో పాటు ఖాఖా కూడా చాలా డేంజర్. వీరిద్దరితో టీమిండియా కాస్త చూసుకుని జాగ్రత్తగా ఆడాల్సిందే. నదినె డి క్లార్క్, ట్రెయన్ కూడా డేంజరేస్ బ్యాటర్లే. అందుకే రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్ టాప్ ఆర్డర్ పని పడితే, స్పిన్నర్లు శ్రీ చరణి, దీప్తి శర్మ, రాధ యాదవ్ మిగతా బ్యాటర్లను ఔట్ చేసే పనిలో ఉండాలి. స్మృతి మంధాన, జెమీమా, హర్మన్, రిచా, దీప్తి శర్మ టీమిండియా బ్యాటింగ్ లైనప్, షెఫాలీ వర్మ దూకుడు అద్భుతం.

కాప్, ఖాఖా బౌలింగ్‌ను స్మృతితో కలిసి షెఫాలీ ఎలా ఎదుర్కొంటునేదే ప్రశ్న. ఆఖర్లో రిచా ఘోష్ మెరిస్తే తిరుగుండదు. సఫారీల బౌలింగ్ ఎటాక్‌ను భారత బ్యాటర్లు పంచుకుంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా విజయం సాధించొచ్చు.



### ఇంగ్లండ్‌పై 3-0తో వన్డే సిరీస్

## కివీస్ క్లీన్ స్వీప్

**న్యూఢిల్లీ:** వన్డేలో ఇంగ్లండ్‌కు ఘోర పరాభవం ఎదురైంది. న్యూజిలాండ్ చేతిలో చిత్తయింది. ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో 2 వికెట్లు తేడాతో న్యూజిలాండ్ విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో కివీస్ క్లీన్ స్వీప్ చేసింది. వెల్లింగ్టన్ వేదికగా శనివారం జరిగిన చివరి వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో కేవలం 222 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంగ్లిష్ జట్టు టాపార్డర్ విఫలమైనప్పటికీ ఆల్‌రౌండర్ జెమీ ఓవర్టన్ అద్భుత ప్రదర్శన కనపరిచాడు. అతడు 62 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 68 పరుగులు చేశాడు. అతడితో పాటు, జోస్ బట్లర్ (38), బ్రైడన్ కార్స్ (36) ఫర్వాలేదనిపించారు. న్యూజిలాండ్ బౌలర్లలో బ్లెయిర్ టిక్నర్ 4 వికెట్లు, జాకబ్ డఫీ 3, జకారీ ఫౌల్క్స 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ కూడా కాస్త తడబడింది. ఓపెనర్లు రచిన్ రవీంద్ర (46), డెవాన్ కాన్వే (34) తొలి వికెట్‌కు 78 పరుగులు జోడించారు. దీంతో బ్లాక్ క్యాప్స్ ఈజీగా గెలుస్తుందని అంతా భావించారు. కానీ న్యూజిలాండ్ వరుస క్రమంలో వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కివీస్ 118 పరుగుల వ్యవధిలో 8 వికెట్లు కోల్పోయింది. అయితే టెయిలెండర్లు జాకరీ ఫోల్క్స్ (14 నాటౌట్), బ్లెయిర్ టిక్నర్ (18 నాటౌట్) ఆచితూచి ఆడుతూ జట్టును విజయతీరాలకు చేర్చారు. ఫలితంగా ఈ లక్ష్యాన్ని న్యూజిలాండ్ 44.4 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

### ఆసీస్‌తో మూడో టి20..

## సిరీస్ రేస్‌కై ఇద్దరిపై వేటు

### నేటి మ్యాచ్ టీమిండియాకు కీలకం



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లోనూ వెనుకంజలో నిలిచిన టీమిండియా మరో ఆసక్తికరపోరుకు సిద్ధమైంది. హోబర్ట్ వేదికగా ఈ నెల 2న జరిగే మూడో టీ20లో ఆతిథ్య ఆసీస్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుండటంతో ఇది కీలకమైంది. ఇరు జట్ల మధ్య తొలి టీ20 వర్షార్పణం కాగా, రెండో టీ20లో ఆసీస్ 4 వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. చెత్త బ్యాటింగ్‌తో భారత్ 125 పరుగులే చేయగా, ఆసీస్ మరో 40 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. పరిస్థితులు అంచనా వేయకుండా దూకుడుగా ఆడటం టీమిండియాకు నష్టం చేసింది. పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోవడంతో కోలుకోలేకపోయింది. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసు కెళ్లింది. ఈ క్రమంలోనే మూడో టీ20లో విజయం సాధించి సిరీస్ రేసులో నిలవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. దీంతో ఈ సారి కాంబినేషన్‌లో మార్పులు జరుగుతున్నాయి. ముఖ్యంగా టాప్ బౌలర్ అర్షదీప్ సింగ్‌ను కాదని హర్షిత్ రాణాను తొలి 2టీ20లు ఆడించారు. బ్యాటింగ్ డెప్త్ కోసం రాణాను బరిలోకి దించితే బ్యాట్‌తో రాణించినా బౌలింగ్‌లో తేలిపోయి కరెక్ట్ రిజల్ట్ రాలేదు. ఈసారి అతడిని తప్పించి ఆ స్థానంలో స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ఆడించే ఛాన్స్ ఉంది. అలాగే రెండో టీ20లో ధారళంగా పరుగులిచ్చిన కుల్దీప్ యాదవ్‌ను తప్పించి అర్షదీప్ సింగ్‌ను ఆడించవచ్చు. పిచ్‌లు పేస్, బౌన్స్‌కు అనుకూలంగా ఉండటంతో ఇద్దరు స్పెషలిస్ట్ స్పిన్నర్లు అవసరం లేదనేది ఉంది. ఇక మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి సత్తా చాటుతుండటంతో కుల్దీప్‌ను బెంచ్‌కు పరిమితం చేయనుంది. ఒకవేళ కుల్దీప్‌ను కంటిన్యూ చేస్తే రాణా స్థానంలో అర్షదీప్ బరిలోకి దిగుతాడు. ఇక బ్యాటింగ్‌లో విఫలమైనా పెద్దగా మార్పులు చేసే అవకాశం లేదు. ఓపెనర్లుగా శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బరిలోకి దిగనున్నారు. రెండో టీ20లో బ్యాటర్లంతా విఫలమైన వేళ అభిషేక్ ఒంటరి పోరాటం చేశాడు. శుభ్‌మన్ కూడా చెలరేగాల్సి ఉంది. ఈ ఇద్దరూ పవర్ ప్లే పూర్తయ్యే వరకు క్రీజులో ఉంటే భారత్‌కు తిరుగుండదు. మూడో స్థానంలో బరిలోకి దిగిన సంజూ శాంసన్, తొలి టీ20లో చెలరేగి, రెండో టీ20లో మాత్రం రాణించలేని సూర్యకుమార్ సత్తా చాటాల్సి ఉంది. తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్ చెలరేగాల్సి ఉంది. స్పెషలిస్ట్ పేసర్‌గా బుమ్రాకు అర్షదీప్ అండగా నిలవనున్నాడు.



### పారిస్ మాస్టర్స్..

## టైటిల్ పోరుకు సిన్నర్

**న్యూఢిల్లీ:** పారిస్ మాస్టర్స్-2025లో జానిక్ సిన్నర్ దూసుకుపోతున్నాడు. ఇటాలియన్ ఆటగాడు జానిక్ సిన్నర్ 6-3, 6-3 తేడాతో తన ఐదవ సీడ్ ప్రత్యర్థి బెన్ షెల్టన్‌పై విజయం సాధించాడు. తదుపరి అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో తలపడనున్నాడు. పారిస్ మాస్టర్స్‌లో భాగంగా శనివారం జరిగిన సెమీఫైనల్లో రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని డేనియల్ మెద్వెదేవ్‌ను 2-6, 6-3, 7-6 (5) తేడాతో ఓడించాడు. అంతకు ముందు జరిగిన పారిస్ మాస్టర్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో బెన్ షెల్టన్‌పై సునాయాస విజయంతో జానిక్ సిన్నర్ ప్రపంచ నంబర్ వన్ ర్యాంకింగ్‌ను తిరిగి పొందడానికి ఒక అడుగు దగ్గరగా వేశాడు. ప్రస్తుత ఛాంపియన్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో ఘర్షణకు సిద్ధమయ్యాడు. ప్రత్యర్థి కార్లోస్ అల్కరాజ్ రెండవ రౌండ్‌లో కామెరాన్ నోరీ చేతిలో జరిగిన షాక్ ఓటమిని సద్వినియోగం చేసుకోవాలని చూస్తున్న సిన్నర్, ఇండోర్ హార్డ్ కోర్టులలో తన విజయ పరంపరను వరుసగా 24 మ్యాచ్‌లకు విస్తరించాడు. లా డిఫెన్స్ అరీనాలో టైటిల్ గెలుచుకోవడం ద్వారా సిన్నర్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న అల్కరాజ్‌ను అధిగమించేందుకు పట్టుదలతో ఉన్నాడు.

### రెండో టి20లో

## పాకిస్థాన్ గెలుపు

### దక్షిణాఫ్రికా 9 వికెట్ల తేడాతో చిత్తు

**న్యూఢిల్లీ:** రెండో టీ20 ఇంటర్నేషనల్‌లో పాకిస్థాన్ దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. తొమ్మిది వికెట్ల తేడాతో విజయం సాధించిన పాకిస్థాన్, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. శనివారం జరిగిన మూడవ మరియు చివరి మ్యాచ్‌కు ముందు ఆతిథ్య జట్టు 41 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని సాధించింది. బాబర్ అజామ్ 18 బంతుల్లో 11 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో



4,234 పరుగులు చేసి భారత రోహిత్ శర్మను అధిగమించి అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఓపెనర్ సైమ్ అయూబ్ 38 బంతుల్లో 71 పరుగులు చేయగా, సీమర్ ఫహీమ్ అష్రఫ్ 423 వికెట్లు పడగొట్టాడు. టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంపిక పాకిస్తాన్, దక్షిణాఫ్రికా టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చింది. దీంతో 19.2 ఓవర్లలో 110 పరుగులకు ఆలౌట్ అయింది. పాకిస్తాన్ వికెట్ వెలుపల అద్భుతమైన సీమ్‌ను కనుగొన్నందున దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్లలో ఆరుగురు బౌలింగ్‌లో ఉన్నారు. అయితే డెవాల్డ్ బ్రెవిస్ మాత్రమే 16 బంతుల్లో 25 పరుగులు చేసి ముఖ్యమైన ఇన్నింగ్స్‌ను నిర్వహించాడు.

ఫాస్ట్ బౌలర్ సల్మాన్ మీర్జా తన నాలుగు ఓవర్లలో 314 పరుగులు సాధించాడు. ఇదే సమయంలో దక్షిణాఫ్రికా వికెట్ నుండి అదే సహాయాన్ని పొందలేకపోయింది. దీనికి తగినట్లు సైమ్ చక్కటి ఆటతీరుతో పాకిస్తాన్ విజయం వైపు దూసుకుపోయింది. 23 బంతుల్లో 28 పరుగులు చేసిన సాహిబ్‌జాదా ఫర్హాన్ మాత్రమే కార్బిన్ బాష్ బౌలింగ్‌లో లెగ్ బిఫోర్ వికెట్‌గా వెనుదిరిగి ఔటయ్యాడు.

## రూ.5 తగ్గిన వాణిజ్య సిలిండర్‌ధర!

**ముంబయి, నవంబరు 1:** హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు చమురు మార్కెటింగ్ కంపెనీలు స్వల్ప ఊరట కల్పించాయి. 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరను 5 రూపాయల మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి.



సవరించిన ఈ కొత్త ధరలు ఈనెల 1వ తేదీ నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ప్రతి నెల మొదటి తేదీన చమురు సంస్థలు గ్యాస్ సిలిండర్ల ధరలను సమీక్షిస్తుంటాయి. ఈ ప్రక్రియలో భాగంగా ఈరోజు వాణిజ్య సిలిండర్ ధరను తగ్గించాయి. తాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.1,595.50 నుంచి రూ.1,590.50కి చేరింది. ఇతర ప్రధాన నగరాల్లో ధరలను పరిశీలిస్తే కోల్‌కతాలో రూ.1,694, ముంబైలో రూ.1,542, చెన్నైలో రూ.1,750గా ఉంది. ఇక మన హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ కొత్త ధర రూ.1,812.50గా నమోదైంది. ఇళ్లలో వంట కోసం ఉపయోగించే 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుతం దేశంలోని ప్రధాన నగరాల్లో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.850 నుంచి రూ.960 మధ్య స్థిరంగా కొనసాగుతోంది.




### పదోనెలలోనూ రికార్డు స్థాయికి

## జీఎస్టీ వసూళ్లు!

### అక్టోబరులో 1.96 లక్షలకోట్ల రాబడులు

**న్యూఢిల్లీ, నవంబరు 1:** దేశంలో పండగ సీజన్ వేళ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి రికార్డు స్థాయిలో వసూలయ్యాయి. అక్టోబరు నెలలో జీఎస్టీ ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. 1.96 లక్షల కోట్ల ఆదాయం సమకూరింది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే ఇది 4.6 శాతం అధికమని శనివారం విడుదలైన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. వరుసగా పదో నెలలో కూడా జీఎస్టీ వసూళ్లు రూ. 1.8 లక్షల కోట్ల మార్కును దాటడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌అక్టోబరు మధ్య కాలంలో జీఎస్టీ వసూళ్లు 9 శాతం పెరిగి రూ. 13.89 లక్షల కోట్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఈ మొత్తం రూ. 12.74 లక్షల కోట్లుగా ఉంది. రీఫండ్‌లను మినహాయించిన తర్వాత, అక్టోబరులో నికర పన్ను వసూళ్లు రూ. 1.69 లక్షల కోట్లుగా నిలిచాయి. సెప్టెంబరు 22న చేపట్టిన రేట్ల హేతుబద్ధీకరణ తర్వాత పండగ సీజన్‌లో వినియోగదారుల నుంచి బలమైన డిమాండ్ కనిపించిందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించడం వల్లే ఇది సాధ్యమైందని ప్రభుత్వం పేర్కొంది. ఈ ఏడాది వినియోగం 10 శాతానికి పైగా పెరిగే అవకాశం ఉందని, దీనివల్ల అదనంగా రూ. 20 లక్షల కోట్ల మేర కొనుగోళ్లు జరగవచ్చని అంచనా వేస్తున్నారు. పండగ సీజన్‌లో బలమైన డిమాండ్, మెరుగైన పన్ను విధానం, పెరుగుతున్న వినియోగం, సమ్మతి వంటివి అధిక జీఎస్టీ వసూళ్లకు కారణం. వినియోగం, పన్ను చెల్లింపులు సరైన దిశలో పయనిస్తున్నాయనడానికి ఇది ఒక సానుకూల సూచిక అని కేపీఎంజీ ఇండియా భాగస్వామి అభిషేక్ జైన్ అన్నారు. మరోవైపు, ప్రత్యక్ష పన్నుల వసూళ్లలోనూ ఇదే తరహా వృద్ధి కనిపించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు 12 నాటికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 6.33 శాతం పెరిగి రూ. 11.89 లక్షల కోట్లకు చేరాయి. కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ. 5.02 లక్షల కోట్లకు, వ్యక్తిగత పన్ను వసూళ్లు రూ. 6.56 లక్షల కోట్లకు పెరిగినట్లు ఆదాయపు పన్ను శాఖ తెలిపింది.

## నవంబరులో రూ.70వేల కోట్ల ఐపిఒలు!

**ముంబయి, నవంబరు 1:** భారత స్టాక్ మార్కెట్‌లో ఐపీఓల సందడి పెరుగుతోంది. నవంబర్ నెలలోనూ పెద్ద పెద్ద కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. రూ.76వేల కోట్ల విలువైన ఐపీఓలు వస్తున్నట్లు అంచనా. టెక్నాలజీ, రెన్యూవబుల్స్, కన్స్యూమర్ గూడ్స్ సహా అనేక కీలక పెద్ద కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వస్తుండటంతో ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపుతోంది. అలాగే సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు ఈ అక్టోబర్ నెలలో 5 శాతంపైగా పెరగడంతో ఇన్వెస్టర్లు మొగ్గు





చూపుతున్నారు. ఈ క్రమంలోనే దిగ్గజ కంపెనీలు తమ షేర్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. దేశంలోని అతిపెద్ద మ్యూచువల్ ఫండ్ కంపెనీగా ఉన్న ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ రూ.10వేల కోట్ల భారీ ఐపీవోకు సన్నద్ధమవుతోంది. నవంబర్ నెలలోనే ఈ ఐపీఓ వస్తోంది. ఈ కంపెనీలు ఐసీఐసీఐ బ్యాంకుకు 51 శాతం వాటా ఉండగా ప్రుడెన్షియల్ పిఎల్‌సీ సంస్థకు 49 శాతం వాటా ఉంది. ఈ కంపెనీకి ప్రస్తుతం 1.46 కోట్ల కస్టమర్లు ఉన్నారు. 80 శాతాపైగా రిటర్న్ ఆన్ ఈక్విటీ కలిగి ఉంది. ఈ ఐపీఓ క్యాష్ మేనేజ్మెంట్ రంగంలో అతి పెద్ద మైలురాయిగా భావిస్తున్నారు. ఫిన్‌టెక్ సంస్థ గ్రో నవంబర్ నెలలో రూ.6,000- రూ. 8300 కోట్ల పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఈ కంపెనీ విలువ 7 నుంచి 9 బిలియన్ డాలర్ల మధ్య ఉండొచ్చని అంచనా. ప్రస్తుతం ఈ కంపెనీ 5 కోట్లకు పైగా రిజిస్టర్డ్ యూజర్లు కలిగి ఉన్నారు. ఈ కంపెనీ రూ.1,819 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. పేమెంట్ సొల్యూషన్ కంపెనీ ఫైన్ లాబ్స్ రూ.6,667 కోట్లు విలువైన పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఫ్రెష్ షేర్ల జారీతో పాటు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా పీక్ ఎక్స్వీ పార్ట్‌నర్స్, టెమాసెక్, మాస్టర్‌కార్డ్ వంటి ప్రమోటర్లు తమ షేర్లను విక్రయిస్తున్నారు. భారత ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ 'బోట్' నవంబర్‌లో ఐపీఓకు వస్తోంది. సెప్టెంబర్‌లోనే సెబీ అనుమతి పొందింది. కంపెనీకి ఆడియో మార్కెట్లో 33 శాతం, స్మార్ట్‌వాచ్ మార్కెట్లో 15 శాతం వాటా కలిగి ఉంది. రూ.1,200 కోట్లు విలువైన కొత్త షేర్లను జారీ చేస్తోంది. ఆఫర్ ఫర్ సేల్ ద్వారానూ షేర్లు విక్రయిస్తోంది. ఎడ్ టెక్ కంపెనీ ఫిజిక్స్ వాలా నవంబర్ నెలలో రూ.35,000-40,000 కోట్లు విలువైన పబ్లిక్ ఇష్యూకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కంపెనీకి 6.4 కోట్ల యాప్ డౌన్ లోడ్స్ ఉన్నాయి. 100కి పైగా నగరాల్లో ఆఫ్‌లైన్ సెంటర్లూ నిర్వహిస్తోంది. గతేడాది రూ.2,886 కోట్ల ఆదాయం అందుకుంది. అలాగే రెండు రెన్యూవబుల్ ఎనర్జీ సంస్థలు కలిపి రూ.8,200 కోట్ల వరకు పబ్లిక్ ఇష్యూలకు వస్తున్నాయి. వీటితో పాటుగా పార్క్ మెడి వరల్డ్, నెఫ్రోప్లస్, ఇన్నోవాటివ్యూ ఇండియా, వీడా క్లినికల్ రీసెర్చ్, కాసాగ్రాండ్ ప్రీమియర్ బిల్డర్ లిమిటెడ్ వంటి మధ్య స్థాయి కంపెనీలు సైతం ఐపీఓలకు వస్తున్నాయి.

### ఒక్కనెలలో 2070 కోట్ల

## యుపిఐ లావాదేవీలు

**న్యూఢిల్లీ, నవంబరు 1:** దేశంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) వినియోగం మరింతగా పెరుగుతోంది. అక్టోబర్ నెలలో యూపీఐ లావాదేవీలు మరోసారి సరికొత్త రికార్డు స్థాయికి చేరాయి. ఈ నెలలో మొత్తం 20.70 బిలియన్ (2070 కోట్లు) లావాదేవీలు జరిగాయని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసిఐ) శనివారం ప్రకటించింది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే లావాదేవీల సంఖ్యలో 25 శాతం వృద్ధి నమోదైంది. ఇక లావాదేవీల విలువ పరంగా చూస్తే, అక్టోబర్‌లో రూ.27.28 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది గతేడాదితో పోలిస్తే 16 శాతం అధికం. సెప్టెంబర్ నెలలో నమోదైన రూ.24.90 లక్షల కోట్ల విలువ కంటే కూడాఇది ఎక్కువ కావడం గమనార్హం. ఎన్‌పీసీఐ డేటా ప్రకారం, అక్టోబర్‌లో రోజువారీ లావా దేవీల విలువ సగటున రూ.87,993 కోట్లుగా ఉంది. సెప్టెంబర్‌లో ఈ సంఖ్య రూ.82,991 కోట్లుగా ఉండేది. అలాగే, రోజువారీ లావాదేవీల సంఖ్య కూడా సెప్టెంబర్‌లోని 654 మిలియన్ల నుంచి అక్టోబర్‌లో 668 మిలియన్లకు పెరిగింది. యూపీఐతో పాటు ఇన్‌స్టంట్ మనీ ట్రాన్స్‌ఫర్ (ఐఎంటి) లావాదేవీలు కూడా అక్టోబర్‌లో రూ.6.42 లక్షల కోట్లకు పెరిగాయి. దేశ డిజిటల్ చెల్లింపుల రంగంలో యూపీఐ తన ఆధిపత్యాన్ని స్పష్టంగా చూపిస్తోంది. ఈ వారం విడుదలైన 'వరల్డ్‌లైన్ ఇండియా డిజిటల్ పేమెంట్స్ రిపోర్ట్' ప్రకారం, 2025 ప్రథమార్థంలో (జనవరి-జూన్) యూపీఐ లావాదేవీలు 35 శాతం వృద్ధితో 106.36 బిలియన్లకు చేరుకున్నాయి. ఈ లావాదేవీల మొత్తం విలువ రూ.143.34 లక్షల కోట్లు. ఇది భారతీయుల దైనందిన జీవితంలో డిజిటల్ చెల్లింపులు ఎంతగా భాగమయ్యాయో స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా వ్యక్తి నుంచి వ్యాపారికి (పి2బి) జరిగే లావాదేవీలు 37 శాతం పెరిగాయి. దేశవ్యాప్తంగా కిరాణా దుకాణాలు, చిన్న వ్యాపారాలు డిజిటల్ చెల్లింపులను ఎక్కువగా స్వీకరించడమే ఇందుకు ప్రధాన కారణమని నివేదిక పేర్కొంది. దీనినే "కిరాణా ఎఫెక్ట్"గా అభివర్ణించింది. అదేవిధంగా క్యూఆర్ కోడ్ ఆధారిత చెల్లింపుల నెట్‌వర్క్ కూడా 2025 జూన్ నాటికి 678 మిలియన్లకు చేరి, జనవరి 2024తో పోలిస్తే 111 శాతం వృద్ధిని నమోదు చేసింది.




### వాణిజ్యం




### లేఆఫ్ భయాలతో అమెజాన్

## ఉద్యోగులకు నిద్రకరవు!

**న్యూఢిల్లీ, నవంబరు 1:** ప్రపంచవ్యాప్తంగా అమెజాన్ సుమారు 14,000 నుంచి 30,000 కార్పొరేట్ ఉద్యోగాలను తొలగించాలని యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. సీఈఓ ఆండీ జాస్సీ సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), ఆటోమేషన్‌ను ఎక్కువగా ఉపయోగించుకోవడంలో భాగంగా ఈ కోతలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈలేఆఫ్స్ వార్తల నేపథ్యంలో, ఓ ఉద్యోగి పడుతున్న మానసిక వేదనకు సంబంధించిన రెడిట్ పోస్ట్ సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అవుతోంది. ఉద్యోగం పోతుందనే భయంతో తన స్నేహితుడు నిద్రలేని రాత్రులు గడుపుతున్నాడని, నిరంతరం ఆందోళనతో జీవిస్తున్నాడని ఓ యూజర్ పంచుకున్న అనుభవం టెక్కీలలో నెలకొన్న అనిశ్చితికి అద్దం పడుతోంది. ఉద్యోగంలో ఎంతో నైపుణ్యం ఉన్న వ్యక్తిపై లేఆఫ్స్ ఆందోళన ఎలాంటి ప్రభావం చూపుతుంది?" అనే శీర్షికతో అనే రెడిట్ గ్రూప్‌లో ఈ పోస్ట్ పెట్టారు. "నా స్నేహితుడు అమెజాన్‌లో పనిచేస్తున్నాడు. అతను ఎంతో ప్రతిభావంతుడు. ఇతరులు కనీసం అర్థం చేసుకోలేని టెక్నికల్ సమస్యలను కూడా సులభంగా పరిష్కరించగలడు. కానీ, కంపెనీలో లేఆఫ్స్ వార్తలు మొదలైనప్పటి నుంచి నిత్యం భయంతో బతుకుతున్నాడు" అని ఆ యూజర్ రాశారు. తన స్నేహితుడి పరిస్థితిని వివరిస్తూ, "రాత్రిపూట సరిగ్గా నిద్రపోవడం లేదు. కేవలం రెండుమూడు గంటలు మాత్రమే పడుకుంటున్నాడు. గతంలో ఉద్యోగం కోల్పోయిన వారికి అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున ఈమెయిల్స్ వచ్చాయని, అందుకే ఆ నోటిఫికేషన్ కోసం భయంతో మేల్కొని ఉంటున్నాడు. ఒక ఈమెయిల్ కోసం ఇంతగా భయపడటాన్ని ఊహించుకోండి. అతని ఫోనే అతనికి ఒక ఆందోళన కలిగించే వస్తువుగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం పోతుందనే భయం, అసలు ఉద్యోగం పోకముందే మనిషిని మానసికంగా విచ్ఛిన్నం చేస్తుంది. కార్పొరేట్ కంపెనీలు దీని గురించి అస్సలు మాట్లాడవని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ పోస్ట్ వైరల్ కావడంతో, చాలా మంది నెటిజన్లు తాము కూడా ఇలాంటి అనుభవాలనే ఎదుర్కొన్నామని కామెంట్లు పెడుతున్నారు. ప్రతిభ ఉన్న వ్యక్తి భయపడాల్సిన అవసరం లేదని, సులభంగా మరో ఉద్యోగం సంపాదించగలడని సలహా ఇచ్చారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.